ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-11-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 282 పేజీలు: 12 వెల: 6.50



బుధవారం న్యూఢిల్లీలో బాంబు పేలుడు సంఘటనలో గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న ప్రధాని మోడీ

# అది ఉగ్ర ఘాతుకమే

## అధికారికంగా ప్రకటించిన కేంద్ర కేబినెట్

### నిందితులెవరినీ వదిలే ప్రసక్తే లేదు..

### బాధితులు, క్షతగాత్రులకు అండగా ఉంటాం

### ప్రధాని అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి భద్రతా సమీక్ష

### భూటాన్ నుంచి రాగానే ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, నవంబరు 12:** దేశరాజధానిలో కల్లోలం సృష్టించి కారుబాంబు పేలుడు ఘటన ఉగ్రవాదుల చర్యలేనని కేబినెట్ నిర్ధారించింది. ఈసంఘటన ఖచ్చితంగా కిరాతక ఉగ్ర ఘాతుకమేనని ప్రకటించింది. ఉగ్రవాదంపై పోరును కొనసాగించాలని కేబినెట్‌లో ఏకగ్రీవ నిర్ణయం జరిగింది. ఘటనకు కారకులైనవారిని చట్టంముందు నిలబెట్టి తీరాలని చేసినతీర్మానాన్ని కేంద్ర కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. కేబినెట్ భేటీ వివరాలను సమాచార మంత్రి అశ్వినివైష్ణవ్ మీడియాకు వివరించారు. తొలుత సమావేశంలో ఈ పేలుడు ఘటనలో మృతిచెందినవారికి సంతాప సూచకంగా రెండునిమిషాలు మౌనం పాటించారు. క్షతగాత్రులు సత్వరమే కోలుకోవాలని, అమాయక పౌరులను బలితీసుకున్న ఉగ్రఘాతుకంలో ఎవ్వరినీ ఉపేక్షించేదిలేదని ప్రధానిమోడీ స్వయంగా కేబినెట్‌లోప్రస్తావించారు. దర్యాప్తుసంస్థలు శర వేగంగా దర్యాప్తును కొనసాగించాలని, >>2

**ఎన్ఐఎ డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో 'సిట్'** 2లో

# పేదల సొంతింటి కల సాకారం

## రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల ఇళ్లను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు


### వచ్చే ఉగాదికి మరో 5.9 లక్షల గృహప్రవేశాలు

### నిర్మాణంకోసం ముస్లింలకు అదనంగా రూ. 50 వేలు

### దేవగుడిపల్లె ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి



బుధవారం దేవగుడిపల్లిలో గృహ అనుమతిపత్రాలు, ఇంటి తాళాలు చూపుతున్న లబ్ధిదారులు



బుధవారం దేవగుడిపల్లిలో లబ్ధిదారులకు గృహ అనుమతిపత్రాలు అందజేస్తున్న సిఎం చంద్రబాబు

**రాయచోటి, నవంబరు12 ప్రభాతవార్త:** 2029 నాటికి ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వచ్చే ఉగాది రోజున మరో 5.90 లక్షల గృహ ప్రవేశాలు చేయిస్తామని ప్రకటించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో బుధవారం నిర్వహించిన సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3లక్షల ఇళ్లను దేవగుడిపల్లె సభా ప్రాంగణం నుంచే వర్చువల్‌గా ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి స్వయంగా ఇంటి తాళాలు అందజేశారు. సొంత స్థలాలున్న పలువురికి ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతి పత్రాలు అందజేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మంగళవారం నాడు కనిగిరిలో ఎంఎస్ఎంఇ పార్కు ప్రారంభించాం. ఆ మరుసటి రోజే పేదలకు ఇళ్లు ఇవ్వడం ఆనందంగా ఉంది. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. ఇల్లంటే కేవలం నాలుగు గోడలు కాదు... ఒక కుటుంబానికి గౌరవం, సంతోషం, భద్రత, భరోసా. 1984లో ఎన్టీఆర్ దేశంలోనే మొదటిసారిగా పక్కా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించడంతో అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినా అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో 3 >>2

# 'నమో' అంటే నాయుడు, మోడీ

### ● ఎపిలో డబులింజన్ సర్కార్ పరుగులు ● అద్భుతమైన అమరావతిని నిర్మిస్తున్నాం ● భారీ పెట్టుబడుల ఆకర్షణలో కొత్త చరిత్ర ● న్యూఢిల్లీలో యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో మంత్రి లోకేష్



బుధవారం న్యూఢిల్లీలో జరిగిన యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో మంత్రి నారా లోకేష్

**అమరావతి, నవంబరు 12, ప్రభాతవార్త:** ఆంధ్ర ప్రదేశ్‌లో ఇకపై నమోఅంటే నరేంద్ర మోడీ కాదు.. నాయుడు అండ్ మోడీ. ఇద్దరు సమర్థ నేతల నేతృత్వాన ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహిం చిన యుఎస్ - ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో మంత్రి లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అడోబ్ చైర్మన్ శంతను నారాయణ్ సంధానకర్తగా వ్యవహరించారు. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి భారీ పెట్టుబడులతో మేం చరిత్ర సృష్టిస్తున్నాం. నేను 180 బిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధిని. మా లక్ష్యం 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ. ఎపిలో మేం అధికారంలోకి వచ్చిన కేవలం 17నెలల్లో ఇప్పటివరకు 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాం.

మా రాష్ట్రంలో గూగుల 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెట్టబోతోంది. ఆర్సెలర్స్ మిట్టల్ సంస్థ భారత్ లో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ను విశాఖపట్నం సమీపంలో నిర్మించబోతోంది. ఎపిలో భారీ పెట్టుబడులు రావడానికి 3 కారణాలు ఉన్నాయి. ఒకటి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. రెండోది మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లీడర్ షిప్ ట్రాక్ రికార్డు. 3వది డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి నాలుగు దశాబ్దాల సుదీర్ఘమైన ట్రాక్ రికార్డు ఉంది. ఒకసారి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందంకుదుర్చుకున్న తర్వాత ప్రాజెక్టును >>2

# ఇమామ్‌లు, మోజన్ల వేతనాలకు 90 కోట్లు

### సిఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే జీవో

**అమరావతి, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం,సాధికారిత కోసం ఎన్డీఎ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చిన 24 గంటల్లోపే ఇమాములు, మోజన్లకు వేతనాల చెల్లింపుకు రూ.90 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం జరిగింది. బుధవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి వాడ్రేవు వినయ్ చంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్డీఎ ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు జగన్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన 2024 ఏప్రిల్, మే, జూన్‌నెలకు సంబంధించిన వేతనాలు చెల్లించేందుకు కూడా నిధులు విడుదల చేయడం జరిగిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. 2024 జులై నుంచి డిసెంబర్ వరకు ఇమాములు, మోజన్‌లకు రూ.45 కోట్లు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో విడుదల చేసి వారి వారి అకౌంటులకు జమ చేసిన విషయం మంత్రి గుర్తు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరువరకు 9 నెలల వేతనాలతోపాటు, గత ప్రభుత్వం చెల్లించకుండా >>2

# మరో భారీ పెట్టుబడి!

## నేటి ఉదయం వింటారన్న మంత్రి లోకేష్

**అమరావతి, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముందుకెళుతున్న కూటమి ప్రభుత్వం, మరో కీలక ప్రకటనకు సిద్ధమైంది. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు రాష్ట్ర రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఐదేళ్ల క్రితం రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన ఓ ప్రముఖ కంపెనీ తిరిగి రాబోతోందని ఆయన ప్రకటించారు. '2019లో కొత్త ప్రాజెక్టులను నిలిపివేసిన ఒక కంపెనీ, రేపు తుపానులా ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి వస్తోంది. పూర్తి వివరాల కోసం ఉదయం 9 గంటలకు వేచి ఉండండి' అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. 'బిగ్ అన్ వీల్' అంటూ చేసిన ఈ పోస్టుకు ఇన్‌వెస్ట్‌ఇన్‌ఎపి, చూజ్‌స్పీడ్ చూజ్‌ఎపిఅనే హ్యాష్‌ట్యాగ్‌లను జతచేశారు. రాష్ట్రంలో పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తూ, పెట్టుబడులకు స్వర్గధామంగా ఎపిని తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని ఈ హ్యాష్‌ట్యాగ్‌లు ప్రతిబింబిస్తున్నాయి. కాగా, 2019లో రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత పలు కంపెనీలు తమ కార్యకలాపాలను నిలిపివేయడం లేదా ఇతర రాష్ట్రాలకు >>2

# ఆర్జీయుకెటి శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థి ఆత్మహత్య



సృజన్ (ఫైల్)

**శ్రీకాకుళం, నవంబరు 12 ప్రభాతవార్త:** ఆర్జీయు కెటి, శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థి ప్రత్తిపాటి సృజన్ (20) బుధవారం హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుంటూరు జిల్లా పాత గుంటూరు పట్టణంలో ఎటి అగ్రహారం నాలుగో లైన్‌కు చెందిన సృజన్ 2021-22 విద్యా సంవత్సరంలో ఈ క్యాంపస్‌లో చేరాడు. ప్రస్తుతం ఈ విద్యార్థి ఇంజనీరింగ్ ఇఇ బ్రాంచ్‌లో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విద్యార్థులకు మిడ్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. తోటి విద్యార్థులంతా మిడ్ పరీక్షలు రాసేందుకు వెళ్లగా సృజన్ మాత్రం బాలుర హాస్టల్ తాను ఉంటున్న నాలుగో అంతస్తు నుంచి మొదటి అంతస్తుకు దిగి తన స్నేహితుని గదిలో ఫ్యాన్‌కు తాడు బిగించి ఉరిపోసుకున్నాడు. ఉదయం 11 గంటల సమయంలో హాస్టల్ గదికి వచ్చి తోటి విద్యార్థులు చూసేసరికి తలుపులు మూసి ఉండగా, కిటికిలోంచి చూడగా సృజన్ ఫ్యాన్‌కు వ్రేలాడి ఉన్నట్టు విద్యార్థులు గుర్తించారు. ఈ విషయాన్ని విద్యార్థులు క్యాంపస్ అధికారులకు సమాచారం ఇవ్వగా, తలుపులు పగలుగొట్టి చూశారు. సృజన్‌ను క్యాంపస్‌కు చెందిన అంబులెన్స్‌లో శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ఎస్ఐ వి.సందీప్ కుమార్, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. అనుమానస్పద మృతిగా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు >>2

# అప్రూవర్‌గా ధర్మారెడ్డి

## కల్తీ నెయ్యి కేసులో పెద్ద ట్విస్ట్

### తాజా ఇఒ సింఘాల్‌ను కేసులోకి లాగే యత్నం!

### గత బోర్డు సభ్యులు ఇక తెరపైకి!



**తిరుపతి,నవంబరు 12ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో ధర్మకర్తలమండలి(బోర్డు)నే కీలకమన్న (సుప్రీమ్ అని) వ్యాఖ్యలు చేసిన, కల్తీనెయ్యికేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఇఒ ఎవి ధర్మారెడ్డి బుధవారం అప్రూవర్‌గా మారడం సంచలనం కలిగించింది. కల్తీనెయ్యిసరఫరా, కాంట్రాక్టు టెండర్లు అప్పగించడం, నెయ్యి వినియోగం వంటి విషయాలు కూడా గత టిటిడి బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఇష్టప్రకారమే జరిగిందని సిబిఐ సిట్‌కు వివరాలు వెల్లడించడంతో పెద్దట్విస్ట్ నెలకొంది. అంతేగాక 2019 జూన్‌నెల నుండి 2020 అక్టోబర్ నెల వరకు టిటిడి ఇఒగా (ప్రస్తుతం విధుల్లోఉన్న ఇఒ) అనిల్‌కుమార్ సింఘాల్ వ్యవహరించారని సిట్‌కు ధర్మారెడ్డిచెప్పడం మరోప్రత్యేకమైన అంశం. 2019 జూన్‌నెలనుండి 2020 అక్టోబర్‌నెల వరకు టిటిడికి అవసరమైన నెయ్యి సరఫరాచేయడానికి టెండర్లు పిలిచారా?పిలిస్తే ఎక్కడెక్కడ నుండి టెండర్లు దాఖలుచేశారు, ఏఏ డెయిరీ యాజమాన్యాలు పాల్గొన్నాయి, ఎలా టెండర్లు నిర్వహించి నెయ్యి సరఫరాకు అంగీకరించారనేది ఇప్పుడు సిట్ అధికారుల ముందు తేల్చాల్సిన పెద్ద ప్రశ్న. 2020వ సంవత్సరం నుండి 2024 మేనెల వరకు సరఫరా అయిన కల్తీనెయ్యి వెనుక ఇఒగా తన పాత్ర కేవలం నిమిత్తమాత్రమేనని ధర్మారెడ్డి రెండవ రోజు బుధవారంకూడా విచారణలో అదే విషయాన్ని వెల్లడించడం ఎంతవరకు నమ్మశక్యమనేది సిట్ తేల్చేపనిలో నిమగ్నంకానుంది. రాష్ట్రంలో 2019 మే 23న వైఎస్సార్సీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నెలరోజులకు 2019 జూన్ 22న టిటిడి నూతన ధర్మకర్తలమండలి (బోర్డు) ఏర్పాటు చేశారు. అప్పటి సిఎం >>2



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

# అచ్యుతాపురం వద్ద ఘోర ప్రమాదం

### ఆటోను ఢీకొన్న బొలెరో.. ఇద్దరు మహిళలు మృతి

**జలుమూరు (శ్రీకాకుళం జిల్లా), నవంబరు 12 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలంలోని అచ్యుతాపురం హైస్కూల్ వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం టెక్కలిమండలం రావివలస ఎండల మల్లిఖార్జునస్వామిని దర్శించుకుని ఆటోలో శ్రీముఖలింగం దర్శనం చేసుకోవడానికి వస్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగినది. ప్రయాణం చేస్తున్న ఆటోను >>2



విశాఖలో సిఐఐ సదస్సుకు ముస్తాబవుతున్న ప్రాంగణం

# భాగస్వామ్య సదస్సుకు విశాఖ రెడీ

### రేపటినుండి పెద్ద ఎత్తున భేటీలు

### దేశ, విదేశాలనుంచి హాజరవుతున్న ప్రతినిధులు

### ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

**సచివాలయం,నవంబరు12,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సంయుక్తంగా నిర్వహిస్తున్న 30వ సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2025 కోసం విశాఖ సన్నద్ధం అయింది.సదసు ్సనువ విజయవంతంగా నిర్వహించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.పార్టనర్ ఇన్ ప్రొగ్రెస్ ఇండియస్ రోడ్ మ్యాప్ టు వికసిత్ భారత్ 2047 థీమ్‌తో ఈ సదసు ్స నిర్వహిస్తున్నారు.100కి పైగా విదేశీ ప్రతినిధులు పాల్గొనే అవకాశంతోపాటు పెట్టుబడులకు సంబంధించి 30కి పైగా అవగాహన ఒప్పందాలు జరగనున్నాయి. బుధవారం నుంచి సదస్సు ముగిసే శనివారం వరకు వివిధ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అవుతారు.

**నవంబర్ 13 గురువారం**

గురువారం విశాఖలో నోవటెల్‌లో పార్టనర్స్ ఇన్ ప్రొగ్రెస్ -ఇండియా-యూరప్ కోపరేషన్ ఫర్ సస్టెయినబుల్ గ్రోత్ అంశంపై జరిగే ఇండియా - యూరప్ బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాల్గొంటారు. గ్రీన్ షిఫ్ట్,సస్టైనబుల్ ఇన్నోవేషన్,యూరోపియన్ పెట్టుబడుపై >>2

13-11pg2exHMNWJQE 2_13-11pg2exHMNWJQE.qxd 12/Nov/25 11:54 PM Page 1





బుధవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన మంత్రి నారాయణ

# అమృత్ పథకం నిధులు విడుదల చేయండి

## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరిన మంత్రి నారాయణ

**విజయవాడ,నవంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపిలో నగర,పురపాలక సంస్థల అభివృద్ధికి రావాల్సిన నిధులన్నింటిని కేంద్రీకరించాలని ఏపి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. ఏపిలో మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధితో పాటు స్వచ్ఛత, మంచి నీటి వ్యవస్థ,అంతర్గత రహదారుల వ్యవస్థ పటిష్టతకు సహకరించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి నారాయణ..ఉన్నతాధికారులతో కలిసి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. మున్సిపల్ శాఖకు సంబంధించి కేంద్ర పథకాల ద్వారా రావాల్సిన నిధుల కేటాయింపు,విడుదలపై ఆయన కేంద్రమంత్రితో చర్చించారు. అమృత్ పథకం నిధులు,15వ ఆర్థిక సంఘం పెండింగ్ నిధులు విడుదల చేయాలని కోరారు. అమరావతి నగర నిర్మాణానికి మరిన్ని నిధులు అవసరం వివరించారు. ఎపిలో నగరాల అభివృద్ధికి సహకరించాలని కోరారు, మంత్రి నారాయణ విజ్ఞప్తిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారు.

# 'నమో' అంటే నాయుడు, మోడీ

>> మాదిగా భావించి పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. పూర్తి పారదర్శకమైన విధానాలు అనుసరిస్తుండటంతో ఒకరివెంట మరొకరు ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఎఐ, క్వాంటమ్ వంటి అధునాతన సాంకేతికలను అందిపుచ్చుకుంటూ క్లస్టర్ బేస్డ్ అభివృద్ధికి మేం ప్రాధాన్యతనిస్తున్నాం. హైదరాబాద్ ఐఎస్‌బి నమూనాలో ఆంధ్రప్రదేశ్‌లో ఎఐ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. మా ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొత్త నగరాలు నిర్మించిన ట్రాక్ రికార్డు ఉంది. ఇప్పుడు అమరావతి మాదిరిగానే గతంలో సైబరాబాద్ నిర్మించారు. సింగపూర్ ఆర్కిటెక్టుల ద్వారా కృష్ణానది పరీవాహకంలో గుంటూరు - విజయవాడల నడుమ సుందరమైన అమరావతి నగర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సమయం నడుస్తోంది. గూగుల్, మెటా, ఆర్సెలర్ మిట్టల్ వంటి భారీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా మీ కళ్లముందే చరిత్ర సృష్టించబోతున్నాం. మీరు మా రాష్ట్రాన్ని సందర్శించి మేం అమలు చేస్తున్న విధానాలను పరిశీలించండి. 2047 నాటికి భారత్ ప్రపంచంలో నెం.1గా ఉండాలన్నదే మా ఆకాంక్ష. పరిశ్రమల ఆకర్షణకు హాస్పిటాలిటీ కూడా చాలా ముఖ్యం. ఇందుకోసం రాబోయే అయిదేళ్లలో 50వేల హోటల్ రూమ్‌లను సిద్ధం చేయాలని నిర్ణయించాం. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. ఐటి శాఖ ద్వారా భవిష్యత్ సాంకేతికలను యువతకు అందించేం దుకు ఆశాఖను చేపట్టాను. దేశంలో హెచ్‌ఆర్‌డి, ఐటి శాఖల కలసి నిర్వహించిన మంత్రిని తాను మాత్రమే నని మంత్రి లోకేష్ చెప్పారు.

# అది ఉగ్ర ఘాతుకమే

>> సమగ్ర దర్యాప్తుతో నిందితులను ఎవ్వరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేకుండా చర్యలు తీసుకోవాలని ఏజెన్సీలకు సూచించింది. అలాగే సంఘటనకు సంబంధించి దర్యాప్తు సంస్థలు స్పందించిన తీరును కేబినెట్ ప్రశంసించింది. సకాలంలో వారికి వైద్యసేవలు అందించిన వైద్యులు, ఇతర సిబ్బంది కృషి ప్రశంసనీయమని పేర్కొంది. ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం కొనసాగించాల్సిందేనని అభిప్రాయపడింది. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు మద్దతుగా వచ్చిన వివిధ దేశాధినేతల సందేశాలను స్వాగతిస్తూ వారికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానించారు. నగరంలోని ఎర్రకోటవద్ద జరిగిన కారుబాంబు పేలుడుకు సంబంధించి ప్రధానిమోడీ అత్యున్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అంతకుముందు జరిగిన భద్రతా వ్యవహారాల కేబినెట్‌కమిటీ సమావేశం కూడా ప్రధాని మోడీ తన నివాసంలో జరిగింది. సాయంత్రం 5.30 గంటలకు జరిగిన ఈ సమావేశంలో మొత్తం పరిస్థితికి సంబంధించిన నివేదికలను కోరారు. అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న దర్యాప్తు వివరాలను కూడా ఈసందర్భంగా అధికారులు ప్రధానికి వివరించారు. 12 మంది చనిపోయారని, 25 మందికిపైగా గాయపడ్డారని, కారును పదిరోజులముందే కొనుగోలుచేయడం, రెండేళ్లుగానే కుట్రలుచేస్తూ రిపబ్లిక్‌డే రోజున ఏకకాలంలో పలు చోట్ల పేలుళ్లకు కుట్రలుచేసినట్లుగా దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాలను ప్రధాని మోడీకి వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, దర్యాప్తు ఏజెన్సీల సీనియర్ అధికారులు ఇంటెలిజెన్స్ అధికారులు, ఎన్‌ఎస్ఎ అజిత్‌దోభాల్ తదితరులు హాజరయి ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. నిందితులు ఎట్టిపరిస్థితుల్లోను ఉపేక్షించబోమని ఉగ్రవాదానికి తావులేదని, చట్టంముందుకు తీసుకురావాల్సిందేనని అధికారులకు మోడీ స్పష్టంచేసినట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఎగుమతుల ప్రోత్సాహక మిషన్‌కు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్‌సమావేశంలో చర్చించి ఆరేళ్లపాటు కొనసాగే ఈప్రాజెక్టుకు రూ.25,060 కోట్లు కేటాయించారు. ఎగుమతుల ఎకో సిస్టమ్‌ను మరింత బలోపేతంచేసేందుకే ఈ మిషన్‌ను తెచ్చినట్లు మోడీ వివరించారు.ఎగుమతిదారులకోసం క్రెడిట్ గ్యారంటీ పథకం విస్తరణకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

**ఎల్‌ఎన్‌జె ఆసుపత్రిలో బాధితులకు పరామర్శ**

అంతకుముందు భూటాన్ పర్యటనను ముగించుకుని భారత్‌కు వచ్చిన ప్రధాని మోడీ ఎయిర్‌పోర్టునుంచే నేరుగా లోక్‌నాయక్ జయప్రకాష్‌నారాయణ్ ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. సంఘటన జరిగిన తీరు, నెలకొన్నపరిస్థితులను వారినుంచే అడిగి తెలుసుకున్న ప్రధానిమోడీ బాంబుపేలుడు కుట్రదారులను న్యాయస్థానం ముందు నిలబెడతామని, మీకు అండగా మేం ఉన్నామంటూ బాధితులకు భరోసా ఇచ్చారు. బాధితులు సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షించారు. అక్కడే ఉన్న అధికారులు, వైద్య నిపుణులనుంచి వివరాలు తీసుకున్నారు. చికిత్స అందుతున్న తీరుపై ఆరాతీసారు. ఆసుపత్రి సందర్శించిన తర్వాత ప్రధానిమోడీ తన ఎక్స్ ఖాతాలో స్పందించారు. ఢిల్లీ పేలుడులో గాయపడిన వారిని ఎల్‌ఎన్‌జె ఆసుపత్రిలో కలిసానని, వారంతా సత్వరమే కోలుకోవాలనిప్రార్థిస్తున్నానని తెలిపారు. హేయమైన కుట్రకు పాల్పడినవారిని తప్పక న్యాయస్థానంముందు నిలబెడతామని ఆయన అన్నారు.

# భారీ పెట్టుబడి!

>> తరలివెళ్లడం జరిగిందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆగిపోయిన ప్రాజెక్టులను పునఃప్రారంభించడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది.ఈ నేపథ్యంలో, లోకేష్ ప్రకటించిన ఆ సంస్థ ఏది? ఎంత పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టబోతోంది? అనే అంశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సస్పెన్స్‌కు తెరపడాలంటే గురువారం ఉదయం 9 గంటల వరకు వేచి చూడాల్సిందే.

# పేదల సొంతింటి కల సాకారం

>> లక్షల ఇళ్ళు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశాం. పీఎంఏవై బీఎల్సీ కింద 2,28,034 ఇళ్లు, పీఎంఏవై గ్రామీణ్ కింద 65,292 ఇళ్లు, పీఎంఏవై జన్మన్ కింద 6,866 ఇళ్ల మొత్తం కలిపి 3,00,192 ఇళ్ల నిర్మించాం" అని సిఎం చంద్రబాబు తెలిపారు.

**గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను కూల్చేసింది**

"2014-2019 మధ్య రూ.16 వేల కోట్ల వ్యయంతో 8లక్షల ఇళ్లు పూర్తి చేశాం. గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను చిదిమేసింది. 4.73 లక్షల ఇళ్లు రద్దు చేయడమే కాకుండా... 2.73 లక్షల మంది లబ్ధిదారు లకు చెల్లించాల్సిన రూ.900 కోట్లు బకాయిలు పెట్టింది. ఆ బకాయిలను చెల్లించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. గత పాలకులు గృహ నిర్మాణ రంగాన్ని నిర్వీర్యం చేశారు. నివాస యోగ్యం కాని చోట్ల పేదలకు స్థలాలు ఇచ్చారు... ఇళ్ల నిర్మాణం ముందుకు సాగకుండా వదిలేశారు. ఇళ్ల స్థలాల పేరుతో స్కాం చేశారు. చదును చేసే పేరుతో అవినీతికి పాల్పడ్డారు. చివరకు ఇసుకలోనూ కోట్లు దోచుకున్నారు. ఐదేళ్లలో కేంద్రం డబ్బులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకున్నారు. ఇది పేదల ప్రభుత్వం. పేదలకు న్యాయం చేయడం కోసం అనునిత్యం పని చేస్తున్నాం. ఇళ్ల నిర్మాణానికి కేంద్రం ఇచ్చే డబ్బే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇస్తోంది. పట్టణ ప్రాంతాల్లో రూ.2.50 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ.2 లక్షలు ఆర్థిక సాయం చేస్తోంది. దీనికి అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50,000, ఎస్టీలకు రూ.75,000, పీవీటీజీలకు రూ.1,00,000 చొప్పున ఇస్తున్నాం. ఇకపై ముస్లింలకు కూడా రూ.50 వేలు అదనంగా అందజేస్తాం. దాదాపు 6 లక్షల మంది ఇళ్లు కట్టుకునే స్థోమత లేక నిలిపేశారు. వీటిని పూర్తి చేసేందుకు మేం సహకరిస్తాం. ఈ నిర్ణయంతో 3.73 లక్షల మంది బిసిలకు, 1.57 ఎస్సీలకు, 46 వేల మంది ఎస్టీలకు, 22 వేల మంది గిరిజనులకు మేలు జరుగుతుంది. ఈ అదనపు సాయం వల్ల ప్రభుత్వానికి రూ.3,220 కోట్ల ఖర్చవుతుంది. ఇంటి నిర్మాణాలు చేపట్టడంతోపాటు... తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, గ్యాస్ కనెక్షన్, సోలార్ విద్యుత్, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**అన్ని వర్గాలకు న్యాయం చేస్తాం**

"సుస్థిర ప్రభుత్వంతోనే సుపరిపాలన, అభివృద్ధి సాధ్యం. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామిక వేత్త తయారు కావాలి. డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేస్తాం. రూ.50 వేల కోట్ల బ్యాంకు రుణాలు తీసుకున్న పొదుపు మహిళలు సకాలంలో చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంటిపైనే కరెంటు తయారు చేసుకునేలా సోలార్ ఏర్పాట్లు చేస్తాం. ఒకప్పుడు పొలంలో పంటలు పండేవి. ఇప్పుడు కరెంటు ఉత్పత్తి చేసే పరిస్థితి వచ్చింది. గత ప్రభుత్వం తాగునీటి పథకాలను కూడా నిర్వీర్యం చేసింది. జల్ జీవన్ మిషన్ ద్వారా కేంద్రం ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షి త నీరు ఇవ్వాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం పులివెందులకు కూడా నీరివ్వలేదు. త్వరలో పులివెందులకూ తాగునీరు అందిస్తాం. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ అమలు చేశాం. మహిళలకు దీపం పథకం కింద ఉచితగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. అర్హులకు పింఛన్లు, తల్లికి వందనం, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. రైతులకు మూడు విడతలుగా ఆర్థిక సాయం అందించేలా అన్నదాత సుఖీభవ పథకాన్నీ అమలు చేస్తున్నాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 మందిని ఉపాధ్యాయులుగా భర్తీ చేశాం. కూటమి ప్రభుత్వం వచ్చిన 17 నెలల కాలంలో రూ. 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు ఒప్పందాలను కుదుర్చుకున్నాం. విశాఖ సిఐఐ సదస్సులో మరో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకుంటాం. 20లక్షల మందికి ఉద్యోగాల కల్పన హామీకి కట్టుబడి ఉన్నాం. ఐదేళ్లలో కనీసం రోడ్లపై గుంతలు పూడ్చలేకపోయారు. కూటమి ప్రభుత్వం రాగానే రూ.500 కోట్లు విడుదలచేసి రోడ్లన్నీ మరమ్మతులు చేస్తున్నాం. ప్రజలుకూడా తమ ఆలోచన విధానాన్ని మార్చుకో వాలి. కులం, మతం, ప్రాంతం అని చూడకుండా... మంచి చేసే వారిని ఆశీర్వదించాలి." అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**నదుల అనుసంధానంతో కరువుకు చెక్**

"నదుల అనుసంధానం నా జీవిత ఆశయం. గంగా-కావేరి అనుసంధానం జరిగితే దేశంలో కరువు అనే మాట వినపడదు. సాగునీటి ప్రాజెక్టులను నేను ఎన్నడూ నిరక్ష్యం చేయలేదు. కరువు రహిత రాష్ట్రంగా ఎపిని తయారు చేస్తాం. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో తాగు, సాగు నీటి కొరత లేకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నాం. వెనిగళ్లు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. మరో రూ.22 కోట్లు ఇస్తే మరిన్ని చెరువులకు నీరు అందే అవకాశం ఉండటంతో వెంటనే మంజూరు చేస్తున్నాం. వచ్చే ఏడాదికి శ్రీనివాసపురం రిజర్వాయర్ పూర్తి చేస్తాం. ఇక్కడ నుంచి చిత్తూరుకు హంద్రీనీవా నీరు మళ్లిస్తాం. అలాగే మొదటి ఫేజ్ లో నల్లమల సాగర్ ద్వారా వెలుగొండకు నీళ్లు తెస్తాం. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నాం. 2029 నాటికి స్వర్ణాంధ్ర సాకారం దిశగా అడుగులు వేస్తున్నాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారధి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వేతనాలకు 90 కోట్లు

>> పెండింగ్‌లో పెట్టిన మూడు నెలల వేతనాలను కూడా కూటమి ప్రభుత్వం ఒకేసారి చెల్లించేందుకు రూ.90 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. మైనారిటీల పక్షపాతి చంద్రబాబు అని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి నేటి వరకు మైనారిటీల సంక్షేమానికి చంద్రబాబు ఒక విజయంతో చేస్తున్న కృషి రాష్ట్రంలోని మైనార్టీలు ఎప్పటికీ మరువలేరని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మైనారిటీ ల సంక్షేమాన్ని పూర్తిగా అణగదొక్కే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కార్యాచరణ బద్ధంగా ముందుకు సాగుతుందని అన్నారు. ఇమాములకు, మోజాన్లకు గౌరవ వేతనం చెల్లింపుకు టిడిపి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు శ్రీకారం చుట్టారని, అయితే వైసిపి ప్రభుత్వ హయాంలో ఒక పక్క చెల్లింపుల్లో జాప్యం, మరోపక్క నెలల తరబడి చెల్లింపులు నిలిపివేశారని విమర్శించారు. మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో ఇచ్చిన హామీని కేవలం 24 గంటల లోపే నెరవేర్చి, రూ.90 కోట్లు విడుదల చేస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయానికి ముస్లిం సమాజం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మైనారిటీ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# విద్యార్థి ఆత్మహత్య

>> చేస్తున్నారు. గుంటూరుకు చెందిన సృజన్ తండ్రి కృష్ణప్రసాద్ ఆటో డ్రైవర్ కాగా, తల్లి జ్యోతి గృహిణి. ఈ దంపతులకు ఇద్దరు సంతానం, కాగా, వీరిలో సృజన్‌తో పాటు సోదరి ఉన్నారు. విద్యార్థి సృజన్ మృతిపై పలు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. తృతీయ సంవత్సరం చదువుతున్న ఈ ఫిల్మ్ మేకింగ్ పట్ల ఆసక్తి చూపేవాడని తోటి విద్యార్థులు చెబుతున్నారు.అయితే ఆత్మ హత్యకు గల కారణాలపై పూర్తిస్థాయి పోలీసులు దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెల్లడవు తాయి.

ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్‌లో విద్యార్థి సృజన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు క్యాంపస్‌ను సందర్శించారు. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న గదిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వివరాలను ఆరా తీశారు. విద్యార్థుల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని పర్యవేక్షణ పెంచాలని అధికారులకు సూచించారు.

## వారం - వర్జ్యం

13-11-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
అశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
నవమి రా.11.38
మఖ రా.7.42, విశాఖ కార్తె
వర్జ్యం : తె.4.16-5.59
దు.ఉ.9.59-10.45, 2) మ.2.32-3.18
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఇంటా బయటా మీదే పై చేయిగా వుంటుంది. భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**వృషభం:** కీలక విషయాలలో ఆప్తుల సలహాలు తీసుకుంటారు. భాగస్వామ్య వ్యాపారాలలో అధిక లాభాలు పొందుతారు.

**మిథునం:** నూతన పెట్టుబడులకు అనుకూలంగా వుంటుంది. ప్రముఖులతో పరిచయాలు.ఇతరుల విషయాలలో జోక్యం తగదు.

**కర్కాటకం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. సహాయం కోసం ప్రత్యర్థులు మీ దగ్గరకు రావడం విశేషం.

**సింహం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. విదేశీయాన అవకాశాలు కలిసివస్తాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా పూర్తి చేస్తారు, వాహనసౌఖ్యం. సహాయం కోసం ప్రత్యర్థులు మీ దగ్గరకు రావడం విశేషం.

**తుల :** నూతన వ్యక్తులు పరిచయమై చేయూతనందిస్తారు. వివాహయత్నాలు. బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**వృశ్చికం:** కుటుంబ సమస్యలు నుండి బయట పడతారు. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల జాగ్రత్త అవసరం. సోదరుల నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వస్తు సేకరణ.ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు పొందుతారు.

**మకరం:** స్వగృహం ఏర్పరచుకోవడానికి ఎంతగానో శ్రమించి కొంత పురోభివృద్ధి సాధిస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**కుంభం:** సౌందర్య చిట్కాల పట్ల ఆకర్షితులవుతారు. స్వల్ప ధనలాభం. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**మీనం :** ఋణాలు సకాలంలో చెల్లించరు. దీనికి ప్రత్యేకమైన కారణం ఏమీ ఉండదు. సంతానం నుండి కీలక సమాచారం అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోల, హైదరాబాద్

# అప్రూవర్‌గా ధర్మారెడ్డి

>> వైఎస్ జగన్మోహన్ రెడ్డికి స్వయాన బాబాయి వైవి సుబ్బారెడ్డిని ఛైర్మన్‌గా నియమించారు. ఆయన నేతృత్వంలో 38మంది వరకు జంబో పాలకమండలి ఏర్పాటైంది. ఆ సభ్యుల్లో కొందరు కీలకంగా కొనుగోళ్ల కమిటీలో సభ్యులుగా కూడా వ్యవహరించారు. మరీవారందరినీ ఇక సిట్ విచారణకు పిలుస్తుందా? లేక రేపోమాపో మాజీఛైర్మన్ వైవి సుబ్బా రెడ్డిని,మరోమాజీఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిని విచారణ పేరుతో పిలిచి అరెస్ట్ చేస్తారా అనేది సర్వత్రా ఉత్కంఠ కలిగించే విషయంగా మారింది. 2020వ సంవత్సరం నుండి 2024మేనెల వరకు తిరుమలకు నెయ్యిసరఫరాలో కీలకంగా వున్న డెయిరీ యాజమాన్యం, నిర్వాహకులతోబాటు కాంట్రాక్టర్లను ఇప్పటికే సిట్ పలు కోణాల్లో విచారణ చేసి ఆధారాలు రాబట్టి అరెస్ట్ చేసేసింది. వారంతా రిమాండ్‌లో కటాకటాల్లో ఉన్నారు. ఇద్దరుముగ్గురు బెయిల్‌పై బయట వున్నారనేది సమాచారం. ఇప్పుడు గత ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పిఎ చిన్నఅప్పన్న,కల్తీలో రసాయనాలు సరఫరా చేసిన అజయకుమార్‌ను కస్టడీకితీసుకునేందుకు సిట్ అధికారులు ఎసిబి కోర్టును ఆశ్రయించారు. 14న ఈ విషయంపై న్యాయమూర్తి తీర్పువెలువడించనున్నారు.

**అప్రూవర్‌గా మారినా...వైవి సాక్ష్యాధారాలే కీలకం:**

టిటిడిలో గత నాలుగేళ్లలో కర్త,కర్మ,క్రియగా సర్వంతానై అప్పటి టిటిడి అదనపు ఇఒ, ఆతరువాత ఇఒగా పాలనబాధ్యతలు నిర్వహించిన ఎవి ధర్మారెడ్డి కల్తీనెయ్యి కేసులో సులభంగా అప్రూవర్‌గా మారినా ఆయన వ్యవహారంపై సిట్ అధికారులు మరోసారి లోతుగా విచారణ చేసే అవకాశం లేకపోలేదనేది కీలకంగా మారింది.2019లో వైఎస్సార్సీ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలం తరువాత కేంద్ర రక్షణశాఖ విభాగంలో ఉన్న ఎవి ధర్మారెడ్డిని టిటిడికి డిప్యూటేషన్‌పై అప్పటి సిఎం జగన్మోహన్‌రెడ్డి తీసుకువచ్చారు. 2020 అక్టోబర్‌లో ఇఒ సింఘాల్ బదిలీతో ఆ స్థానంలో ఇఒగా డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, అదనపు ఇఒ హోదాలో ఎవి ధర్మారెడ్డికి బాధ్యతలు అప్పగించారు.అప్పటినుండి అదనపు ఇఒ హోదాలో ధర్మారెడ్డి సర్వంతానై వ్యవహరించారనే విమర్శలు పెద్దదుమారం రేపాయి. టిటిడిలో మరీ తిరుమలలో కర్త,కర్మ,క్రియ అన్నీ ధర్మారెడ్డి కనుసైగల్లోనే నడిచిందనే విషయాన్ని అప్పటి టిటిడి బోర్డు వాదనలు. అప్పటి బోర్డు ఛైర్మన్‌గా ఉన్న వైవి సుబ్బారెడ్డి చెప్పే కొన్ని విషయాలను ధర్మారెడ్డి అంగీకరించలేదని, దర్శన కోటా పెంపు, వసతి సౌకర్యం, ప్రతిశుక్రవారం అభిషేక సేవలో హాజరయ్యే విషయంపై మాటామాటా వాదనలు జరిగాయనేది గుప్పుమంది. అయితే ఈ విషయాలపై సిఎంగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి వరకు వెళ్ళినా అప్పటి బోర్డునే మందలించిన సందర్భాలు లేకపోలేదనేది ఆ రోజుల్లో తిరుమలలో వినిపించిన ప్రధాన విమర్శలు. ఇదే బాటలో రెండవసారి ఛైర్మన్‌గా కూడా సుబ్బారెడ్డి బాధ్యతలు చేపట్టడానికి విముఖత చూపడం కూడా అప్పట్లో పెద్ద చర్చసాగింది. తమతో అన్ని విధాలా విబేధించే ధర్మారెడ్డితో కలసి పనిచేయలేనని కూడా జగన్‌కు వివరించినట్లు గతంలోనే వైసిపి వర్గాల కథనం. అయినా 2020 అక్టోబర్‌నుండి 2024 మేనెలాఖరు వరకు టిటిడిలో అదనపు ఇఒగా, ఇఒగా కూడా ధర్మారెడ్డి బాధ్యతలు నిర్వహించడం ప్రత్యేక చర్చనీయాంశమే. 2024 జూన్ 16న టిటిడి ఇఒగా శ్యామలరావు బాధ్యతలు చేపట్టిన తరువాత లడ్డూల నాణ్యత, రుచిపై లోతుగా అన్ని కోణాల్లో అధ్యయనం చేశారు. అటు కొనుగోళ్ళ కమిటీనుండి ఇటు మార్కెటింగ్ చివరకు పోటు విభాగంలో వైష్ణవ బ్రాహ్మణులతో మాట్లాడి ఎక్కడ లోపం ఉందనే విషయాన్ని వెలుగులోకి తీసుకువచ్చారు. వైష్ణవ బ్రాహ్మణులు కూడా ప్రధానంగా నెయ్యి నాణ్యత లేకపోవడమేనని మౌఖికంగా అభిప్రాయాలు తెలిపారు. ఈ నేపథ్యంలో తిరుమలకు వచ్చిన నెయ్యికల్తీ జరిగిందనేది ఎన్‌డిడిబి కూడా తేల్చిన ప్రధాన అంశం. గత ఏడాది జూలై,ఆగస్ట్ నుండి ఇప్పటికీ కల్తీనెయ్యి బాగోతం దర్యాప్తు, విచారణలు సాగుతుండటం ప్రధానంగా మారింది. తాజాగా బుధవారం మాజీ ఇఒ ధర్మారెడ్డి అప్రూవర్‌గా మారి టిటిడిలో లోపాలు, గత బోర్డు పెద్దల తప్పిదాలు సిట్‌కు వెల్లడించడంతో మరీ ఇక జరగబోయే తతంగం మరింత వేడిపుట్టించేలా ఉంది.



బుధవారం దేవగుడిపల్లిలో జరిగిన బహిరంగ సభకు అసంఖ్యాకంగా హాజరైన ప్రజలు

# రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి రాష్ట్ర పర్యటన ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష

**అమరావతి, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి :** ఈనెల 20న తిరుపతి,22న పుట్టపర్తిలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన,ఈనెల 14న భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ విశాఖపట్నం పర్యటన, ఈనెల 19న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టపర్తి పర్యటన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం రాష్ట్ర సచివాలయం నుండి వివిధ శాఖల అధికారులతో వీడియో సమావేశం ద్వారా చేయాల్సిన ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ దేశ అత్యున్నత ప్రముఖులైన వారి వారి పర్యటనలకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఏర్పాట్ల విషయంలో ఏలాంటి లోపాలకు ఆస్కారం లేని రీతిలో విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను సిఎస్ విజయానంద్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా పర్యటనల పర్యవేక్షణ రాష్ట్ర నోడలు అధికారైన టిఆర్ అండ్బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యంటి కృష్ణబాబు, జిఏడి ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, శాంతి భద్రతల అదనపు డిజి మధుసూదన రెడ్డి, వర్చువల్ గా తిరుపతి,సత్యసాయి జిల్లాల కలక్టర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


# ఎన్ఐఎ డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో 'సిట్'

**న్యూఢిల్లీ, నవంబరు 12:** ఢిల్లీ పేలుడు కేసును దర్యాప్తు చేసేందుకు సీనియర్ ఐపీఎస్ అధికారి, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ విజయ్ సఖారే నేతృత్వంలో స్పెషల్ టీమ్ ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లో ఒక ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఇద్దరు డిప్యూటీ జనరల్ ఆఫ్ పోలీస్‌లు, ముగ్గురు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌లు, మిగతా ముగ్గురు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ కేసు విచారణ కోసం ఎన్ఐఎ జమ్ముకశ్మీర్ పోలీసుల నుంచి, ఢిల్లీ పోలీసుల నుంచి, హర్యానా పోలీసుల నుంచి జైష్ ఏ మహ్మద్‌కు సంబంధించిన అన్ని కేసుల డైరీలను సేకరించనుందని అధికారులు తెలిపారు. తద్వారా జైష్ ఎ ఉగ్రవాద కార్యకలాపాల నిర్వహణకు, ఆర్థికపరంగా ఎవరు సహకరిస్తున్నారనే విషయాన్ని గుర్తించే పనిలో ఉంది. ఉగ్రవాదుల కదలికలను తెలుసుకునేందుకు ఎన్ఐఎ ఇప్పటికే 1000కి పైగా సీసీ ఫుటేజ్‌లను స్కాన్ చేసింది. అదేవిధంగా సోషల్ మీడియా యాక్టివిటీస్‌ను కూడా పర్యవేక్షిస్తోంది. ఢిల్లీలోని వివిధ ప్రదేశాల నుంచి మొబైల్ డాటాను కూడా సేకరిస్తోంది. కాగా విజయ్ శేఖర్ కేరళ క్యాడర్‌కు చెందిన 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. గతంలో ఆయన ఎన్ఐఎలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా సేవలు అందించారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సఖారే ఎన్ఐఎ డిజిగా నియమితులయ్యారు. కేసు దర్యాప్తులో భాగంగా సఖారే ఇవాళ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌తో సమావేశమయ్యారు.

# సిఎం చంద్రబాబుతో భారత్ ఫోర్జ్ వైస్ ఛైర్మన్ భేటీ

## రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించిన ముఖ్యమంత్రి

## షిప్ బిల్డింగ్, ఎలక్ట్రానిక్స్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులకు భారత్ ఫోర్జ్ ఆసక్తి




**విశాఖ, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో నౌకా నిర్మాణంతో పాటు పర్యాటక ప్రాజెక్టులు చేపట్టేందుకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పెట్టుబడుల సదస్సు కోసం విశాఖ చేరుకున్న సిఎంతో ప్రముఖ పారిశ్రామిక దిగ్గజ కంపెనీ భారత్ ఫోర్జ్ వైస్ ఛైర్మన్ అమిత్ కల్యాణి భేటీ అయ్యారు. రాష్ట్రంలో షిప్ బిల్డింగ్‌తో పాటు అడ్వాన్స్డ్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిపై ఆసక్తిగా ఉన్నామని అమిత్ కల్యాణి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వెల్లడించారు. ఎపిలో నౌకా నిర్మాణంతో పాటు ఎలక్ట్రానిక్స్ రంగంలో అడ్వాన్స్డ్ ఉత్పత్తుల తయారీకి సంబంధించి పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమని అమిత్ కల్యాణి సిఎంకు వివరించారు. తిరుపతి సమీపంలో అడ్వాన్స్డ్ ఎలక్ట్రానిక్ సెన్సార్ల ఉత్పత్తిని చేపట్టాలని భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే పర్యాటక రంగంలోనూ కొన్ని ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నట్టు అమిత్ కల్యాణి సిఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వాణిజ్య నౌకలతో పాటు డిఫెన్సు నౌకల నిర్మాణానికి విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని.. ప్రస్తుతం ఈ రంగంలో భారత్‌లో తయారీ అతి తక్కువగా ఉందని దీనిని దేశంలోని కంపెనీలు వినియోగించుకోవాల్సి ఉందని అన్నారు. భారత్‌ఫోర్జ్ సంస్థ చేపట్టే ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఎపి ప్రభుత్వం పూర్తిసహకారం అందిస్తుందని సిఎం స్పష్టం చేశారు.

# భాగస్వామ్య సదస్సుకు విశాఖ రెడీ

>> చర్చలు జరుపుతారు.మధ్యాహ్నం తైవాన్,ఇటలీ,స్వీడన్,నెదర్లాండ్స్ ప్రతినిధులతో బేటీలు ఉన్నాయి. ఎస్పీపి పంప్స్ లిమిటెడ్,రెన్యూ పవర్.,బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్,మురుగప్ప గ్రూప్,జూల్ గ్రూప్,హీరో ఫ్యూచర్ ఇంజనీర్స్ ప్రతినిధిలతో సిఎం సమావేశమై చర్చిస్తారు.సాయంత్రం వైజాగ్ ఎకనామిక్ రీజియన్ కార్యక్రమంలో పాల్గొంటారు.

**నవంబర్ 14 శుక్రవారం**

30వ సిఐఐ భాగస్వామ్య సదస్సును భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ ప్రారంభించనున్నారు.ఏపి పెవిలియన్ ప్రారంభోత్సవంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ కూడా పాల్గొంటారు. యూసుఫ్‌ఆలీ, బాబా కళ్యాణి,కరణ్ అధాని వంటి విశిష్ట అతిధులు దీనికి హాజరుకానున్నారు.సదస్సు ప్రారంభ కార్యక్రమం తర్వాత టెక్నాలజీ,ట్రస్ట్,ట్రైట్ సెషన్ జరగనుంది.మధ్యాహ్నం జరిగే ఏఐ ఫర్ వికసిత్ భారత్ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. సింగపూర్ నుంచి విజయవాడకు నేరుగా విమాన సర్వీసులు నడిపేలా రాష్ట్ర ప్రభుత్వం సింగపూర్ ప్రతినిధులతో ఒప్పందం చేసుకోనుంది.సాయంత్రం రాష్ట్ర ఆర్థికశాఖ నిర్వహించే రీఇమేజింగ్ పబ్లిక్ ఫైనాన్స్ సమ్మిట్ లో సీఎం పాల్గొంటారు.సంజీవ్ గోయంగా గ్రూప్ వైస్ ఛైర్మన్‌తో సమావేశమై అనంతరం విశాఖలో లులూ నిర్మించే నూతన మాల్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు.రాత్రికి వివిధ కంపెనీలు ప్రభుత్వ ప్రతినిధులు,ఆహ్వానితుల గౌరవార్థం ఇచ్చే గాలా డిన్నర్‌లో పాల్గొంటారు.

**నవంబర్ 15 శనివారం**

సదస్సు రెండో రోజు శనివారం,ఉదయం బ్లూమ్‌బెర్గ్ మీడియాతో ఇంటరాక్షన్‌లో సీఎం పాల్గొంటారు.తర్వాత రేమాండ్,శ్రీసిటి,ఇండోసోల్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు.అలాగే బహ్రెయిన్,న్యూజిలాండ్,కెనడా, జపాన్ ప్రతినిధులతో భేటీ అవుతారు.మధ్యాహ్నం వరల్డ్ ఎకనామిక్ ఫోరానికి చెందిన సెంటర్ ఫర్ ఫ్రంటయిర్ టెక్నాలజీను ప్రారంభిస్తారు.అనంతరం గూగుల్‌సంస్థ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం ఏంవోయుల మార్పిడి కార్యక్రమం నిర్వహించనున్నారు.చివరిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియా సమావేశం నిర్వహిస్తారు.భాగస్వామ్య సదస్సుతో సాధించిన ఫలితాలను వివరిస్తారు.

# అచ్యుతాపురం వద్ద ఘోర ప్రమాదం

>> బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు చనిపోయినట్లు ఎస్సై అశోక్ బాబు తెలిపారు. లావేరు మండలం గుర్రాలపాలెంనకు చెందినవారని తెలిపారు. చనిపోయిన మహిళలు అచ్చయ్యమ్మ (50), పద్మావతి(40)లను నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపినట్లు ఎస్సై అశోక్ బాబు పేర్కొన్నారు. ఆటోలో ఉన్న మిగిలిన వారికి చిన్నచిన్న గాయాలయ్యాయని వీరికి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు. ముందుగా ప్రథమ చికిత్స అచ్యుతాపురం వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి, వైద్య సిబ్బంది నిర్వహించారు. ప్రమాదం సంభవించిన వెంటనే స్థానిక ఎమ్మార్వో జె.రామారావు, పోలీస్ సిబ్బంది సహాయక చర్యలు అందించారు. ఈ కేసును స్థానిక ఎస్సై అశోక్ బాబు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

13-11Pg3exHMNWJQEKP 3_13-11Pg3exHMNWJQEKP.qxd 12/Nov/25 11:29 PM Page 1





వేదికపై ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

# సమాజం రుణం తీర్చుకోవడం మన బాధ్యత : గవర్నర్ అబ్దుల్ నజీర్

**కర్నూలు నవంబర్ 12 ప్రభాతవార్త ప్రతినిధి** అందరినీ ఉన్నతంగా తీర్చిదిద్దిన విద్యాసంస్థకు, సమాజానికి ఋణం తీర్చుకోవడం మీ అందరి ప్రాథమిక కర్తవ్యం, బాధ్యత, అది మీకుకూడా ఎంతో సంతృప్తిని ఇస్తుందంటూ రాయలసీమ విశ్వవిద్యాలయ నాల్గవ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ మరియు విశ్వ విద్యాలయ ఛాన్సలర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ తెలుగుభాషలో ఆకాంక్షించారు. వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి డిగ్రీలు స్వీకరిస్తున్న విద్యార్థులంతా తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయానికి చేరుకున్న వెంటనే ఎన్ సి సి విద్యార్థులనుండి గవర్నర్ గౌరవవందనం స్వీకరించారు. అనంతరం స్నాతకోత్సవ వేడుకలను ప్రారంభించారు. ముందుగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి. వెంకట బసవరావు వర్సిటీ ప్రగతి నివేదికను వివరించారు. వర్సిటీలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను, జరుగుతున్న పరిశోధనలను తెలియజేశారు. రాయలసీమ విశ్వవిద్యాలయం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా విశ్వ విద్యాలయానికి గవర్నర్ స్వయంగా రావడం వర్సిటీకి, విద్యార్థిలోకానికి ఎంతో సంతోష దాయకమని హర్షం వ్యక్తంచేశారు. అనంతరం ఎ.ఎం. గ్రీన్ ఛీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మరియు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి. రామకుమార్కు గవర్నర్ గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రదానంచేశారు. అనంతరం స్నాతకోపన్యాసం చేసిన డాక్టర్ యస్ యస్ వి రామ్ కుమార్, శాస్త్ర సాంకేతిక రంగాలతోపాటు విద్యుత్ రంగంలో తాను చేస్తున్న కృషికి గుర్తింపుగా తనను గౌరవించిన రాయలసీమ విశ్వవిద్యాల యానికి ధన్యవాదాలు తెలియజేశారు. స్టార్టప్స్ రంగంలో దేశం ప్రగతిపథంలో దూసుకుపోతోందన్నారు. దేశ ప్రగతి రథానికి విద్యార్థులంతా చోదకశక్తిగా మారాల్సిన అవసరముందని ఆయ నసూచించారు. అనంతరం వర్సిటీలో వివిధ కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు గవర్నర్ బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన గవర్నర్ నాణ్యమైన బోధన, పరిశోధనలద్వారా రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థుల భవితకు బాటలు వేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా బంగారు పతకాలతోపాటు వివిధ పీజీ పి హెచ్ డి కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు డిగ్రీ ప్రదానం చేయడం సంతోషకరమన్నారు. ఆయా డిగ్రీలద్వారా సంపాదించుకున్న జ్ఞానంతో సార్థకమైన జీవితాన్ని గడపవలసినదిగా ఆయన హితబోధ చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక విషయాల్లో కూడా విద్యార్థులు తమతమ నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకున్నప్పుడు భవితకు ఢోకా ఉండదన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి దేశాన్ని ప్రగతిపథంలో నిలపాలన్న దేశప్రధాని నరేంద్ర మోడీ ఆశిస్తున్న ఆశయాలకు నూతన విద్యా విధానం తోడ్పాటు నందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యాలతోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వికసిత్ ఆంధ్ర లక్ష్యాలను చేరుకోవడానికి విద్యార్థిలోకం కృషి చేయాలన్నారు. ఉన్నతవిద్యవరకు సమాజం నుండి ఎన్నో పొందిన ప్రతి ఒక్క విద్యార్థి తనదైన బాధ్యతగా సమాజానికి ఉపకరించే పనులు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రాయలసీమ యూనివర్సిటీ పక్షాన వి.సి. ఆచార్య వి. వెంకట బసవరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ ఆచార్య మధుమూర్తి, వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్.టి.కె. నాయక్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయ కుమార్ నాయుడు గవర్నర్ను సన్మానించారు. తర్వాత వివిధ కోర్సుల్లో పి.జి. మరియు పి హెచ్ డి పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. జాతీయ గీతాలాపనతో స్నాతకోత్సవం ముగిసింది. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, కర్నూలు కలెక్టర్ డాక్టర్. ఎ. సిరి, ఎస్.పి. విక్రాంత్ పాటిల్, కోడుమూరు శాసన సభ్యులు బొగ్గుల దస్తగిరి, ఎ పి ఎస్ హెచ్ సి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి, వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్.టి.కె. నాయక్ ఉన్నారు.



## పద్మావతి వర్సిటీలో అంతర్జాతీయ సాంస్కృతిక సంభాషణ

### విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ

**తిరుపతి,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** విద్యాకేంద్రాల నిలయం తిరుపతిలోని పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో నేటి నుండి మూడురోజులు అంతర్జాతీయ సాంస్కృతిక సంభాషణ జరుగుతోంది. ఇందుకు వర్సిటీలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేపట్టినట్లు పద్మావతి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ తెలిపారు. బుధవారం మీడియాప్రతినిధులకు అంతర్జాతీయ నృత్యోత్సవాలు నిర్వహణ వివరాలు తెలిపారు. శ్రీలంక, థాయ్ లాండ్, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన నృత్య కళాకారులతో పలు రకాల ప్రదర్శనలు, సదస్సులు ఉంటాయన్నారు. పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నృత్యవాహిని అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి, నృత్య మహోత్సవం జరుగుతుంది. థాయ్‌లాండ్, శ్రీలంక, మహారాష్ట్ర నుండి 87మంది కళాకారులు అంతర్జాతీయ నృత్యోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. నేడు ప్రారంభో పన్యాసంతో కార్యక్రమాలు మొదలవుతాయి. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, మైసూర్ విశ్వవిద్యాలయం ఆచార్య శిలశ్రీధర్ తెలిపారు.

# తిరుమల సమాచారం

## ఇ ఆఫీస్ ద్వారా ఎస్వీబిసి కార్యక్రమాల నిర్వహణ

### - ఒకే సమగ్రసాఫ్ట్‌వేర్‌లో సమన్వయం - టిటిడి ఇఒ సింఘాల్



**తిరుమల,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడిధార్మిక కార్యక్రమాలు, తిరుమల శ్రీవారి ఆలయంతోబాటు ఇతర ఆలయాల్లో జరిగే అన్ని కార్యక్రమాలను ప్రసారం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఎస్వీబిసిని ఈ ఆఫీస్‌ద్వారా నిర్వహించాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ ఆదే శించారు. ఎస్వీబిసిలోని మానవవనరులు, ఆర్థిక వ్యవ హారాలు, ఉత్పత్తి, సరఫరా, నిల్వలు తదితర విభాగాల అంశాలను ఒకే సమగ్ర సాఫ్ట్‌వేర్‌లో సమన్వయం చేసేందుకు సంస్థ వనరుల సమగ్ర ప్రణాళికా వ్యవస్థను తీసుకురావాలన్నారు. బుధవారం సాయంత్రం టిటిడి పరిపాలనభవనంలో ఎస్వీబిసి సిఇఒ ఫణికుమార్‌నాయుడు, ఎఫ్ఎసిఎఒ బాలాజీతో కలసి ఇఒ సింఘాల్ సమీక్షించారు. ఎస్వీబిసి ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులకు మరింత నాణ్యతతో ప్రసారాలు అందించేందుకు, ఉద్యోగులు ప్రణాళికా బద్దంగా విధులు నిర్వహించేందుకు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. ఎస్వీబిసిలో ఆర్థిక అంశాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రభుత్వం నుండి ,అటానమస్ సంస్థ నుండి ప్రత్యేకంగా అకౌంట్స్ ఆఫీసర్‌ను నియమించాలన్నారు.

## కపిలతీర్థంలో అయ్యప్పస్వాముల శరణుఘోష

### - స్నానాలకు అనుమతించాలని నిరసన



**తిరుమల,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీక మాసంలో దీక్షచేపట్టిన అయ్యప్ప స్వాములు కపిలతీర్థం పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించడం పరిపాటి. వేకువజామున చన్నీటి స్నానంతో అయ్యప్పదీక్ష భక్తులు తమ భక్తిని చాటు కుంటారు. కొండల్లోంచి జలాపాతాలు దుముకుతుండటంతో ముందు జాగ్రత్తగా టిటిడి అధికారులు కపిలతీర్థంలో స్నానాలకు అనుమతించడంలేదు. బుధవారం ఉదయం అయ్యప్పమాలలు ధరించిన భక్తులు, యాత్రికులు అక్కడకు చేరుకుని పుణ్యస్నానాలాచరించాలని చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో అయ్యప్పస్వాములు శరణంఅయ్యప్ప ఘోషతో నిరసన తెలిపారు. అయితే భద్రత కారణాల దృష్ట్యా భక్తులను అనుమతించడంలేదని ఆలయభద్రత సిబ్బంది తెలిపారు.

## త్వరలో ప్రేక్షకుల ముందుకు ‘ టైసన్‌నాయుడు’ చిత్రం

### -శ్రీవారి ఆశీస్సులతో కిష్కింధపురి విజయవంతం



**తిరుమల,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ఎంతో అద్భుతంగా అన్ని రకాలుగా చిత్రీకరించిన “టైసన్‌నాయుడు”చిత్రంతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీనటుడు బెల్లంకొండ శ్రీనివాస్ తెలిపారు. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో కిష్కింధపురి చిత్రం విజయవంతమైందన్నారు. ఆ చిత్రం తరువాత స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో నటుడు శ్రీనివాస్ ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనానంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 20 అంశాల కార్యక్రమం అమలుపై సమీక్ష

### కమిటీ ఛైర్మన్ లంకా దినకర్



**సచివాలయం,నవంబర్ 12,ప్రభాతవార్త :** డబుల్ ఇంజన్ సర్కార్ లక్ష్యం రాష్ట్రంలో ప్రపంచస్థాయి పెట్టుబడులు ఆకర్షణ-గ్రామస్థాయి పెట్టుబడుల సాధికారతకు ప్రోత్సాహం దిశగా ఏపిలో జరుగుతుందని 20సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంక దినకర్ తెలిపారు.బుదవారం ఆయన పేషీలో విలేకర్లుతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయం స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారంతో ప్రధాని మోడీ సంకల్పం వికసిత్ భారత్ సాధనకు పెట్టుబడుల ఆకర్షణ కీలకం.ముఖ్యమంత్రి దార్శనికత మరియు ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహకారంతో విశాఖలో పెట్టుబడుల సదస్సుకు ముందే 11లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షణ జరిగిందన్నారు.15బిలియిన్ డాలర్ల గూగుల్ పెట్టుబడులు నుంచి రూ.15వేలు పెట్టుబడుల వరకు ప్రతి ఒక్కరిని ఒకే స్ఫూర్తితో ప్రోత్సహిస్తున్నారు. చరిత్రలో లక్షల కోట్ల పారిశ్రామిక ఒప్పందాలు చేసుకోబోతున్న అతిపెద్ద పారిశ్రామిక వేత్తల సదస్సు విశాఖలో జరగడానికి మూడు రోజులు ముందు కనిగిరి వంటి వెనుకబడిన ప్రాంతం నుండి 17జిల్లాల్లో ని 49చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల పార్కులను వర్చువల్ గా ప్రారంభోత్సవం చేయడం అంటే పారిశ్రామిక సదస్సు నిర్వహిస్తున్న సమయంలో సాధారణంగా పెద్ద పరిశ్రమలపైన చర్చ జరగాల్సిన తరుణంలో చిన్న పరిశ్రమల పైన అంతే ప్రాధాన్యతతో కార్యక్రమం చేయడం ఆయనకు సాధ్యం అని నిరూపించారు.ఎంఎస్ఎంఈల సభలో కనిగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ డ్వాక్ర మహిళల సాధికారత ద్వారా ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామిక వేత్తను తయారుచేయడానికి డబుల్ఇంజన్ సర్కార్ పనిచేస్తుందన్నారు. దేశంలో 30శాతం జిడిపి,40శాతం ఎగు మతులు ఎంఎస్ఎంఈ ద్వారా సమకూరు తున్నాయి,ఈ శాతం ఆంధ్రప్రదేశ్ లో పెంచాలనే లక్ష్యంతో డబుల్ ఇంజన్ సర్కార్ పనిచేస్తుంది.రాష్ట్రంలోని మూడు పారిశ్రామిక కారిడార్లు మరియు కొప్పర్తి,ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు ప్రధాని మోడీ సహకారం మరువలేనిది.

2019-24మద్య పెట్టుబడుల ఆకర్షణలో ప్రతికూల వాతావరణం ఉండడానికి కారణం నాటి ప్రభుత్వ పాలన వైఫల్యం.ఆయ పెట్టుబడుల ద్వారా 20లక్షల ఉద్యోగాలు రాబట్టడం లక్ష్యంగా ఐటి మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారు.ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సంపూర్ణ సహాయ సహకారాలు గ్రామాల్లో మహిళల లక్‌పతి దీదీలు ద్వారా డబుల్ ఇంజన్ సర్కార్ సహకారంతో పెట్టుబడుల ఆకర్షణకు ఊతం ఇస్తుంది.

## సిబిఐ కోర్టు విచారణకు హాజరవుతా: మాజీ సిఎం జగన్



**విజయవాడ, నవంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** యూరప్ పర్యటనకు వెళ్లి వచ్చాక కోర్టు ముందు హాజరు కావాలన్న ఉత్తర్వుల నేపథ్యంలో ఈనెల 21లోగా హాజరవుతానని అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితునిగా అభియోగాలు ఎదుర్కొంటున్న ఏపీ మాజీ సీఎం వైఎస జగన్ సీబీఐ కోర్టుకు నివేదించారు. వాస్తవానికి హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టుకు ఈనెల 14న హాజరుకావాల్సి ఉండగా మెమో దాఖలు చేస్తూ మినహాయింపు కోరినా దాన్ని ఉపసంహరించుకున్నారు.ఈ మేరకు జగన్ న్యాయవాది సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. అక్టోబరులో జగన్ యూరప్ పర్యటనకు వెళ్లే ముందు సీబీఐ కోర్టు అనుమతి కోరారు. కోర్టు అనుమతి మంజూరు చేస్తూ పర్యటన ముగించుకుని వచ్చాక నవంబరు 14న వ్యక్తిగతంగా హాజరుకావాలని షరతు విధించింది. పర్యటన ముగించుకొని వచ్చిన జగన్ కోర్టు ఎదుట హాజరు కాలేదు. కోర్టు విధించిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో తన వ్యక్తిగత హాజరును మినహాయించాలని కోరుతూ ఈనెల 6న మెమో దాఖలు చేశారు. దీనిపై సీబీఐ ప్రధాన కోర్టు న్యాయమూర్తి డాక్టర్ టి. రఘురాం మంగళవారం విచారణ చేపట్టారు. ఈ మెమోను వ్యతిరేకిస్తూ సీబీఐ కౌంటరు దాఖలు చేసింది. బెయిలు షరతుల ప్రకారం ప్రతి విచారణకు జగన్ హాజరు కావాల్సి ఉందని పేర్కొంది. జగన్ తరఫు న్యాయవాది జి. అశోక్‌రెడ్డి స్పందిస్తూ హాజరు మినహాయిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. జగన్ తరఫున ఆయన న్యాయవాది హాజరుకావడానికి అనుమతించిందని పేర్కొన్నారు. కోర్టు ముందు హాజరుకావడానికి అభ్యంతరం లేదని, ప్రత్యేక భద్రతా ఏర్పాట్లకు అధికార యంత్రాంగానికి ఇబ్బంది అన్న ఉద్దేశంతో మినహాయింపు కోరినట్లు పేర్కొన్నారు. యూరప్ పర్యటనకు వెళ్లి వచ్చాక కోర్టులో హాజరుకావాలన్న ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని కోరుతూ అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడైన జగన్ హైదరాబాద్ సీబీఐ కోర్టులో మెమో దాఖలు చేశారు. అక్టోబరు 1 నుంచి 30లోగా 15 రోజులపాటు జగన్ యూరప్ పర్యటన నిమిత్తం సీబీఐ కోర్టు అనుమతి ఇస్తూ వెళ్లే ముందు పర్యటన వివరాలు, ఫోన్ నంబరు, ఈ మెయిల్ వివరాలు సమర్పించాలని, వచ్చాక నవంబరు 14లోపు కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని షరతులు విధించింది. విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన జగన్ కోర్టు ఎదుట ఇంకా హాజరుకాలేదు. అయితే తాజాగా 21లోగా జగన్ హాజరవుతారని మెమో దాఖలు చేసినట్లు తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి గతంలో దాఖలు చేసిన మెమోను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## పరకామణి కేసు రాజీలో టిటిడి పెద్దలు!

### - మాజీలపై దృష్టి పెట్టిన సిఐడి - విచారణకు పిలిచే అవకాశం

**తిరుమల,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు కానుకలు లెక్కించే పరకామణి నుండి విదేశీ కరెన్సీ చోరీ కేసు, తదనంతరం లోక్‌అదాలత్‌లో రాజీజరగడం వంటి కీలక పరిణామాల వెనుక గత టిటిడి పెద్దలు ఉన్నారనే విషయం సిఐడి దృష్టికి వచ్చిందని తెలుస్తోంది. ఈ బాగోతంలో రానున్న రెండుమూడురోజుల్లో మాజీ టిటిడి పెద్దలతోబాటు మాజీ పోలీస్ అధికారిని విచారణకు పిలిచే అవకాశం ఉందని కీలక సమాచారం. పరకామణిలో చోరీ కేసు విషయంపై హైకోర్టు ఆదేశాలతో గత ఏడెనిమిదిరోజులుగా తిరుపతిలోనే మకాం వేసిన సిఐడి డిజి రవిశంకర్‌అయ్యన్నార్, ఎస్పీలు, డిఎస్పీలు ఐదు బృందాలు క్షేత్రస్థాయిలో సమాచారం రాబట్టారు. నిందితుడైన సివి రవికుమార్ వ్యవహారంపైకూడా దాదాపు కీలక సమాచారం సేకరించింది. ఆయనకు సంబంధించిన ఆస్తులు ,వాటి అంచనాలు వంటి విషయాలను రాబట్టింది. ఇప్పుడు కీలకంగా మారిన రాజీధోరణి వ్యవహారంలో కొందరు మాజీ పెద్దలపై దృష్టి సారించారు. ఇదేగాక తాజాగా బుధవారం సాయంత్రం టిడిపి నాయకులు సిఐడిడిజి రవిశంకర్‌అయ్యన్నార్‌ను తిరుపతిలో కలసి పరకామణి దొంగతనం కేసులో ముగ్గురుపై అనుమానాలు వ్యక్తం చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కేసులో గత టిటిడి ఛైర్మన్‌లు వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఓ పోలీస్ ఉన్నతాధికారి కలసి కుమ్మక్కై వాటాలు పంచుకున్నారని ఆరోపించారు. వీళ్ళే కేసు నీరుగార్చే ప్రయత్నం చేసి రాజీచేశారని విన్నవించారు. దీంతో ఇప్పుడు పరకామణి కేసులో కొత్త మలుపుతిరగనుంది. తిరుమల పరకామణిలో 2023 ఏప్రిల్‌లో జరిగిన చోరీ ఘటన,తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాలతో సిఐడి బృందం దర్యాప్తు వేగవంతంగా కొనసాగిస్తోంది. పూర్తి విషయాలు డిసెంబర్ 2కి హైకోర్టుకు సమర్పించాల్సి ఉంది. తిరుమలలో పరకామణి భవనం, కమాండ్ కంట్రోల్‌రూమ్, సిసిటివి దృశ్యాలు పరిశీలించారు. రవికుమార్ పాత్ర, 2023 ఏప్రిల్‌లో చోరీ జరిగిన ప్రాంతం, ఎలా పట్టుబడ్డాడు అనే వివరాల ఆధారాలు సేకరించి కొందరు అధికారులను విచారణ చేశారు. రవికుమార్‌కు సంబంధించి రికార్డుల మేరకు తిరుపతి,హైదరాబాద్, తమిళనాడు,కర్నాటకలో 50కోట్లరూపాయలకుపైగా విలువైన ఆస్తులున్నట్లు కూడా గుర్తించారు.

## కల్తీనెయ్యి వ్యవహారం - మాజీ ఛైర్మన్ వైవి నోరువిప్పితే ఏం జరుగుతుందో?



**తిరుపతి,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమల లడ్డూప్రసాదాల తయారీకి 2020నుండి 2024వరకు కల్తీనెయ్యి సరఫరా చేయడం, అదే నెయ్యిని పోటులో వినియోగించారనే కేసులో సిబిఐ సిట్ అధికారుల దర్యాప్తులో గత బోర్డు పెద్దలు, గత అధికారులు ఎరక్కపోయి ఇరుక్కోబోతున్నారా?అనే అనుమానాలు ఇప్పుడు రసవత్తరంగా మారాయి. కల్తీనెయ్యి బాగోతంలో తనప్రమేయం ఏమీ లేదని, ఇఒగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని తాజాగా బుధవారం మాజీ టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి సిట్ డిఐజి మురళీరాంభా, తిరుపతి అదనపు ఎస్పీ వెంకట్రావు విచారణలో అప్రూవర్‌గా మారడం ఎక్కడకు దారితీస్తుందోననేది మాత్రం విస్మయం కలిగిస్తోంది. ఇప్పుడు కల్తీనెయ్యి కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న గత ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి సిట్ ఎదుట హాజరై నోరు విప్పితే ఎలాంటి పరిణామాలు జరగబోతాయో అనేది కూడా ఉత్కంఠగా మారింది. అప్రూవర్‌గా మారిన ధర్మారెడ్డి ఈ బాగోతంలో మొత్తం సుబ్బారెడ్డిదే నేరం అన్నట్లు వెల్లడించారనేది తెలుస్తోంది. కల్తీనెయ్యి వ్యవహారంలో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇదీ సిట్ అధికారులను కూడా విస్మయం కలిగించేలా మారింది. కల్తీనెయ్యి విషయంలో 2020-24వరకు ఏం జరిగిందనేది మాజీ ఇఒ సమగ్రంగా ఆధారాలతో సిట్‌కు వాంగ్మూలం ఇచ్చారని తెలిసింది. అప్పటి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఒత్తిడి ,ప్రోద్బలం వల్లే ఇవన్నీ జరిగినట్లు సిట్‌ముందు వెల్లడించారనేది సమాచారం. అవసరమైన సమాచారం కూడా అందించినట్లు తెలుస్తోంది. కల్తీనెయ్యి వ్యవహారంలో రెండవరోజు బుధవారం ఉదయం నుండి రాత్రి వరకు సాగిన విచారణలో మాజీ ఇఒ ధర్మారెడ్డి ,బోలేబాబా డెయిరీ విపిన్‌జైన్,పామిల్‌జైన్‌లను విచారణ చేశారు. కల్తీనెయ్యి సరఫరాలో ఇప్పుడు సుబ్బారెడ్డి రేపోమాపో తిరుపతిలోని సిట్ కార్యాలయానికి హాజరై విచారణలో నోరువిప్పితే జరిగే పరిణామాలు ఎలా ఉంటాయనేది కూడా ఊహించలేని ఉత్కంఠగా నెలకొంది. రెండవరోజు కొన్ని ప్రశ్నలకు సమాధానం దాటవేశారనేది తెలుస్తోంది. గత ఐదేళ్ళలో 215కోట్లరూపాయలకుపైగా విలువైన 68.17 లక్షల కిలోల కల్తీనెయ్యి సరఫరా చేసినట్లు తేలిందని డిఐజి మురళీరాంభా తెలిపినా దానిపై సుబ్బారెడ్డి పాత్రపై ఇప్పుడు విచారణ చేయనున్నారు. ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనేది తెలుస్తోంది. 2019నుండి 2024 వరకు మధ్యకాలంలో తిరుమల లడ్డూల తయారీకి అవసరమైన నెయ్యిసరఫరా టెండర్లు దక్కించుకుని కల్తీనెయ్యి పంపినా ఎందుకు నోరుమెదపలేదనే కోణంలో వైవి విచారణ సాగనుందనేది తెలుస్తోంది. కల్తీనెయ్యి పాపంలో ఎవరున్నారనే అంశంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టిన సిబిఐ సిట్ అధికారులు ఇప్పటికే పాత్రధారులైన పలువురు డెయిరీ ప్రతినిధులను అరెస్టుచేసింది. ఇప్పుడు మరింతగా లోతుగా దర్యాప్తుకు మాజీ ఛైర్మన్ వైవి పిఏ చిన్నఅప్పన్నను, కాంట్రాక్టర్ అజయకుమార్‌ను మూడురోజుల కస్టడీకి సిట్ ఏసిబి కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 14వతేదీ (రేపు)తీర్పు వస్తే వైవి సుబ్బారెడ్డి విచారణకు హాజరయ్యే సమయానికి వీరందరినీ కలిపి విచారణ చేసే అవకాశం ఉంది. సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్‌ప్రభు, డిఐజి మురలీరాంభాలు ఆధారాలతో కొన్ని ప్రశ్నలను సిద్ధం చేసుకున్నారనేది తెలుస్తోంది. ఇప్పటికే డెయిరీ ప్రతినిధులను విచారణ చేసిన సిట్ అధికారులు నెయ్యి సరఫరా టెండర్లు దాఖలు, ఆ తరువాత పరిణామాలను రాబట్టారు.

## కళాదర్శకుడు తోటతరణికి ఫ్రాన్స్ విశిష్ట పురస్కారం

**చెన్నై,నవంబరు 12:** భారతీయ చలనచిత్ర పరిశ్రమ గర్వించదగ్గ ఆర్ట్ డైరెక్టర్, పద్మశ్రీ తోట తరణికి మరో అరుదైన గౌరవం లభించింది. ఫ్రాన్స్ ప్రభుత్వం అందించే అత్యున్నత పౌర పురస్కారం “చెవాలియం” అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. నవంబర్ 13న చెన్నైలోని అలయన్స్ ఫ్రాంకైస్‌లో జరిగే కార్యక్రమంలో ఫ్రెంచ్ రాయబారి చేతుల మీదుగా తోట తరణి ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ అరుదైన గౌరవం పొందిన ఆరో భారతీయుడిగా తోట తరణి నిలవనున్నారు. గతంలో దిగ్గజ దర్శకుడు సత్యజిత్ రే, నటులు శివాజీ గణేశన్, అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్, కమల్ హాసన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రెండు జాతీయ అవార్డులు, మూడు నంది అవార్డులు, నాలుగు తమిళనాడు రాష్ట్ర అవార్డులతో పాటు 2001లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీతో సత్కరించింది. 1978లో దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన తెలుగు చిత్రం సొమ్మొకడిది సోకొకడిదితో తోట తరణి తన కెరీర్‌ను ప్రారంభించారు. మణిరత్నం, శంకర్ వంటి అగ్ర దర్శకులతో కలిసి పనిచేసిన ఆయన నాయకుడు, సాగర సంగమం, గీతాంజలి , దళపతి, శివాజీ, దశావతారం, పొన్నియిన్ సెల్వన్ వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేసి భారతీయ సినిమాపై తనదైన ముద్ర వేశారు. చెవాలియర్ అవార్డు విషయాన్ని ప్రకటించగానే తోట తరణిపై అభినందనలు వెల్లువెత్తాయి. తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, ప్రముఖ నటుడు, దర్శకుడు ప్రభుదేవా బుధవారం సోషల్ మీడియా వేదికగా తోట తరణిని ప్రశంసించారు. ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ ఖాతాలో తమిళంలో స్పందిస్తూ, “తన అద్భుతమైన నైపుణ్యంతో ఊహలకు ప్రాణం పోసే ఆర్ట్ డైరెక్టర్ తోట తరణికి ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం చెవాలియర్ అవార్డు ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది“ అని పేర్కొన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఇటీవల ఆవిష్కరించిన పెరియార్ చిత్రాన్ని తోట తరణి ఎంతో నైపుణ్యంతో రూపొందించారని ఆయన గుర్తుచేశారు. “తన కళతో ఖండాంతరాలు దాటి గుర్తింపు పొందిన తోట తరణి గారికి నాప్రేమ, అభినందనలు“ అని తెలిపారు.

## పోలీసుల అదుపులో కిడ్నీ రాకెట్ సూత్రధారి డాక్టర్ ఆంజనేయులు

### గ్లోబల్ ఆసుపత్రిని సీజ్ చేసిన డిఎంఅండ్‌హెచ్ఒ దేవ శిరోమణి

**మదనపల్లెక్రైమ్, నవంబర్ 12 ప్రభాతవార్త.** మదనపల్లె కిడ్నీ రాకెట్ సూత్రధారి అన్నమయ్య జిల్లా వైద్యశాలల సమన్వయకర్త (డీసిహెచ్ఎస్)డాక్టర్ ఆంజినేయులు అని ప్రాథమిక విచారణలో తెలియటంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మత్తు మందు డాక్టర్‌గా సుధీర్ఘ అనుభవం గడించిన డాక్టర్ ఆంజినేయులుకు మదనపల్లెతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా, అనంతపురం, కడప జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులతో పరిచయాలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లా స్థాయి అధికారిగా ఉన్న ఆంజనేయులు మదనపల్లె ఎస్బీఐ కాలనీలో నివాసాల మధ్య అనుమతి లేని ప్రదేశంలో గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. ఇందులో తన కుమారుడు అవినాష్ ఆర్థో సర్జన్‌గా, కోడలు శాశ్వతి ఆప్తాలమిక్ సర్జన్‌గా ఉండగా, డాక్టర్ ఆంజినేయులు థైరాయిడ్, చక్కెర వ్యాధి తదితర వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నారు. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో పిపిపి విధానం ద్వారా అపోలో పర్యవేక్షణలో నిర్వహిస్తున్న డయాలసిస్ సెంటర్‌లో డాక్టర్ ఆంజినేయులు కోడలు డాక్టర్ శాశ్వతికి మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నది. మదనపల్లె డయాలసిస్ సెంటర్ ఇంచార్జ్‌గా ఉన్న బాలరంగడు, కదిరి డయాలసిస్ టెక్నీషియన్‌గా ఉన్న మెహరాజ్‌లు అక్కడికి వచ్చే డయాలసిస్ పేషంట్లలో ఆర్థికంగా బలంగా ఉన్న వారిని ఎంపిక చేసి, వారికి కిడ్నీలను ఏర్పాటు చేసేవారని తెలిసింది.

యాక్సిస్ ఇంచార్జ్ డాక్టర్ ఆంజనేయులు కోడలు ఉండడంతో, నామ ద్వారా గ్లోబల్ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడికి ఏర్పాటు చేసుకున్నారు. బాలరంగడు, మెహరాజ్ లకు వైజాగ్ జిల్లా గాజువాకకు చెందిన బ్రోకర్లు పద్మ, సత్య, సూరిబాబు లతో పరిచయం ఉండడంతో వారి ద్వారా ఒంటరిగా ఉన్న మహిళలను గుర్తించి వారికి డబ్బులు ఆశ చెప్పి కిడ్నీలు తీసుకునేవారని తెలిసింది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులలో ఉన్న ఒంటరి మహిళ అయిన యమునను ఎంపిక చేసుకున్నారు.

## స్వర్ణముఖి నది ప్రక్షాళనకు సిద్ధం :తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి

**తిరుపతి,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచపుణ్యక్షేత్రం, యాత్రాస్థలం తిరుపతి నగరం అన్ని విధాలా అభివృద్ధి దిశగా అడుగులుపడుతున్నాయని తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. ఆపరేషన్ స్వర్ణలో భాగంగా స్వర్ణముఖీ నదీపరివాహక సరిహద్దులు నిర్ణయించి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యాచరణపై ముందుకు వెళుతున్నామన్నారు. బుధవారం ఉదయం తుడ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పలు అంశాలపై తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి వివరించారు. సిఎం చంద్రబాబునాయుడు సూచనలతో ఆపరేషన్ స్వర్ణ తమకు అప్పగించడం, పనులు కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. స్వర్ణముఖినది ఆక్రమణలు తొలగింపు, ప్రక్షాళనలో బాగంగా త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆపరేషన్ స్వర్ణ ముందుకు వెళుతుందన్నారు. తిరుపతి నగరాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. శెట్టిపల్లి 68 ఎకరాలు తుడ అభివృద్ధి చేస్తుందని, సుమారు 48 ఎకరాల భూమిలో 1,800 ఇళ్ళు నిర్మాణం చేస్తామని చెప్పారు.

ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 320మంది రైతులకు లాటరీ పద్ధతిలో స్థలాల కేటాయింపు చేస్తామని, ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వినాయకసాగర్‌లో అవిలాల చెరువును అభివృద్ధిచేస్తామని ,తిరుపతిలో 70-80తాగునీటి వనరులను సుస్థిరంగా తయారుచేస్తున్నామన్నారు.

వార్త


మన జీవితానికి ఒక లక్ష్యం, ఒక ఉద్దేశం,
ఉంటేగాని అది జీవితం అనిపించుకోదు.

న-రాఛెల్

# 'కట్టు' తప్పుతున్న అగ్రరాజ్యం!


ఒకప్పుడు అణు నిరాయుధీకరణకు కట్టుబడిన అగ్రదేశం సైతం అణ్వాయుధ ప్రయోగాల కోసం ఉవ్విళ్లూరుతోంది. నిరాయుధీకరణ గొప్ప అంశమంటూనే దానిని ఉల్లంఘించేందుకు శ్వేత సౌధాధినేత ట్రంప్ సిద్ధమవుతున్నారు. పైగా పాకిస్థాన్ దారిలోనే తామూ నడుస్తామని ప్రపంచానికి సంకేతాలు కూడా పంపారు. అన్నవస్త్రాలకు కరువు ఎదుర్కొంటున్న పాక్ ఈ మధ్య వాటి విషయాలు అలా ఉంచి అణ్వస్త్ర ప్రయోగాల పట్ల శ్రద్ధ చూపిస్తోంది.తమ వద్దనున్న అణ్వాస్త్రాలతో ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చే యవచ్చు నని ఎప్పటిలానే తమ శక్తిసామర్థ్యాల విషయమై ఆయన గప్పాలు కొట్టుకుంటున్నారు. ఆయనెందుకో నిద్రలో కనాల్సిన కలలను పట్టపగలే కంటున్నట్లుంది. అణ్వస్త్ర ప్రయోగాలకు ముందుకు దూసుకుపోతున్నట్లు బహిరంగంగానే ప్రకటించారు. మూడు దశాబ్దాల క్రితం తాము అణ్వస్త్ర నిరోధకతకు ప్రపంచంలోని పలు దేశాల మధ్య కుదిరిన ఒప్పందానికి లోబడి వేచియున్నామని కాగా పాక్ వంటి తన మిత్రదేశమే అణ్వాస్త్రాల కోసం అర్రులు చాస్తుండగా తామేమీ మిన్నకుండలేమని చెప్పారు. రష్యా, చైనా, ఉత్తర కొరియా, పాకిస్థాన్‌లు అణుపరీక్షల్లో మునిగితేలుతుండగా తానెందుకు ఊరకుండిపోవాలని ఆయన ఆవేదన. తమకు చైనాకు తీవ్ర తరమైన పోటీ ఉందని, అందులోనూ ముప్పులేదని భావించలేమని అందుకే చైనాకు పోటీగా అణ్వాయుధాలు సమకూర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామని స్వయంగా ఆయనే ప్రకటించారు. ఇతర దేశాల్లాగానే తాము కూడా అణుప్రయోగాలకు సిద్ధ మవుతున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు పెంటగాన్‌కు కూడా సమాచారం ఇచ్చి సంసిద్ధులై ఉండాలని చెబుతు న్నారు. అమెరికా పవర్‌గ్రిడ్ నీటి సరఫరా వ్యవస్థలోకి చొరబడి చైనా మేధోసంపత్తిని చోరీ చేస్తోందని, ఈ విష యం తమ ఇంటెలిజెన్స్ వ్యవస్థలు సమాచారమందించినట్లు ట్రంప్ మీడియాకు వివరించారు. తాము నిరం తరం చైనా చర్యలను దుశ్చర్యలను గమనిస్తూనే తమ ఎత్తుగడలను తాము వేస్తామని చెబుతు న్నారు. ఎవరివల్ల ఎవరికి ముప్పో చెప్పలేని పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో 'అణ్వస్త్ర'పోటీ ఎంతో దూకుడుగా సాగేదని విన్నాం. కాగా ఇప్పటికీ రష్యా, చైనాలు ఎంతో చురుకుగా ఆలోచిస్తున్నా యని అందరికీ తెలిసిందే. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య ఒకపక్క ఎడతెగని యుద్ధం, మరో పక్క సయోధ్యకు మింగుడుపడని వ్యవహారం. అగ్ర రాజ్యాధిపతిని వెక్కిరి స్తున్నాయి. ఆ మధ్య దక్షిణ కొరియాలోని బుసాన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీకి ముందే అణుపరీక్షలకు 'తాము సైతం' అని ప్రకటించారు. అమెరికా కూడా ఇతర అణ్వస్త్ర దేశాలకు ధీటుగా అణుపరీక్షలు నిర్వహించటం సమంజసంగా ఉంటుందని, అదే సబబని ట్రంప్ ప్రకటించారు. ఆ వెంటనే అమెరికా రక్షణశాఖ తన నిర్ణయాన్ని అమలు చేయాలని ఆదేశించారు. అణు నిరాయుధీకరణపై తన కెంత మక్కువ ఉన్నా అణ్వస్త్ర దేశాలతో పోటీలో ఉండక పోతే వెనుకపడ్తామని ఆయన ఆలోచనలా ఉంది.అణ్వస్త్ర దేశాలు 1996లో ప్రపంచ శాంతిని కోరుకుంటూ 'సమగ్ర అణుపరీక్షల నిషేధ' ఒప్పందాన్ని చేసుకున్నాయి. 2023లో ఆ ఒప్పందం నుంచి రష్యా అధ్యక్షుడు బయటికి వచ్చేశాడు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రకటించాక అదొక హెచ్చరిక సంకేతంగా భావిం చినట్లున్నారు. నిరంతర యుద్ధానికి తలపడ్డారు. ఇప్పటికీ అదే యుద్ధతంత్రం నడుస్తోంది. అమెరికా వద్ద 5225, రష్యా వద్ద 5580 అణ్వస్త్రాలున్నాయి. 2020లో ఒక సర్వే ప్రకారం చైనా వద్ద 300 అణ్వస్త్రాలే ఉండేవి. రానురాను వాటి సంఖ్య పెరిగింది.తాజా పరిస్థితుల్లో చైనా తనంతతానుగా అణ్వాయుధ ప్రయోగాలు చేసినా అమెరికాను ఎదుర్కొనేందుకు ఇంకా చాలా సమకూర్చు కోవాలి. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అణ్వస్త్ర తయారీ కోసం ఏ దేశం అర్రులు చాచినా తమదేశాన్ని రక్షించుకునే ప్రయత్నంలో ఎలాంటి అణ్వస్త్ర పోరు జరుప జాలదు. ఫ్రాన్స్ వద్ద 290, యుకె వద్ద 225,భారత్ వద్ద 180,పాకిస్థాన్ వద్ద 170, ఇజ్రాయెల్ 90, ఉత్తర కొరియా వద్ద 50 వరకు అణ్వాస్త్రాలు ఉన్నాయి.చైనా తన అణ్వాయుధ సామర్థ్యాన్ని వేగంగా పెంచుకుంటుందనే అభిప్రాయానికి రావడంవలన ట్రంప్ ఆందోళన చెందుతున్నట్లుంది. చైనాతో ఘర్షణ పడటం కన్నా కలిసి పనిచేయడమే ఇరుదేశాల మధ్య సుహృద్భావ వాతా వరణం ఉంటే మంచిదని పదేపదే చెబుతున్నారు. తాము కూడా అణ్వాయుధాల తయారీని పునః ప్రారంభించి ఐదేళ్లలో రష్యా, చైనాలను దాటిపోవాలని యోచి స్తున్నారు. చైనా ఎంత వేగంగా అణ్వస్త్ర తయారీ చేసినా అమె రికాను చేరుకోవడం బహుకష్టమే. కానీ ట్రంప్ ఎందుకో ఈ విషయమై అతిగా ఆలోచిస్తున్నారు. అణ్వాయుధ తయారీకి వెనుకడుగు వేయలేని పరిస్థితి ఉంది. ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో అమెరికా అణ్వస్త్ర ప్రయోగాలకు వెళ్లనుంది. చాలా దేశాలు రహస్యంగా భూగర్భంలో పరీక్షలు నిర్వహిస్తున్నందున బయటి ప్రపంచానికి తెలి యరాలేదు. మూడో ప్రపంచ యుద్ధానికి ఎలాగూ సమయం కాదు.అయినా కేవలం కొన్నికొన్ని దేశాలమధ్య సాగుతున్న చిచ్చు నేపథ్యంలోనే యుద్ధ వాతావరణం ఏర్పడ్తున్నా అవేమీ భారీ యుద్ధాలు కాదు. అలాంటి భారీ యుద్ధాలు ఇక చూడం. చిన్న చిన్న యుద్ధాలు మాత్రమే. మామూలు యుద్ధానికే సమయస్ఫూర్తితో నిర్ణయం తీసుకోవాలి. లేకుంటే అణు విధ్వంసాలకు ఏ దేశమైనా మూల్యం చెల్లించుకోక తప్పదు.

మనిషి అన్నవాడు ముందు
ఆత్మాభిమానం కలిగి ఉండాలి.
ఆత్మాభిమానం లేనివాడు అసలు
మనిషిగా ఎదగలేడు.



పాస్కల్

సంతృప్తిపడే వ్యక్తి ఏనాటికీ
పేదవాడు కాదు. అలాగే
అసంతృప్తి చెందే వ్యక్తి ఎన్నటికీ
సంపన్నుడు కాలేడు.



థామస్ జెఫర్సన్

# ప్రజావాక్కు



### పెరుగుతున్న శబ్దకాలుష్యం

ఇటీవలి కాలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు డిజె సౌండ్ ప్రభావం పెరుగుతోంది. వివాహాలు, జాతరలు, పండుగలు,రాజకీయసమావేశాలు వంటి ప్రతి వేడుకలోనూ డిజెసౌండ్ ఒకఅలవాటుగా మారిపోయింది. అయితే ఈ సౌండ్ ఎఫెక్ట్‌లు కేవలం వినోదానికి పరిమితం కాకుండా, అనేకమంది ప్రాణాలను హరిస్తున్నాయి. అధిక డెసిబెల్స్‌లో వినిపించే ఈ శబ్దం గుండెపోటు, చెవుల నష్టం,నరాల బలహీనత, ఒత్తిడి వంటి అనారోగ్య సమస్యలకు దారితీస్తోంది. ఇటీవల డిజె సౌండ్ ప్రభావంతో గుండెపోటుతో మరణించిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి ప్రమాదాలను నివారించాలంటే ప్రజల్లో అవగాహన పెంచడం అత్యవసరం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి

సరసమైన ధరలకు మంచి ఆరోగ్య సంరక్షణ, సౌకర్యవంతమైన జీవితం పొందడం సమాజంలోని ప్రతి పౌరుని హక్కు. ఈహక్కు పొందాలంటే నగరాలు, గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలలో తగినంత సంఖ్యలో ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలుండాలి. తగినంత సంఖ్యలో వైద్యులు,నర్సులు,ఇతర ఆరోగ్యకార్యకర్తలు, అవసరమైన వైద్య పరికరాలు,సౌకర్యాలు,మందులు ఉండాలి. ఆరోగ్య సంరక్షణ ప్రదాతలైన వైద్యులు, నర్సులు, పారా మెడికల్ కార్మికులకు సురక్షితమైన జీవనోపాధి, సురక్షితమైన పని పరిస్థితులు, గౌరవప్రదమైన జీవన వేతనం, పెన్షన్ మొదలైనవి కలిగి ఉండాలి. ప్రభుత్వం ప్రజారోగ్య శాఖకుఅధికనిధులతో వైద్యసిబ్బందిజీతభత్యాలతో పాటు ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించవచ్చు.

- ఆళవందార్ వేణు మాధవ్, హైదరాబాద్

### బాలికల గురుకులాలకు పురుషులు వద్దు

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బాలికల గురుకులాల్లో పురుషులను నియమించకూడదు.బాలికల గురుకులాల్లో వికలాంగుల నియామకం కూడా వద్దు. ఎస్ సి. యస్ టి. బిసి.గురుకుల రాష్ట్రసెక్రటరీలకు ఆదేశాలు జారీ చేయాలి. వికలాంగుల లెక్చరర్, టీచర్స్‌కు మధ్యంతర బదలీలు చేయడం నిలిపివేయాలి. విద్యా సంవత్సరం మధ్యలో బదలీలు వద్దు.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### కాలుష్య కోరల్లో ఢిల్లీ

దేశరాజధాని ఢిల్లీ మరోసారి వాయుకాలుష్య కోరల్లో చిక్కుకుంది. ప్రతి ఏడాది శీతాకాలం ప్రారంభంలో పొగమంచు, వాహనాల ఉద్గారాలు, పారిశ్రామిక వ్యర్థాలు, పంట అవశేషాల దహనం కలిపి నగరాన్ని ముసిరేస్తాయి. ఈసారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. పంజాబీ బాగ్ వద్ద ఏక్యూఐ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) 425 మార్క్ దాటటం ద్వారా హాజర్డస్ స్థాయికి చేరింది. అంటే, ఈ గాలి పరిస్థితుల్లో సర్వసాధారణ ప్రజలు మాత్రమేకాదు,ఆరోగ్యవంతులైనా ఊపిరి పీల్చడం కష్టమవుతుంది. వృద్ధులు,పిల్లలు,గర్భిణీలుశ్వాస సంబంధ వ్యాధులున్న వారికి ఇది ప్రాణాంతకమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణంలో ముసురుకుపోయిన పొగమంచు, వాహనాల ఎగ్జాస్ట్, పరిశ్రమల పొగలు కలిసి ఢిల్లీని ఒక గ్యాస్ చాంబర్‌గా మార్చేశాయి.ఢిల్లీ ప్రజలు వాహనాల వాడకం తగ్గించాలి. కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి.

- కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాల్‌పల్లి జిల్లా

### ప్రైవేట్ బస్సులను నియంత్రించాలి

ప్రస్తుతం రోడ్లపై ప్రైవేట్ బస్సుల సంఖ్య పెరుగుతున్నందున వాటిపై కఠినమైన నియంత్రణ అవసరం. ప్రభుత్వం, రవాణా శాఖలు ప్రైవేట్ బస్సుల లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్‌లు, బీమా పత్రాలు వంటి అంశాలను నిరంతరం తనిఖీ చేయాలి. డ్రైవర్లు సరైన అర్హతలు, అనుభవం కలిగి ఉండాలి. బస్సుల సాంకేతిక స్థితి, టైర్లు, బ్రేకులు,లైట్లుమొదలైన వాటిని సమయానుకూలంగా పరిశీలించాలి.అలాగే బస్సుల్లో అధిక వేగం, ఓవర్‌లోడింగ్, నిర్లక్ష్య డ్రైవింగ్‌ను కఠినంగా నిషేధించాలి.ప్రయాణికులు కూడా తమభద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. వారు సురక్షితమైన, నిబంధనలు పాటించే బస్సులను మాత్రమే ఎంచుకోవాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### రక్షణ మార్గాలను ఏర్పాటు చేయాలి

తిరుపతి తిరుమల ఘాట్‌రోడ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పైనుండి పెద్ద బండ రాళ్ళు కిందికి పడినవి. ఈ ఘాట్ రోడ్‌లో నిత్యమూ బస్సులు లక్షల ప్రయాణీకుల్ని తీసుకువెళ్తాయి. ఏడాది పాటు ట్రాఫిక్ ఉంటుంది. దశాబ్ద కాలం నుండి ఈ ఘాట్ రోడ్, పైన కొండలు,మలుపులు పూర్తిగా చూసి దేశంలోని అత్యంతప్రతిష్టాత్మకసాంకేతిక పరిజ్ఞానండున్న నిపు ణులు ఒక పూర్తి అభిప్రాయం ఇచ్చారు గనుక అప్పటి నుండే ప్రమాద సూచన ఉన్నట్లు.

- ఎన్. బొల్లోజు మేఘానథం, విశాఖపట్నం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జంతు హక్కులను పరిరక్షిస్తున్నామా?

**జంతువుల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నప్పటికీ, మానవుడు తన స్వార్థం కొరకు ఇష్టానుసారంగా అడవులను నరికి వేస్తూ తిరిగి అవసరమైన వృక్ష సంపదను పెంచకుండా మూగజీవుల నివాసాలను కనుమరుగు చేస్తున్న సందర్భాల్లో జంతు జాతికి నిలువ నీడ లేక నివసించుటకు చోటులేని పరిస్థితుల్లో అడపాదడపా కొన్నిక్రూర జంతువులు మానవ నివాస ప్రాంతాల వైపు దూసుకొస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ది యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా లాంటి సంస్థలు జంతుజాతిని పరిరక్షించుటకు నిర్విరామంగా కృషి చేస్తున్నప్పటికీ, జంతువుల వల్ల మానవ జీవన విధానాలకు ఆటంకం లేకుండా, మానవుల వలన జంతువు నివాసాలకు నష్టం కలగకుండా జంతు సంరక్షణకు మానవ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యంతో పరస్పర సహకారంతో మూగ జీవుల నుండి ఎదురయ్యే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించడంలో సందేహం లేదు.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో అనేక నగరాల్లో పట్టణాల్లో గ్రామీణ ప్రాంతాల్లో సంచరించే మానవ సంరక్షణలో లేని మూగ జీవులు ఉండడానికి సరైన నిర్దిష్టమైన నివాసయోగ్యమైన ప్రదేశాలు లేక వాటిని పట్టించుకునే వారు లేకపోవడంతో కుక్కలు, పశువులు లాంటివి రహదారుల్లో, వీధుల్లో యధేచ్ఛగా తిరుగాడుతూ జనాలకు ఆటంకం కలిగిస్తూ ఉండడం, కొన్నిసార్లు మనుషుల పైకి దాడి చేసినప్పుడు మనుషులు ప్రమాద అంచున పడిపోయిన సందర్భాలు ఉండటం శోచనీయం. మూగ జీవులు తెలిసి, తెలియకో తరచుగా రహదారుల్లో వాహనాలకు అకస్మాత్తుగా అడ్డురావడంతో వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నిసార్లు కుక్కల దాడుల్లో కూడా ప్రజలు ఎక్కువ ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు సమాజంలో సర్వసాధారణమైపోతున్నాయి. సాధ్యమైనంత మేరకు పట్టణాలు నగర వీధుల్లో సంచరించే కుక్కలు, పశువులు లాంటి జంతువులపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి, మూగ జీవులకు నష్టం కలిగించకుండా వాటితో మనుషులకు కూడా హాని కలుగకుండా ఉండే రీతిలో క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇటీవల భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సూచనలు చేయడం విశేషం. జనాలు అధికంగా తిరిగే ప్రాంతాల్లో విద్యాసంస్థలు ఆసుపత్రులు బస్టాండ్లు రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో తిరుగాడే జంతువులు పశువులను జన సమూహాల్లోకి రాకుండా నియంత్రించే విధంగా అవసరమైన ప్రత్యేక భద్రత ఏర్పాట్ల వల్ల మూగజీవుల వల్ల కలుగుతున్న అనర్థాలు కొంతవరకైనా నియంత్రించవచ్చు అనే భావన ప్రజల్లో లేకపోలేదు. యానిమల్ బర్త్ కంట్రోల్ నిబంధన ప్రకారం ఇంట్లో పెంచుకునే జంతువులకు వీధిలో సంచరించే జీవాలకు తరచుగా క్రమం తప్పకుండా వ్యాక్సిన్ చేయించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉండడమే కాకుండా తర్వాత వాటిని ప్రత్యేకమైన జంతు పునరావాస కేంద్రాల్లో ఉంచి జంతువులకు కావాల్సిన సంరక్షణను మరింతగా చూడవలసిన బాధ్యత సంబంధిత అధికారులతో పాటు జంతువులను పెంచే యజమానులకు ఉంటుందనే భిన్నాభిప్రాయాలు తెరపైకి వస్తున్నాయి. ఆటవిక ప్రాంతాల్లో నివసించే క్రూరజంతువులు మినహా పరిసరాల్లో సాధారణంగా కనిపించే కుక్కలు,పిల్లులు లాంటి జంతువులు, పశువులు చాలావరకు కావాలని మనుషులపై దాడి చేయుటకు ప్రయత్నించవని మానవులతో కలగలుపుగా సంచరిస్తున్న జంతు జీవులు ఏవికూడా మానవులకు హాని కలిగించేరీతిలో ప్రవర్తించవనికేవలం ఆహారాన్ని వెతుక్కుంటూ సంచరిస్తున్న సందర్భంలో అనుకోకుండా జరిగే దుర్ఘటనలతో ప్రజలతో



పాటు మూగ జీవులు కూడా తీవ్రమైన ప్రమాదాలకు గురికావాల్సి వస్తుంది అనే విభిన్నమైన వాదనలు సమాజంలో లేకపోలేదు. మానవ అవసరాలకు కొన్నిసార్లు ఇష్టానుసారంగా అడవులు నరికివేతవల్ల దాచుకోవడానికి చోటులేక గూడు వదిలి దారి తప్పి రహదారులపై సంచరించే జంతువులు వాహనదారుల అప్రమత్తత లేకపోవడంవల్ల వాహనాలకింద పడి ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నాయి. మానవులు ప్రమాద బారినపడితే ఎవరో ఒకరు ఎంతో కొంత సహకారులుగా అవసరమైతే వైద్యంకొరకు సమాచారం అందించే అవకాశం ఉంటుంది. కానీ జంతువులకు భారీ వాహనాలు ఢీ కొట్టినప్పుడు ఎవరికి చెప్పుకొని బాధతో మూగ జంతువులు అరుస్తూ విలవిలలాడిపోతూ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకునే వారు అతితక్కువ మంది మాత్రమే ఉంటారు.ఇలాంటి దృశ్యాలు మనసును కలిచి వేస్తుంటాయి. భారత రాజ్యాంగ ప్రకారం చట్టాలను అనుసరించి భూమిపై జీవించే హక్కు మనుషులతో పాటు జంతువులకు కూడా ఉంటుంది. మూగజీవులు జీవించే హక్కును ఎవరు కూడా భంగం కలిగించేందుకు ప్రయత్నించ వద్దు. అంతే కాకుండా మూగ జీవులను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉంటుంది.మానవులు నివసించే ప్రదేశాల్లో జంతువులు,జంతువులు సంచరించే ప్రదేశాల్లో మానవులుండడం ఎక్కువ శాతం సాధ్యం కాదేమో, ఒకవేళ మానవులు తమ అవసరాలకు జంతువులను పెంచుకుంటున్న వాటి పూర్తి పరిరక్షణ సంరక్షణ బాధ్యత వారిపైనే ఉండాల్సిందే. ఏది ఏమైనప్పటికీ మానవజాతి తోపాటు జంతువులు కూడా ప్రకృతిలో భాగస్వామ్యమై ఉన్నాయి. నొప్పి అంటే తెలుసు వాటికి దప్పిక అంటే తెలుసు వాటికి బాధ అంటే తెలుసు, వాటికి భయం అంటే తెలుసు, వాటికి అలాంటి మూగ జీవులు తరతరాలుగా అనేకసంవత్సరాలుగా మానవ జీవన విధానాల్లో అనాదిగా కలసిజీవిస్తూ ఉంటాయి. మరి కొన్ని జంతు జాతులు మానవ సంచారం లేని ప్రాంతాల్లో దట్టమైన అడవి ప్రాంతాల్లో నివసించడం సర్వసాధారణమే అయినప్పటికీ, కొన్ని సందర్భాల్లో జంతువుల వల్ల మానవులకు హాని జరుగుతుంటాయి.మానవుల వల్ల జంతువులూ బాధకిగురిఅవుతుంటాయి అనేది అక్షర సత్యం. జంతువుల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నప్పటికీ, మానవుడు తన స్వార్థంకొరకు ఇష్టానుసారంగా అడవులను నరికివేస్తూ తిరిగి అవసరమైన వృక్ష సంపదను పెంచకుండా మూగజీవులనివాసాలను కనుమరుగు చేస్తున్న సందర్భాల్లో జంతు జాతికి నిలువ నీడలేక నివసించుటకు చోటులేని పరిస్థితుల్లోఅడపాదడపా కొన్నిక్రూర జంతువులు మానవ నివాస ప్రాంతాల వైపు దూసుకొస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ది యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా లాంటి సంస్థలు జంతుజాతిని పరిరక్షించుటకు నిర్విరామంగా కృషి చేస్తున్నప్పటికీ, జంతువుల వల్ల మానవ జీవన విధానాలకు ఆటంకం లేకుండా, మానవుల వలన జంతువు నివాసాలకు నష్టం కలగకుండా జంతు సంరక్షణకు మానవ పరిరక్షణకు ప్రజల భాగస్వా మ్యంతో పరస్పర సహకారంతో మూగ జీవుల నుండి ఎదురయ్యే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించడంలో సందేహం లేదు. •

# ఉద్యోగాల కల్పనలో ఎఐ దే కీలక పాత్ర

ఎస్.సీతారామయ్య

దేశంలో రానున్న కాలంలో ఉద్యోగాల స్వరూపమే అనూహ్యంగా మారిపోయే పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇదివరకు డిగ్రీలుంటే కానీ సరైన ఉద్యోగాలు రాని పరిస్థితి ఉండగా, ఇప్పుడు సాంకేతిక నైపుణ్యం ముందు డిగ్రీలు చిన్నబోతున్నాయి. దేశంలో ఎఐ(కృత్రిమ మేథ) నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రపంచ స్థాయిలో 88 శాతం వరకు ఎఐ ప్రోగ్రాములు అమలవుతున్నాయి, ఉత్పాదక ఆధారిత ఏఐ శిక్షణ నమోదులో అమెరికా, భారత్ దేశాలు ముందుండడంతో ప్రపంచ వ్యాప్తంగా ఏఐ నైపుణ్యాలకు డిమాండ్ పెరిగింది. జనరల్ ఎఐ శిక్షణను పెంచడంలో కార్పొరేట్ సంస్థలు ముందుంటున్నాయి. ఈ కార్పొరేట్ సంస్థలకు ప్రపంచవ్యాప్తంగా 14 మిలియన్ల కన్నా ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నారు. జనరల్ ఎఐ వినియోగం ప్రస్తుతం అన్ని రంగాల్లో పెరుగుతోంది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని వినియోగించుకుని సరికొత్త చిత్రాలు, పాఠ్యాంశాలు, సంగీతం తదితర అంశాలను సృజించే వ్యవస్థలను జనరేటివ్ ఎఐగా వ్యవహరిస్తున్నారు. ఎఐ నైపుణ్యానికి సంబంధించి దేశంలో 67 శాతం కంపెనీలు కొత్త విభిన్న నైపుణ్య ప్రతిభపై దృష్టి సారిస్తున్నాయి. 2030 నాటికి దేశంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, మరోవైపు 9.2 కోట్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని, అలాగే ప్రపంచంలో 170 మిలియన్ కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, 92 మిలియన్ ఉద్యోగాలు కోల్పోవడమవుతుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్లు ఇఎఫ్) నివేదిక వెల్లడించింది. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయ కంపెనీలు ప్రపంచాన్ని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎఐ, రోబోటిక్స్, ఎనర్జీ టెక్నాలజీ వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. దేశంలో బిగ్ డేటా, ఎఐ, మెషీన్లెర్నింగ్, సైబర్ నిర్వహణ వంటి ఉద్యోగాలు దేశంలో వృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత దేశంలోని ఐటి రంగం ప్రస్తుతం 5.4 మిలియన్ మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. 2030 నాటికి ఈ సంఖ్యను 10 మిలియన్ వరకు రెట్టింపు చేయాలన్న టార్గెట్ ఉండగా, కేవలం 7.5 మిలియన్ వరకే సాదించగలమని ఆయా రంగ నిపుణులు చెబుతున్నారు. దీనికి కారణం




ఎఐ విస్తరించడం వల్ల ఇప్పుడున్న ఉద్యోగాలు పోతాయన్న భయం వెంటాడుతుండడమే.ప్రస్తుతం ఈ వృద్ధి అంతా డిజిటల్ సాంకేతికత వైపు దూసుకెళ్తొంది. ఎఐ,క్లౌడ్ కంప్యూటింగ్, ఆటోమేషన్ తదితర సాంకేతిక ప్రక్రియలు పారిశ్రామిక, వాణిజ్య సంస్థల ప్రోత్సాహంతో విస్తరిస్తున్నాయి. ఇది వరకటి 10 మిలియన్ ఉద్యోగాల టార్గెట్ను 7.5 మిలియన్ ఉద్యోగాలకు సవరించినప్పటికీ, ఉద్యోగాల రాశి కన్నా నైపుణ్యం, నాణ్యతలకు పట్టం కడుతున్నారు. ఎఐ, ఆటోమేషన్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు ఉద్యోగాల నియామక ప్రక్రియలను క్రమబద్ధం చేస్తున్నాయి. ఈ మార్పులు, అత్యంత విలువైన సాంకేతిక సేవలు, నూతన ఆవిష్కరణల వైపు దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయి.ఈ ఆధునిక సాంకేతిక నైపుణ్య ప్రక్రియలను అందిపుచ్చుకోగలిగితేనే ఇప్పుడు ఉద్యోగాలు లభిస్తాయి.ఈ మేరకు ఉద్యోగ అవకాశాలు 80శాతం వరకు సాంకేతిక నిపుణులతో 2025-26 నాటికి 20 వరకు పెరుగుతాయని ఐటి రంగ వర్గాలు పేర్కొంటున్నాయి. అత్యంత ఆధునిక సాంకేతికతల వల్ల 2030 నాటికి దేశంలో 150 బిలియన్ డాలర్ల వరకు ఆర్థిక ప్రయోజనం సిద్ధిస్తుందని అంచనా వేస్తున్నారు. జనరేటివ్ ఎఐవంటి సాంకేతికతలే ఐటిరంగంలో 2030 నాటికి రెండు మిలియన్ల వరకు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాయని నివేదికల వల్ల తెలుస్తోంది. దేశంలో ప్రస్తుతం 1700 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఉన్నాయి. వీటి వల్ల 1.9 మిలియన్ మంది ఉద్యోగాలు పొందుతున్నారు. 2030 నాటికి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల సంఖ్య 2200 వరకు చేరుకుంటుందని, వాటి ద్వారా 2.5 మిలియన్ నుంచి 2.8 మిలియన్‌వరకు ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయని ఐటి నిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు అనేవి ఎదురవుతున్న సవాళ్లకు అనుగుణంగా అనేక రకాల వ్యూహాత్మక విధులను నిర్వహించడానికి బహుళజాతి సంస్థలు స్థాపించే కేంద్రాలు, ఆవిష్కరణ కార్యక్రమాలు,పరిశోధనలు, సాఫ్ట్వేర్ డెవలప్మెంట్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ పరివర్తన కార్యక్రమాలను వేగవంతం చేయడం, వనరుల వినియోగాన్ని పెంచడం తదితర విధులను ఈ కేంద్రాలు నిర్వహిస్తుంటాయి.ఐటి రంగంలో ఒప్పందం ప్రకారం ఉద్యోగులను నియమించుకునే విదానంలో 43.5డిమాండ్తో బెంగళూరు కేంద్రస్థానంగా ఉన్నప్పటికీ, 13.4 డిమాండ్లో రెండో అత్యధిక స్థానంలో హైదరాబాద్ ఉంది. ఈ ఉద్యోగాల కల్పనలో విద్యార్హతల కన్నా సాంకేతిక నైపుణ్యమే కీలక పాత్ర వహిస్తోందన్నది ఉద్యోగార్థులు గమనించవలసిన కీలకాంశం. •

# ప్రపంచాభివృద్ధికి యువతే ప్రధాన వనరు



డా. చిటికెన కిరణ్ కుమార్

యువత అంటే ఉత్సాహం, కలలు, ఆవేశం, ఆశ. ఒక కొత్త ఉదయం వలె వీరి ఆత్మలో వెలుగు ఉంది.ఆ వెలుగేచైతన్యం. మన సమాజానికి జీవం ఇచ్చే శక్తి యువతలో ఉంది. ఒక చినుకుతో నది మొదలవుతుంది, ఒక ఆలోచనతో మార్పు మొదలవుతుంది. ఆ ఆలోచన యువత హృదయంలో వెలిగితే, సమాజం కొత్త దిశగా సాగుతుంది. ప్రతి తరంలో యువతే ఆశల ప్రతీక. వారిలో ఉప్పొంగే ఉత్సాహం దేశాన్ని ముందుకు నడిపే శక్తిగా మారుతుంది. కానీ ఆ ఉత్సాహం సరైన మార్గంలో నడిస్తేనే అది వెలుగు అవుతుంది. దిశ లేకుండా వెలిగితే అది క్షణంలోనే ఆరిపోతుంది. అందుకే ప్రతి యువ మనసులో చైతన్య జ్యోతి వెలగాలి. ఆ జ్యోతి అంటే తెలుసుకోవాలనే తపన, జీవితం పట్లబాధ్యత, ఇతరుల పట్ల కరుణ, సమాజం పట్ల సేవా మనస్సు.మన దేశ చరిత్రలో ప్రతి పుటలో యువత పాత్ర గొప్పది. స్వాతంత్ర్య పోరాటంలో ముందుండి నడిచినవారు కూడా యువకులే. చిన్న వయసులోనే వారు తమ జీవితాన్ని త్యాగం చేసి ఈ దేశానికి గౌరవం తెచ్చారు. నేటి యువత కూడా ఆ స్ఫూర్తిని తిరిగి పొందాలి. కాలం మారింది కానీ విలువలు మారకూడదు. వీరుల త్యాగం మనకు మార్గదర్శనం. ఆ మార్గంలోనే నేటి యువజనులు నడవాలి.ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోంది. విజ్ఞానం, సాంకేతికత, సమాచార వనరులు అన్నీ చేతిలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. కానీ ఆ సదుపాయాలను ఉపయోగించే తీరు మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది.స్మార్ట్‌ఫోన్ మన చేతిలో ఉన్నా, మన ఆలోచనలు ఇంకా చీకటిలో ఉంటే ఆ సాంకేతికత వ్యర్థం. అందుకే యువతలో చైతన్యం అనేది మానసిక అవగాహన. ఆలోచించగల శక్తి. మనసును మన దిశలో నడిపించగల శక్తి. యువత అంటే కేవలం వయస్సు కాదు, అది మనసు స్థితి. వయస్సు పెరిగినా చైతన్యం ఉన్నవారు ఎప్పటికీ యువకులే. కానీ నేటి యువతలోని చాలామంది ఈ చైతన్యాన్ని లోతుగా గ్రహించడం లేదు. విద్య అంటే ఉద్యోగం మాత్రమే కాదు, విద్య అంటే మనిషిని మేల్కొలిపే శక్తి. ఒక పుస్తకం మనకు జ్ఞానం ఇస్తుంది, కానీ ఒక సద్విచారం మన జీవితాన్ని మారుస్తుంది. ఈ మార్పు కోసం యువతలో చైతన్యం జ్వలించాలి. మన గ్రామాల్లో, పట్టణాల్లో, కళాశాలల్లో యువత సమాజం కోసం ఏదైనా చేయాలనే తపనతో నిండిపోవాలి. చెత్త సమస్య నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు, చదువు నుంచి కళల వరకు ప్రతి రంగంలో యువత చురుకుగా పాల్గొనాలి. ఒక మొక్క నాటడం చిన్న పని అనిపించినా, అది జీవం నాటడం వంటిదే. ఒక చిన్న సాయం, ఒక మంచి మాట కూడా చైతన్య జ్యోతిగా వెలగవచ్చు.నేటి యుగంలో మానవ సంబంధాలు కొంచెం దూరమవుతున్నాయి. సామాజిక మాధ్యమాలు దగ్గర



చేసినా, మనసులు దూరమవుతున్నాయి. ఈ మధ్యలో యువతే సమతుల్యతను సాధించగల శక్తి. సాంకేతికతను సద్బుద్ధితో వాడితే అది చైతన్యానికి వేదిక అవుతుంది. అజ్ఞానంగా వాడితే అది మనిషిని ఒంటరితనంలోకి నెడుతుంది. అందుకే యువతలో సాంకేతిక జ్ఞానం మాత్రమే కాదు, మానవతా జ్ఞానం కూడా అవసరం.ప్రతి యువకుడు తనలోని చినుకును, తన ఆలోచనను వెలిగించుకోవాలి. "నేను ఏమి చేయగలను? అనే ప్రశ్నతో మొదలయ్యే ఆలోచనే చైతన్య జ్యోతి. ఎవరో ప్రారంభిస్తారని ఎదురుచూడకుండా, తానే మార్పుకు మార్గం చూపాలనే తపన కలిగి ఉండాలి. అప్పుడు ఒక్కరి కాంతి మరొకరిని వెలిగిస్తుంది, చివరికి అది సమాజం మొత్తం వెలుగుతో నిండుతుంది. విద్యార్థి దశలోనే యువతకు సమాజం పట్ల అవగాహన కలగాలి. పాఠ్యపుస్తకాల జ్ఞానం సరిపోదు, జీవన పుస్తకం చదవడం కూడా అవసరం. పేదరికం, నిరుద్యోగం, పర్యావరణ నాశనం, విలువల క్షీణత వంటి అంశాలపై ఆలోచించే తరం ఏర్పడాలి. ఆలోచనలే మార్పుకు విత్తనాలు. ఈ విత్తనాలు మనసులో నాటితే భవిష్యత్తులో సమాజం పచ్చని చెట్టుగా ఎదుగుతుంది. యువతలో చైతన్యం అంటే కేవలం ఆత్మవిశ్వాసం కాదు, అది బాధ్యతాభావం. మన దేశం,మన భూమి, మన ప్రజలు -ఇవన్నీ మనదే అనే తపనతో ముందుకు సాగడం. ఉద్యోగం సంపాదించడమే లక్ష్యం కాకుండా, జీవితంలో ఉపయోగకరమైన పని చేయాలనే సంకల్పం ఉండాలి. ఒక్కరి విజయంకాదు,సమాజ విజయం ముఖ్యం. చైతన్య జ్యోతి వెలగాలంటే ధైర్యం అవసరం.కష్టాలముందు నిలబడగల సత్తా అవసరం. ప్రతి విఫలం ఒక పాఠంగా తీసుకోవాలి, ప్రతి తప్పు ఒక మార్గదర్శకంగా మార్చుకోవాలి. విజయానికి దారితీసేది క్రమశిక్షణ, నిబద్ధత, నమ్మకం. ఇవి ఉన్న చోట చైతన్యం వెలుగుతుంది. సామాజిక సేవలో యువత పాత్ర అపారమైనది. గ్రామాల్లో ఉన్న సమస్యలపై అవగాహన కలిగివాటిని పరిష్కరించడానికి ముందుకు రావడం, రక్తదానం చేయడం, పుస్తకాలు పంచడం, పాఠశాలల్లో విద్యార్థులకు స్ఫూర్తి కలిగించడం ఇవన్నీ చైతన్యానికి నిదర్శనాలు. సత్యం, ప్రేమ, సేవ అనే మూడు దీపాలతోనే యువత ఆత్మ వెలుగుతుంది.ప్రపంచం మారడానికి పెద్ద అద్భుతం అవసరం లేదు. ఒక చిన్న ఆలోచన, ఒక నిజమైన ప్రయత్నం చాలు. ఉదయం సూర్యుడు చీకటిని పారద్రోలినట్లు, ఒక చైతన్యవంతుడైన యువకుడు తన పరిసరాలను వెలుగుతో నింపగలడు. ఆ ఒక్క చినుకుతోనే వాన మొదలవుతుంది. ప్రతీ యువకుడు తనలోని ప్రతిభను గుర్తించాలి. కొందరికి కళల పట్ల ఆసక్తి ఉంటుంది.కొందరికి విజ్ఞానంపై, మరికొందరికి సేవాపరమైన మనస్సు ఉంటుంది. ఈ ప్రతిభను సమాజ ప్రయోజనానికి ఉపయోగించడమే చైతన్యం. మనం ఏ రంగంలో ఉన్నా - నిజాయితీతో, కర్తవ్యభావంతో, ప్రేమతో పని చేస్తేనే మన జీవితం అర్థవంతమవుతుంది. యువతలో చైతన్యం వెలిగితే కుటుంబం బలపడుతుంది. సమాజం పుష్టిపడుతుంది. దేశం ముందుకు సాగుతుంది.కాలం మారుతున్నా విలువలు నిలబెట్టుకోవడం సులభం కాదు.కానీ విలువలేని జీవితం చీకటిలాంటిది. నిజాయితీ, కరుణ,సహనం, సహకారం ఇవి యువతలో కొనసాగాలి. ఈ విలువలే చైతన్య జ్యోతికి ఇంధనం. ఆ ఇంధనం లేకుంటే వెలుగు ఆరిపోతుంది. పాఠశాలల్లో, కళాశాలల్లో కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, జీవితం పట్ల అవగాహన కలిగించే కార్యక్రమాలు జరగాలి. సాహిత్యం, కళ, విజ్ఞానం, సేవ -ఇవన్నీ యువతలో చైతన్యాన్ని పెంచే సాధనాలు. మనసులోని సందేహాలను ప్రశ్నగా మార్చడం, ప్రశ్నను ఆలోచనగా మార్చడం, ఆలోచనను చర్యగా మార్చడం - ఇదే నిజమైన చైతన్య ప్రవాహం. •

Main tab page 111_Main tab page 111.qxd 11/12/2025 10:52 PM Page 1



## బల్క్ డ్రగ్ పార్క్‌కు సానుకూలత..

**- ముఖ్యమంత్రికి ధన్యవాదాలు: డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి**



**ప్రభాతవార్త ప్రతినిధి - ఒంగోలు**

ప్రకాశం జిల్లా కనిగిరిలో ప్రారంభమైన ఎమ్ఎస్ఎంఈ పార్క్‌లో బల్క్ డ్రగ్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక భూమి కేటాయించాలని బల్క్ డ్రగ్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇటీవల కోరిన విషయం తెలిసిందే. ఈ మేరకు నేషనల్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించి, బల్క్ డ్రగ్ పార్క్ ప్రతిపాదనను సీరియస్‌గా పరిగణనలోకి తీసుకున్నారు. సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడమే కాకుండా, ఈ అంశంపై మరింత విస్తృతంగా చర్చించేందుకు ఎగ్జిక్యూటివ్ బాడీని కలవమని సూచించారు. సీఎం స్పందనపై డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు, పరిశ్రమల అభివృద్ధి పట్ల సీఎం చంద్రబాబు చూపుతున్న శ్రద్ధ ప్రశంసనీయమన్నారు. బల్క్ డ్రగ్ పరిశ్రమలకు ప్రత్యేక స్థల కేటాయింపు అత్యవసరమని, ఇది చిన్న మరియు మధ్య తరహా యూనిట్ల అభివృద్ధికి దోహదం చేస్తుందని డాక్టర్ ఏలూరి వివరించారు. కనిగిరి ఎమ్ఎస్ఎంఈ పార్క్ పరిధిలో 500 నుండి 1000 ఎకరాల భూమిని బల్క్ డ్రగ్ యూనిట్లకు కేటాయించి, రహదారులు, విద్యుత్, నీటి వనరులు వంటి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ముఖ్యమంత్రిని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిలకు అలాగే అధికారులకు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## సూర్యశ్రీ ట్రస్ట్‌చే పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ వితరణ



**ఒంగోలు, ప్రభాతవార్త**

సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాష ఆధ్వర్యంలో ఒంగోలు భీమరాజు వీధిలోగల మున్సిపల్ ప్రైమరీ పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా సూర్య శ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన మంచినీరు అందించుటకు ట్రస్టు ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని తెలిపారు. మానవత సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ఈరోజు ఈ మున్సిపల్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు కలుషిత నీటి ద్వారా వ్యాధులు రాకుండా మంచినీరు అందించాలని ఉద్దేశంతో మానవత్వంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన ట్రస్ట్ వారికి అభినందనలు తెలిపారు. ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాష మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంట్ కు 40వేల రూపాయలు ఖర్చయిందని దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్కూలు మరుగుదొడ్ల రిపేర్లకు పదివేల రూపాయలు అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో నంబూరి శ్రీరాములు. టీచర్ అడుసుమల్లి అనిత. ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆలీబాబా. పివిఆర్ హెచ్‌యం ఎం రాధిక. పాఠశాల సిబ్బంది షేక్ అన్వర్. ఎం. సంపూర్ణ. కొత్తపట్నం హైస్కూల్ మాస్ టీచర్ సిహెచ్ కోటేశ్వరరావు. విశ్రాంత తెలుగు టీచర్ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికే ప్రధమ స్థానం

**- యువనేత దామచర్ల సత్య**



**కొండపి, ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేసే వారికే పార్టీ అధిష్టానం ప్రథమ స్థానం కల్పిస్తుందని అందులో భాగంగానే పదవులు, అందించి గౌరవించిందని మార్టెం బోర్డు చైర్మన్ దాంచర్ల సత్య అన్నారు. బుధవారం మండలం కొండకిలోని సీతారామ కళ్యాణ మండపంలో ఎన్నిక కాబడిన మండల అధ్యక్షుడు ప్రమాణస్వీకారం కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. ముందుగా ఎన్నిక కాబడిన మండల క్లస్టర్ బూత్ లెవెల్ అభ్యర్థులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కుటుంబానికి దామచర్ల కుటుంబం ఎప్పుడు అండగా ఉంటుందని ఆయన అన్నారు, నూతనంగా ఎన్నికైన టంగుటూరు మండలం చదలవాడ చంద్రశేఖర్, సింగరాయ కొండ మండలం మించల బ్రహ్మయ్య, జరుగుమల్లి మండలం పోకూరి రవీంద్రబాబు, పొన్నలూరు మండలం అనుమోలు సాంబశివరావు, కొండపి మండలం కొర్రపాటి వసంతరాయుడు, మర్రిపూడి మండలం గోపిరెడ్డి శ్రీనివాసులును, అన్ని విభాగాల కమిటీల సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించి అభినందించారు . అంతకు ముందుగా స్వర్గీయ నందమూరి తారకరామారావు దామచర్ల ఆంజనేయులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి రామయ్య చౌదరి, బత్తుల నారాయణస్వామి, యువ నాయకులు నేతి రవికుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా మాగుంట రాఘవరెడ్డి పుట్టినరోజు వేడుకలు



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కూమారులు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డి పుట్టినరోజు వేడుకలు మాగుంట అభిమానులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా బెజవాడ సురేష్ రెడ్డి పాల్గొన్నారు. మాగుంట కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు రాఘవరెడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. సమతా వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని నాలుగు అన్నా కాంటీన్లలో స్వంత నిధులతో పేదలకు భోజనాలు ఏర్పాటుచేశారు. ఉచిత బోజనాల గురించి పేదలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లం సత్యనారాయణ, తాతా ప్రసాదు, కుప్పా రంగనాయకులు, పాలపర్తి శ్రీనారెడ్డి, యత్తపు కొండారెడ్డి, దివి రమేష్, వాకా సంజీవరెడ్డి, కండే శ్రీనివాసారావు, ఉలవ గోపి, అయినాబత్తిన కృష్ణారావు (కిట్టు), ఆత్మకూరి బ్రహ్మయ్య, ఏ.వి. రమణారెడ్డి, తాతా కన్నా, వి.సి. రెడ్డి, ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, కాకుమాను సాగర్, కొర్రపాటి శ్రీనివాసరావు, బలగాని కోటేశ్వరరావు, వి.సి.రెడ్డి, యత్తపు కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాహన చోదకులు రహదారి భద్రత నియమాలు పాటించాలి

**- జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాల డ్రైవర్లకు మెడికల్ క్యాంప్..**



**ఒంగోలు, ప్రభాతవార్త**

వాహన చోదకులు తప్పనిసరిగా రహదారి భద్రత నియమాలు కలిగి ఉండాలని, వాహన చోదకులు తప్పనిసరిగా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ సుశీల అన్నారు. రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆదేశాలు మేరకు ఒంగోలు ఉప రవాణా శాఖ కార్యాలయం నందు వాహన చోదకులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరం నందు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు తమ వైద్య సేవలు అందించగా పాఠశాల, కళాశాలలో బస్సుల చోదకులు పాల్గొని వైద్య సేవలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ శిబిరం నందు అనుభవం బీపీ.షుగర్,కంటి,గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా వైద్య సేవలు అందజేశారు.ప్రతి వాహన చోదకుడు తప్పనిసరిగా రహదారి భద్రత నియమాలు పాటించాలని కోరారు.జిల్లాను ప్రమాదాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో రవాణా శాఖ ఇన్స్పెక్టర్లు రామచంద్ర రావు, జగదీష్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు జెర్సీల పంపిణీ



**చీమకుర్తి, నవంబర్ 12, ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ అఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో, అధ్యక్షుడు తొగటి శ్రీను ఆర్థిక సహకారంతో క్రీడాకారులకు జెర్సీలను బహుకరించారు. చీమకుర్తిలోని డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్ స్టేడియం లో అందించారు. గుజరాత్ లో జరగబోయే పదవ సబ్ జూనియర్ నేషనల్ డాడ్జి బాల్ 202526 ఛాంపియన్షిప్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరుపున ప్రకాశం జిల్లా నుంచి 18 మంది బాల బాలికలు సెలెక్ట్ అయ్యారు. సెలెక్ట్ అయిన క్రీడాకారిణిలకు మరియు క్రీడాకారులకు రోటరీ క్లబ్ అఫ్ చీమకుర్తి తరుపున వారికీ జెర్సీ లను బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు తోగటి శ్రీను, మాజీ అధ్యక్షుడు గొల్లపూడి చౌదరి, మాజీ సెక్రటరీ లు పరాంకుశం శ్రీనివాసమూర్తి, అంబటి వీరారెడ్డి, సుధాకర్, సభ్యులు నాగేళ్ల సత్యం మరియు భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ వై జయకృష్ణ, టీమ్ కోచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## ఆర్యవైశ్య కార్తీక వన సమారాధనకు శిద్దాకు ఆహ్వానం



**ఒంగోలు, ప్రభాతవార్త**

పెనుగొండ క్షేత్ర పీఠాదిపతులు పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ ప్రజ్ఞానంద సరస్వతి అనుజ్ఞతో ఈ నెల 16వ తేదీ నెల్లూరు జిల్లా కావలిలో జరగనున్న ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవ రావుని ఒంగోలు లోని వారి నివాసంలో కలసి ఆహ్వాన పత్రిక అందచేసిన ఆర్యవైశ్య మహా సభ కార్యదర్శి కావలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తటవర్తి రమేష్ తదితరులు.

# 2026 కల్లా వెలుగొండ ప్రాజెక్టు పూర్తిచేయాలి

**- ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయాలి**

**- నిర్లక్ష్యం వహిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటాం**

**- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరిక**

**పెద్దదోర్నాల, నవంబర్ 12, ప్రభాతవార్త**

2026 కల్లా వెలుగొండ ప్రాజెక్టు చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృత నిశ్చయంతో ఉన్నారని, తదనుగుంగా



పనులు చేయాలని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వెలుగొండ ఫీడర్ కాలువ పనులు, జంట సొరంగాల్లో డివాటరింగ్ పనులను ఇరిగేషన్ నిపుణుల బృందంతో బుధవారం పెద్దదోర్నాల మండలం కొత్తూరు వద్ద జరుగుతున్న వెలుగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. నాడు ఫీడర్ కెనాల్ గండి పూడిక పనులు, టన్నల్స్‌లో డివాటరింగ్ పనులు యుద్ద ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టన్నెల్ డివాటరింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించిన పూర్తికాకపోవడంపై అధికారులను, ఏజెన్సీపై మంత్రి నిమ్మల రామా నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని లక్ష్యం ప్రభుత్వానికి ఉంటే సరిపోదు.. ఏజెన్సీ, అధికారులకు కూడా ఉండాలని సూచిం చారు. 2026 కల్లా వెలుగొండను పూర్తి చేసే లక్ష్యం మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో నిరంతరం పర్యవేక్షణ చేస్తానని ఆయన హెచ్చరించారు.



వెంటనే టన్నల్స్ లో లైనింగ్, బెంచింగ్ పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్ల ను చేయాలని అధికారులను ఏజెన్సీని ఆదేశించారు. 456 కోట్లతో చేపట్టే ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ఈ నెలలో ప్రారంభించి వచ్చే సీజన్‌కు పూర్తి చేయాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి వెనుక పడ్డ ప్రాంత రైతాంగానికి సాగునీరు తాగునీటి కష్టాలు తీరుస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంత్రితో పాటు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ షేక్ మాబు, అధికారులు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వైసీపీ అధికారంలోకి రాగానే పీపీపీ విధానాన్ని రద్దుచేస్తాం

**- ఒంగోలు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు**



**ఒంగోలు, ప్రభాతవార్త**

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఒంగోలులో బుధవారం మున్సిపల్ కాలేజీ గ్రౌండ్ వద్ద నుండి కలెక్టర్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. అవినీతి చేసేందుకు సొంతంగా లబ్ది పొందేందుకే కూటమి ప్రభుత్వం కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. వైకాపా తిరిగి అధికారంలోకి రాగానే పీపీపీ విధానాన్ని రద్దు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలకు ఆపార్టీ నేతలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో చంద్ర బాబునాయుడు 17నెలల కాలంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా అన్ని ప్రైవేటు పరం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వైసీపీ నాయకుల మీద ఏదో విధంగా కేసుల్లో ఇరికించడం తప్ప చంద్రబాబు అభివృద్ధి చేయడం లేదన్నారు. లోకేష్‌కి కట్టబెట్టడానికే ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు ఎలాంటి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని ఏ పోరాటానికైనా తాము సిద్ధమన్నారు. ఒక వేళ బడుగు, బలహీన వర్గాల కోసం ఎంతో ప్రతిపాదన తీసుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాలేజీని ఏర్పాటు చేస్తే చంద్రబాబునాయుడు ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణం చేయడం చూస్తుంటే పేద వర్గాల వారికి చదువు దూరం చేయడమేనని ఆయన ఆరోపించారు. ఈ నిరసన ర్యాలీలో కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, పలువురు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, వైసీపీ నగర పాలక అధ్యక్షుడు కటారి శంకర్, వైసీపీ నాయకులు, మహిళా నాయకురాళ్లు కార్యకర్తలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## కొండపిలో వైసిపి ఆధ్వర్యంలో ర్యాలీ..




**కొండపి, ప్రభాతవార్త**

ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక నిర్ణయానికి వ్యతిరేకంగా కొండపిలో బుధవారం మాజీ మంత్రి వైఎస్ఆర్సిపి కొండేపి నియోజకవర్గ ఇంచార్జ్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు మాదాసి వెంకయ్య, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలతో కలిసి ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవిన్యూ కార్యాలయంలో తాసిల్దార్‌కి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కొండేపి నియోజకవర్గ ఆరు మండల అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగ అధ్యక్షులు, మండల అనుబంధ విభాగ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, వైకాపా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమం అంటే వైఎస్ఆర్ గుర్తుకొస్తారు

**- 4సార్లు ముఖ్యమంత్రిచేసిన నారా వారంటే ఒక్క పథకం గుర్తుకురాదు**

**- వైకాపా అధికారప్రతినిధి శ్యామల, ఎమ్మెల్సీ మాధవరావులు ఎద్దేవా**




**అద్దంకి నవంబర్ 12, ప్రభతవార్త**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోను, ప్రస్తుత ఆంధ్ర రాష్ట్రంలోను వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల పేర్లు చెబితే అభివృద్ధి, సంక్షేమం గుర్తుకు వస్తాయని రాష్ట్ర వైసిపి అధికార ప్రతినిధి శ్యామల అన్నారు. నాల్గవ సారి ముఖ్యమంత్రిగా చేస్తున్న నారా చంద్రబాబు నాయుడు పేరు చెబితే ఒక్క పథకం గుర్తురాదని శ్యామల ఎద్దేవా చేశారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల ద్వారా ప్రవేశ పెట్టిన పథకాల పేర్లను మార్చి చంద్రబాబు కాలం గడుపుతున్నారని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులతో 17 ప్రభుత్వ మెడికల కళాశాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేయించి, 5కళాశాలను పూర్తిచేసి రాష్ట్ర ప్రజలకు వైద్యాన్ని, చదివే మెడికల్ విద్యార్థులకు మెడికల్ సీట్లను అందుబాటులోకి తెస్తే వాటిని రద్దు చేసి ఈ రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చంద్రబాబు చేశారని ఆమె విమర్శించారు. ఈ రెండేళ్ళ కాలంలో రెండువేలకు పైగా మెడికల్ సీట్లను ఎపి విద్యార్థులు కొల్పోయరని ఆమె అవేదన చెందారు. ప్రక్క రాష్ట్రాల మెడికల్ కళాశాల కోసం ప్రాదేయపడుతున్నా అనుమతుల రాని స్థితిలో మన ముఖ్యమంత్రి వున్న కళాశాలలను ప్రవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారని అని అన్నారు. ఇప్పటికే కడపలో మెడికల్ కళాశాలలనుండి



ఫర్నిచర్‌తో సహా తరలించి వేశారని విమర్శించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కూడ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పోలీసు అధికారులు కార్యకర్తలు దూషించే విధానం మానుకోవాలని ఆమె సూచించారు. రెవిన్యూ కార్యాలయంలో ఎంఎల్సీ వెళ్ళినా కనీసం గౌరవవించే స్థితికూడ లేకుండా వ్యవహరించడం ప్రస్తుత కొందరు ఉద్యోగుల స్థితికి అద్దంపడుతుందన్నారు. త్వరలో రాష్ట్రంలో జగనన్న పాదయాత్ర మొదలు అవుతుందని ఒక అడుగుకు లక్షల అడుగులు తోడైనడుస్తుయని శ్యామల అన్నారు. ఎంఎల్సీ తుమాటి మాధవరావు మాట్లాడుతూ గత జగనన్న ప్రభుత్వం ఈ రాష్ట్రంలో సంక్షేమం అంటే, అభివృద్ధి అంటే ఎమిటో చేసి చూపించారని అన్నారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపే కరొనా మహమ్మరి ప్రపంచాన్ని వణికించిందని ఆ స్థితిలో కూడ ప్రవేటు ఆసుపత్రిలలో వైద్యం కోసం లక్షలు డిమాండ్ చేస్తే జగనన్న ఆంధ్రరాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి బరోసా కల్పించారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రమైన ఇప్పటికీ తెలంగాణకు అంబులెన్స్‌లలో కరోనా రోగులు వెళ్ళకుండా చెక్‌పోస్టులు పెట్టి ఆపారన్నారు. అయిన ఆంధ్ర ప్రజలను తన స్వంత బిడ్డలలా చూసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. ఇటువంటి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రవేటు వ్యక్తులకు ధారదత్తం చేయడానికి వెనకాడని ఈ కూటమి ప్రభుత్వం రాబోయే రోజులలో తగిన మూల్యం చెల్లించుకుంటుదని ఆయన అన్నారు.ముందుగా రెవిన్యూ కార్యాలయానికి చేరుకున్న ర్యాలీ కార్యాలయంలో శ్యామల, మాధవరావుతోపాటు జిల్లా, నియోజకవర్గ, మండల నేతలు అధికారికి వినతి పత్రం అందజేశారు.

# సొంత ఇంటితో ప్రతి ఒక్కరికి ఆత్మగౌరవం:కలెక్టర్





**ఒంగోలు, ప్రభాతవార్త**

సొంత ఇంటితో ప్రతి ఒక్కరికి ఆత్మగౌరవం లభిస్తుందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. అందుకే అర్హులందరికి సొంత ఇల్లు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి చేసిన మూడు లక్షల ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమం బుధవారం చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ఒంగోలు నగరంలోని కేశవరాజుకుంట ప్రాంతంలో హౌసింగ్ అధికారులు నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు, వుడా చైర్మన్ షేక్ రియాజ్, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 7372 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, వీటి లబ్దిదారులకు రూ.17.77 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. అదే విధంగా వివిధ నిర్మాణ దశలు పూర్తి చేసుకున్న 11,443 మంది లబ్దిదారులకు రూ.18.36 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించినట్లు చెప్పారు. గతంలో రూ.1.80 లక్షలతో పోల్చితే ప్రధానమంత్రి ఆవాస్ యోజన -2.0 పథకం కింద రూ.2.50 లక్షలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పాతవారికి కూడా ఈ పెంపును వర్తింపచేస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీవీటీజీ(చెంచు)లకు ఇళ్ల నిర్మాణానికి అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను వినియోగించుకుని అర్హులందరూ ఇల్లు నిర్మించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సొంత ఇల్లు ఉండాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒంగోలు నియోజకవర్గంలో 400 ఇళ్ల నిర్మాణం పూర్తయింది అన్నారు. లబ్దిదారులకు రూ.95 లక్షల ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. అదే విధంగా వివిధ దశలలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న 721 మందికి రూ.1.86 కోట్ల ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. టిడ్కో ఇళ్లను కూడా త్వరలోనే లబ్దిదారులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రియాజ్ మాట్లాడుతూ గృహ ప్రవేశాలు చేస్తున్న పేదల జీవితాలలో ఇది ఒక పండుగ రోజు అని వ్యాఖ్యానించారు. పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి ఈ గృహప్రవేశాలే ఒక నిదర్శనమని అన్నారు. మేయర్ మాట్లాడుతూ పేదల ఆకాంక్షలను నెరవేర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణాన్ని కూడా చేపడుతున్నట్లు తెలిపారు. తొలుత ఇల్లు మంజూరు అయిన పి.రమాదేవి- శ్రీనివాసరావు దంపతుల గృహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. ఇంటి నిర్మాణం పూర్తి అయిన బి.సుభాషిణి- కోటేశ్వరరావు దంపతులకు ఇంటి తాళపు చెవి అందించి, ప్రభుత్వం తరుపున నూతన వస్త్రాలను కూడా వీరు అందజేశారు. కొత్తగా ఇల్లు మంజూరు అయిన లబ్దిదారులకు కూడా సంబంధిత పత్రాలను ఈ సభా కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, ఒంగోలు కమీషనర్ వెంకటేశ్వరరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

6_6.qxd 11/12/2025 11:33 PM Page 1



## నేడు టీడీపీ మండల కమిటీ ప్రమాణ స్వీకారం




**బల్లికురవ, నవంబర్ 12, ప్రభాతవార్త**
నూతనంగా ఎంపిక కాబడిన టీడీపీ మండల కార్యవర్గం గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు దూళిపాళ్ల హనుమంతరావు, కత్తి అశోక్ బాబులు బుధవారం పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ కమిటీలకు ఎంపిక కాబడిన కార్యవర్గ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలి రావాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పార్టీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించనున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, అధికంగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**పుల్లలచెరువు, నవంబర్ 12, ప్రభాతవార్త**
పుల్లలచెరువు మండలంలో భవిత సెంటర్‌ను జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ నాగేంద్ర నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. భవిత సెంటర్‌లో ఉన్న విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను మెరుగుపరిచేలా బోధన చేయాలని సూచించారు. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను ఉపయోగించి విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ పూర్ణయ్య, రంజిత్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆధునిక సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



**వెలిగండ్ల, నవంబర్ 12, ప్రభాతవార్త**
రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయాధికారి తమ్మినేని శిల్ప కోరారు. బుధవారం నాడు మండలంలోని గుడిపాటిపల్లి, జేఎన్‌పల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శిల్ప ఆయా గ్రామాల్లోని రైతులతో సమావేశం జరిపి, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. అలాగే ఆయా గ్రామాల్లోని రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి శిల్ప వాటిని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. వ్యవసాయపరంగా ఏ సందేహాలు ఉన్నా వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించటంతో పాటు అవసరం అయినా సలహాలు, సూచనలు తీసుకోవాలని వ్యవసాయాధికారి శిల్ప తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ రైతులు, పశు సంవర్ధకశాఖ సహాయకులు నాలి వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు కే.వెంకట బ్రహ్మం, కే.స్టీఫెన్ పాల్గొన్నారు.

### గ్రామ పంచాయతీని సందర్శించిన ఉపమండల పరిషత్ అభివృద్ధి అధికారి



**జరుగుమల్లి, నవంబర్ 12, ప్రభాతవార్త**
స్థానిక మండల పరిధిలోని జరుగుమల్లి గ్రామ పంచాయతీని జరుగుమల్లి ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి జీవీ కామేశ్వరరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సదర గ్రామ పంచాయతీలోని సిబ్బందికి ఇంటి పన్ను వసూళ్ల చేయడంలో శానిటేషన్, స్వామి గురించి, ఇతర విషయాల్లో తగు సూచనలు జారీ చేయుట జరిగింది. అలాగే జరుగుమల్లి మండలంలోని స్వామిత్వ సర్వేకు సంబంధించి వ్యక్తరైజేషన్ పూర్తి చేసుకున్న గ్రామ పంచాయతీలలో ఆస్తి హక్కు దారులకు 9(2) నోటీసెస్‌లను అందజేస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ



**జరుగుమల్లి, నవంబర్ 12, ప్రభాతవార్త**
ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ముందస్తు కార్యక్రమంలో భాగంగా బుధవారం జరుగుమల్లి తహశీల్దార్ పి.మురళీ ఆధ్వర్యంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో భాగంగా 2002 ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయటం జరుగుతుందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో చేయాల్సిన అంశాలు, బీఎల్‌ఓ యాప్ పనితీరు గురించి శిక్షణ ఇవ్వడం, పలు సూచనలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ బ్రహ్మయ్య, సూపర్‌వైజర్లు ప్రసన్నేశ్వరి, విజయ ప్రసూన, హనుమంతరావు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం ర్యాలీ

### - ర్యాలీకి భారీగా బయలుదేరిన జరుగుమల్లి నాయకులు



**జరుగుమల్లి, నవంబర్ 12, ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక నిర్ణయానికి వ్యతిరేకంగా కొండపి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ మాదాసి వెంకయ్య, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలతో కలిసి ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో భాగంగా జరుగుమల్లి మండల పార్టీ అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసరావు పిలుపు మేరకు మండలంలోని అన్ని గ్రామాల నుండి జగనన్న సైనికులు భారీగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండపి నియోజకవర్గ 6 మండల అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ సభ్యులు, జిల్లా, నియోజకవర్గం, మండల అనుబంధ విభాగ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మాగుంట రాఘవ రెడ్డి జన్మదిన వేడుకలు




**తాళ్లూరు, నవంబర్ 12 ,ప్రభాతవార్త**
మండలం లోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని గుంటి గంగ సన్నిధిలో గల తేజా వయో వృద్ధ క్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఉప సర్పంచ్ యల్లర్తి కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పండ్లు పెట్టారు. వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి, బియ్యం అంద జేశారు. అనంతరం రాఘవరెడ్డి సేవల ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, చేతల రమేష్ యాదవ్, రాయుడు, జాష్టి శ్రీను, చిన్న డాక్టర్, బీ కార్తీక్, శనివారపు కోటిరెడ్డి, వై అంజిరెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం, పరిశుభ్రతపై శిక్షణ

**తాళ్లూరు, నవంబర్ 12,ప్రభాతవార్త**
పచ్చదనం, పరిశుభ్రత అంశంపై ఈ నెల 13 నుంచి 15తేదీ వరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, గ్రీన్ అంబాసిడర్లు, డ్వాక్రా సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

## నూతన ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన వెంకట భాస్కర్



**పుల్లలచెరువు, నవంబర్ 12, ప్రభాతవార్త**
కంభం ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వెంకట భాస్కర్‌ను జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు పుల్లలచెరువు మండల ఎంఈఓగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాబోధన సామర్థ్యాలను మెరుగుపరిచేలా ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తామన్నారు. పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

## వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం

### - మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు




**సీఎస్‌పురం, నవంబర్ 12, ప్రభాతవార్త**
రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన విరమించుకోవాలని కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం విశాఖపట్నంలో వైసీపీ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోముఖ్య అతిథిగా కదిరి బాబురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుందని ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. వైద్య విద్య చదవాలనుకునే పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తూ 10 కొత్త మెడికల్ కాలేజీలను పీపీపీ పేరుతో ప్రవేటీకరించాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ సంతకాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒకే సారి 17మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టారన్నారు. వాటిలో ఏడు కాలేజీలనిర్మాణాల పనులు పూర్తికాగా 5 కాలేజీల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. మిగతావి వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల వాటికి అనుబంధంగా ఉండే బోధన ఆసుపత్రుల్లో పేదలకు పూర్తి స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందడంలేదని కదిరి బాబురావు ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం నిర్వాకం వల్ల ఉచిత వైద్య సేవలు దూరమై పేద రోగులు, మెడికల్ సీట్లు కోల్పోయి విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వస్తుందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రజానీకం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం చేపట్టిందన్నారు. ఇకనైనా చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు, ఎమ్మెల్సీ రవీంద్రబాబు, వైసీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మునగపాడులో పొలంబడి కార్యక్రమం



**కొనకనమిట్ల, నవంబర్ 12, ప్రభాతవార్త**
మండలంలోనిమునగపాడులో పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయాధికారి కే.ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ కంది సాగు చేసే రైతులకు మేలైన యాజమాన్య పద్ధతుల గురించి, భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వాడాలని అవసరానికి మించి క్రిమిసంహారక మందులు వాడరాదని వివరించారు. సాగు ఖర్చు తగ్గించుకోవడమే కాక ఎటువంటి పురుగు మందులు అవశేషాలు లేనిపంట ఉత్పత్తులు అధిక ధర పొందవచ్చన్నారు. ప్రస్తుతం కంది మొగ్గ దశలో ఉందని పురుగు గుడ్లను నాశనం చేయడానికి వేప నూనె లీటర్ నీటికి 3 ఎంఎల్ క్లోరిఫైరిపాస్ లీటర్ నీటికి 2.5 మి.లీ లీటర్ల మందును పిచికారి చేస్తే ఆ గుడ్లు పురుగు ఉదృతిని తగ్గించవచ్చని తెలియజేశారు. ప్రతి ఒక్క రైతు కందిలో మొదటి దఫాగా వేప నూనెను స్ప్రే చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విక్రమ్, గ్రామ వ్యవసాయ సహాయకులు మిడతల శ్రీను, విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి స్వాగతం పలికిన మండల నాయకులు




**హనుమంతునిపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**
పీసీపల్లి మండలం లింగన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కుఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో హనుమంతునిపాడు మండలం టీడీపీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి గాయం తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, మండల యూనిట్ కన్వీనర్ దేవిరెడ్డి రాజారామిరెడ్డి, టీడీపీ మండల నాయకులు, ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరక్టర్ కూరాకు వెంకట్, కనిగిరి ఏఎంసీ డైరక్టర్‌లు గాయం కృష్ణారెడ్డి, కూడలి రోశయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానం పలికారు. వెనుకబడిన ప్రాంతమైనటువంటి కనిగిరి నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పించే క్రమంలో భాగంగా నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేసినందుకు గాను ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## రాయితీ శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



**పొన్నలూరు, నవంబర్ 12 ,ప్రభాతవార్త**
రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.రాము రైతులను కోరారు. మండలంలోని రావులకొల్లు, ఉప్పలదిన్నె గ్రామాలలో బుధవారం వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ శాఖలో రైతులకు శనగ విత్తనాలు 25 శాతం రాయితీతో క్వింటాల్ 5850 రూపాయలు (రైతు కట్టవలసినది) చొప్పున కె ఏ కె 2 మరియు జె జి 11 అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా పేర్లు నమోదు చేసుకొని , నగదు చెల్లించినచో గ్రామాలలో పంపిణీ చేస్తామని తెలిపారు. అదేవిధంగా శనగ వేసే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని ట్రై కోడెర్మా విరిడి పౌడర్ 8 గ్రాములు లేదా విటా వాక్స్ పవర్ 1.5గ్రాములు లేదా టెబుకొనజోల్ 1.5గ్రాములు ఒక కేజీ విత్తనానికి కలిపి పట్టించి వేసుకోవడం ద్వారా వేరు కుళ్ళు తెగులు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి పి.శివరామక్రిష్ణ, రావులకొల్లు గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీకాంత్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎ.నాగమల్లేశ్వర రెడ్డి, షేక్.ఇమ్రాన్ నజీర్, పశు వైద్య సహాయకులు షేక్.మోబీన, రైతులు పాల్గొన్నారు.

## భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన



**సంతనూతలపాడు, నవంబర్ 12 ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలంలోని మంగమూరు పేర్నమిట్టగ్రామాల్లో బుధవార నాడు భూసార పరీక్ష ఫలితాల కార్డుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌సీ వ్యవసాయాధికారి వి.శేషమ్మ భూసార పరీక్షా ఫలితాల కార్డు, నేల ఆరోగ్యం గురించి వివరించి వీటి ఆధారంగా వివిధ పంటలలో ఎరువుల యాజమాన్యం, సేంద్రి, జీవన ఎరువుల ప్రాముఖ్యత, వాటి వాడకం గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి పి.పావని శనగ విత్తనాల పంపిణీ వ్యవసాయ పథకాలు, ఈ పంట గురించి వివరించారు. అనంతరం నేల ఆరోగ్యం, భూసార పరీక్షా విధానం, ఫలితాల వివరణ, సమస్యాత్మక భూములను బాగు చేయుట, జీవన ఎరువుల గురించిన కరదీపికలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమం అనంతరం మంగమూరు పేర్నమిట్ట గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుబ్బారెడ్డి, వీఏఏ అమూల్య, ఎంపీఈవో జానకి, రైతులు పాల్గొన్నారు.

## పొలంబడి కార్యక్రమం



**దొనకొండ,నవంబర్ 12,ప్రభాతవార్త**
దొనకొండ మండలంలోని పడమట వెంకటాపురం గ్రామంలో కంది పంట గ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కే.బాలాజీ నాయక్ గారు మాట్లాడుతూ కంది గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని 14 తరగతిలుగా చేయాలని పొలం బడిలో చేయు విధానం గురించి మరియు రైతులు చేయవలసిన పనులు గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరిస్తూ ప్రస్తుత సాగులో ఉన్న కంది పంటలో అక్కడక్కడ వెర్రి తెగులు లక్షణాలు లేత ఆకుల మీద గమనించడమైనది .ఈ పంటలో శనగ పచ్చ, పురుగును గమనించడం జరిగింది. ఈ పురుగు ఉదృతి ఎక్కువ గా ఉన్నప్పుడు లేత ఆకులు మీద ఎక్కువగా రంధ్రాలు నష్టం కలుగ చేయును ఈ పురుగు నివారణకు ఎకరానికి 10 చొప్పున లింగాకర్షకబుట్టలు పంట కంటే ఒక అడుగు ఎత్తులో అమర్చుకోవడం వలన మగరెక్కల పురుగులను ఆకర్షించడం ద్వారా పురుగు ఉధృతి తగ్గించవచ్చును అదేవిధంగా పురుగులను తినే పక్షులు వాలటానికి వీలుగా పంగల కర్రలను పెట్టడం వలన వీటిపై పక్షులు కూర్చొని పొలంలో పురుగులను తింటాయన్నారు. పురుగుల ఉదృతి ఎక్కువగా గమనించిన వెంటనే వేప నూనె 500 ల్దీ తో పాటు క్లోరి ఫైరిఫాస్ 500ద్ది లేదా నోవల్యూరాన్ 200ద్ధ లేదా ఫ్లూ బెండమైడ్20!!జూబి 40 గ్రాములు లేదా ఎమామెక్టిన్ బెంజోయెట్ 80గ్రాములు ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి మందును మార్చి మార్చి పిచికారి చేయాలని తెలిపారు. దొనకొండ మండల వ్యవసాయ అధికారి వి బాలకృష్ణ నాయక్ గారు మాట్లాడుతూ కంది గ్యాప్ పొలంబడి లో చేయు 14 తరగతులు గురించి వివరించినారు. మరియు మట్టి మరియు నీటి పరీక్షలు, విత్తన మొలక శాతం,పంట యాజమాన్య పద్ధతుల గురించి వివరించినారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. వెంకట్రావు ఆ గ్రామాల వ్యవసాయ సహాయకులు రామాంజనేయులు, కమల, విన్ని బాబు మరియు ఆ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పక్కా గృహములు మంజూరు

### - పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న గొట్టిపాటి లక్ష్మి



**దొనకొండ,నవంబర్ 12,ప్రభాతవార్త**
దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ గ్రా అనగా రేపు ఉదయం 11.00 గంటలకు దర్శి మండలం, కొత్తపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం క్రింద " పక్కా గృహములు మంజూరు " ఉత్తర్వుల పత్రముల పంపిణీ కార్యక్రమం లో పాల్గొంటారు. కావున దర్శి నియోజకవర్గం లోని అన్ని మండలాల !! పట్టణాల టిడిపి అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్స్/యూనిట్/బూత్ ఇంచార్జిలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన వలసినదిగా కోరుచున్నాము. ఇట్లు...తెలుగుదేశం పార్టీ కార్యాలయం, దర్శి నియోజకవర్గం.

## వైఎస్సార్ సీపీకి వైస్ ఎంపీపీ వెంకటేశ్వర రెడ్డి రాజీనామా



**తాళ్లూరు, నవంబర్ 12,ప్రభాత వార్త**
వైస్ ఎంపీపీ ఐ వెంకటేశ్వర రెడ్డి వైఎస్సార్ సీపీ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం అయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు వైఎస్సార్ సీపీ పార్టీ మా కుటుంబానికి అండగా ఉండి, రెండు సార్లు వైస్ ఎంపీపీ పదవిని ఇచ్చారన్నారు. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదు రెడ్డి పార్టీ కోసం కష్టపడి పని చేసిన తన లాంటి వారిని ఆయన గుర్తించక పోవడం, పార్టీ లో కూడా ప్రాధాన్యత, సరైన ఆదరణ లేకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

### అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన మున్సిపల్ కమీషనర్ ఈవి రమణ



**గిద్దలూరు, నవంబరు 12, ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలోగల అన్న క్యాంటీన్‌ను నగర పంచాయితీ కమీషనర్ ఈవి రమణబాబు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం అందించే విషయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్న క్యాంటీన్ సిబ్బందికి సూచించారు. అనంతరం అన్న క్యాంటీన్‌లో ప్రజలకు అందిస్తున్న భోజనంను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయితీ సిబ్బంది, అన్న క్యాంటీన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి

#### - కొమరోలులో కోటిసంతకాల సేకరణ కార్యక్రమంలో వైసిపి ఇన్చార్జి నాగార్జున రెడ్డి

**కొమరోలు, నవంబరు 12 ,ప్రభాతవార్త**
మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విధానాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలి గిద్దలూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెపి నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైఎస్సార్సీపి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కొమరోలులో బుధవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరోలులోని తహశిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మార్కాపురం మాజీ శాసనసభ్యులు, వైఎస్సార్సీపి ఇంచార్జి కెపి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విధానం పట్ల రాష్ట్రంలో పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ జాయింట్ సెక్రటరీ, అసెంబ్లీ పరిశీలకులు కెవి రమణ రెడ్డి జెడ్పిటిసిలు సారె వెంకట నాయుడు, పగడాల శ్రీరంగం, బండ్లమూడి వెంకట రాజయ్య, ఎంపిపిలు మేడూరి వెంకట రావు, వేగినాటి ఓసురా రెడ్డి, కన్వీనర్లు మానం బాలి రెడ్డి, ఏరువా రంగా రెడ్డి, ఆవుల శ్రీధర్ రెడ్డి, యాళం మురళి కృష్ణ, మేరీగ రవికుమార్, బత్తేం ఓబుళ రావు, సీనియర్ నాయకులు నాగేళ్ల వెంగయ్య చౌదరి, రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ సభ్యులు చెరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగ జిల్లా అధ్యక్షులు నన్నెబోయిన వెంకట రావు, మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

#### కోటిలింగం కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన టీడీపీ నాయకులు దిరిశాల శ్రీనివాసరావు



**ముండ్లమూరు, నవంబర్ 12, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలంలోని వేములబండ గ్రామంలో దార్ల కోటిలింగం అనారోగ్యంతో మృతి చెందగా కోటిలిగం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేసిన టీడీపీ నాయకులు దిరిశాల శ్రీనివాసరావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి కుటుంబానికి అండగా ఉంటామని ఓటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

#### నూతన మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన మాలకొండయ్య



**దర్శి, నవంబర్ 12, ప్రభాతవార్త**
దర్శి మండల నూతన విద్యాశాఖాదికారిగా కే.మాలకొండయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన మండల విద్యాశాఖాధికారిగా నియమితులైన మాలకొండయ్యను అన్ని ఉపాధ్యా సంఘాలు నాయకులు అభినందించారు.

#### తూర్పువెంకటాపురం, లంకోజనపల్లిలో పొలం పాలుస్తోంది

**దర్శి, నవంబర్ 12, ప్రభాతవార్త**
పొలం పిలుస్తోంది కార్యక్రమం తూర్పు వెంకటాపురం లంకోజనపల్లి గ్రామాలలో మండల వ్యవసాయాధికారి నిర్వహించడం జరిగింది. నల్లబర్లీ పొగాకు సాగు చేయకూడదని, చట్ట రీత్యా నేరం అని తెలియజేశారు. బర్లీ పొగాకు సాగు చేసిన గుర్తింపు పొందిన కంపెనీలచే అగ్రిమెంటు తీసుకొని మాత్రమే సాగు చేయాలని, లేకపోతే అమ్మకాల సమయంలో ఇబ్బందులు పడవలసి వస్తుందని తెలియ జేయడం జరిగింది. వరిలో కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు ఉందని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలోవీఏఏలు సుధాకర్, హర్షవర్ధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ప్రభాతవార్త ఫోకస్



ప్రకాశం జిల్లాలోని ఈ వంతెన 2022లో కూలిపోయినా ఇప్పటి వరకు కట్టలేదు. చందవరం, దేశిరెడ్డిపల్లి గ్రామాల్లోని 2500 మంది ప్రజల రాకపోకలకు ఇదే ఆధారం. రోజూ ప్రమాదాన్ని దాటుకొని పనులకు వెళ్తున్నారు.

దొనకొండ - ప్రభాతవార్త

### ఉపాధిహామీ పనుల ప్లానింగ్‌ను పరిశీలించిన ఎంపిడిఓ వెంకటరామిరెడ్డి



**రాచర్ల, నవంబరు 12, ప్రభాతవార్త**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2026-27 ప్లానింగ్ ప్రాసెస్ సంబంధించి పిఆర్ఏ పద్ధతి ద్వారా ప్లానింగ్ చేయుటకు బుధవారం మండలంలోని సత్యవోలు సచివాలయం కేంద్రంలో ఏర్పాటు చేసిన రిసోర్స్ మ్యాప్, సీజనల్ మ్యాప్‌లను ఎంపిడిఓ ఎస్ వెంకట రామిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యవోలు గ్రామపంచాయతీ నందు ఉపాధి హామీ శ్రామికులు, గ్రామస్తులు అందరి సమక్షంలో ఈ యొక్క మ్యాపులు గురించి వివరించి వారందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సత్యవోలు సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## రాచర్లలో కొండచిలువ కలకలం




**రాచర్ల నవంబర్ 12, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన రాచర్ల గ్రామానికి చెందిన బొద్దు వెంకటసుబ్బారెడ్డి అరటి తోటలో బుధవారం కొండచిలువ కలకలం రేపింది. రైతు వెంకట సుబ్బారెడ్డి అరటి తోటలో పనులు చేస్తుండగా కొండచిలువ కనిపించింది. వెంటనే రైతు సుబ్బారెడ్డి అటవిశాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి కొండచిలువను పట్టుకొని సమీప అటవీ ప్రాంతంలోనికి తీసుకువెళ్లి వదిలివేశారు.

### రైతులు కంపెనీ ప్రతినిధుల నుండి అగ్రిమెంట్లు తీసుకోవాలి



**గిద్దలూరు రూరల్, నవంబరు 12, ప్రభాతవార్త**
ప్రస్తుత సంవత్సరం రబీ సీజన్లో రైతులు ఎక్కువగా మొక్కజొన్న (విత్తనోత్పత్తి) వేయడానికి సిద్ధంగా ఉన్నారు కావున రైతులు తప్పనిసరిగా కంపెనీ ప్రతినిధుల నుండి ఒప్పంద పత్రాలు (అగ్రిమెంట్లు) తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్ రెడ్డి సూచించారు.
మండలంలో ముండ్లపాడు, బురుజుపల్లి గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అగ్రిమెంట్లు ఉన్నప్పుడు మాత్రమే తర్వాత ఏదైనా కారణాల వలన దిగుబడి తగ్గినా, క్రాసింగ్ సరిగా జరగకపోయినా, తెగుళ్లు ఎక్కువగా వచ్చిన, ధరలు సరిగా ఇవ్వకపోయినా వారిమీద చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఉద్యాన శాఖధికారిణి డి శ్వేత మాట్లాడుతూ ఇటీవల కురుసిన వర్షాలకు పసుపు పంటలో దుంపకుళ్ళు మరియు ఆకు మచ్చ తెగులు ఎక్కువగా ఆశించింది ఉన్నది కావున దుంపకుళ్ళు నివారణకు మెటలాక్సిల్ లేదా మాంకోజెబ్ 2 మి. లి లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సిద్దయ్య, కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### పేద ప్రజలకు న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి**




**మార్కాపురం, నవంబర్ 12, ప్రభాతవార్త**
రాష్ట్రంలో పేద ప్రజలకు అన్ని విధాలా న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి అన్నారు. మార్కాపురం పట్టణంలోని 15వ వార్డులో బుధవారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంలో భాగంగా పేద కుటుంబాలకు గృహ మంజూరు పత్రాలను పంపిణీ చేసి,ఆయా గృహాలకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజమైన పేదల పక్షపాతి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమని, ప్రజలకు న్యాయం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తికాకుండా ప్రారంభించినందుకు వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు కోటి సంతకాల సేకరణ చేస్తున్నారా? లేక మార్కాపురం జిల్లాకు ఇవ్వకుండా మోసం చేసినందుకా? లేక మార్కాపురం మెడికల్ కాలేజ్ పూర్తి చేసినందుకా కోటి సంతకాల సేకరణ చేస్తున్నారా? అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఇకనైనా వైసీపీ నాయకులు ప్రజలను మోసం చేయడం మానుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు

**- వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ భారీ ప్రజా ఉద్యమ ర్యాలీ**




**మార్కాపురం, నవంబర్ 12, ప్రభాతవార్త**
రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మార్కాపురం నియోజకవర్గ కేంద్రంలో భారీ ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహించడమైనది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు 2019–24 మధ్య ఆయన నాయకత్వంలో ప్రభుత్వం స్థాపించిన కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నిర్ణయించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణంలో నిర్వహించిన ర్యాలీ అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బహిరంగ సభ జరిగింది. కార్యక్రమంలో గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్చార్జి అన్నా రాంబాబు , మార్కాపురం మాజీ శాసనసభ్యులు జంకే వెంకటరెడ్డి పాల్గొన్నారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థను కాపాడాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ ఉద్యమం సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య విద్య, వైద్య సేవలను ప్రైవేట్ చేతుల్లోకి ఇవ్వాలనే చర్యలు ప్రజలకు తీవ్రమైన నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### మాగుంట రాఘవకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కంభంపాటి రమణ



**మార్కాపురం, నవంబర్ 12, ప్రభాతవార్త**
యువనాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాగుంట రాఘవరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మార్కాపురంలోని మానసిక వికలాంగుల పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వెన్నా నాగార్జున రెడ్డి, సూరారెడ్డి కౌశిక్, ఇతర స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ మాగుంట రాఘవరెడ్డి ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఆయన సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తినిస్తాయని తెలిపారు.

## సింగరకొండ ఆలయాన్ని సందర్శించిన

### టీటీడీ దేవస్థానం ఆగమ సలహాదారుడు విజయభాస్కర శాస్త్రి



**అద్దంకి , నవంబరు 12,ప్రభాతవార్త**
బాపట్ల జిల్లా అద్దంకి మండలం సింగలకొండ క్షేత్రంలో కొలువై ఉన్న ఆంజనేయ స్వామి వారి దేవస్థానం నందు రాజగోపురాల నిర్మాణము మరియు ప్రాకారము పునః నిర్మాణం నిమిత్తం స్మార్త ఆగమా సలహాదారుడు, టీటీడీ దేవస్థానం ఆగమ సలహాదారుడు విజయభాస్కర శాస్త్రి దేవస్థానంను సందర్శించి నిర్మాణంలో సలహాలు సూచనలు చేశారు. అదే విధముగా దేవస్థానం గోశాల , కోనేరు నిర్మాణం, మరుగుదొడ్ల వాస్తు ప్రకారం నిర్మాణము చేయుటకు స్థలము సూచించడమైనది. ఈ కార్యక్రమంనకు దేవస్థాన పాలకమండలి చైర్మన్ చుండూరు మురళి సుధాకర్‌రావు, ధర్మకర్తల మండలి సభ్యులు నూతి ప్రసాద్, చంద్రశేఖర్, వెంకటరత్నమ్మ, పద్మజ ,నాగమ్మ, గోపి ,ఆంజనేయులు, సుబ్బారావు,సురేష్‌బాబు,దేవస్థానం వేద పండితులు వంగల హరిశంకరరావుధాని, ఆచార్యులు, శ్రీరామ్ మూర్తి పంతులు హాజరయ్యారు.

## ఎంపిడిఒ కార్యాలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం




**అద్దంకి నవంబర్ 12, ప్రభతవార్త**
అద్దంకి పట్టణంలోని మంగళవారం ఎంపీడీవో కార్యాలయానకి వచ్చిన ఫిర్యాదు, కోర్టు ఆవరణ ముందు అద్దంకి మున్సిపాలిటీకి సంబంధించి పబ్లిక్ టాయిలెట్స్ క్లీనింగ్, వాటర్ సప్లై లేనందున కొందరు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై శానటరీ విభాగా సిబ్బందితో ఎంపీడీవో కార్యాలయం శుభ్రపరభించి క్లీన్ చేశారు. ఈ కార్యక్రమంలో శానటరీ సెక్రటరీ రవి ప్రకాష్,స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సింగరకొండలో అన్నదానానికి 10,116లు వితరణ



**అద్దంకి నవంబర్ 12, ప్రభతవార్త**
బాపట్ల జిల్లా అద్దంకి మండలం సింగరకొండ క్షేత్రంలో కొలువై ఉన్న ఆంజనేయ స్వామి వారి దేవస్థానం బుధవారం చిన్న కొత్తపల్లి వాస్తవ్యులు కొల్లా వెంకటనారాయణమ్మ, ధర్మపత్ని నాగలక్ష్మి ప్రసన్న దంపతులు ప్రతి సంవత్సరం వారు కోరుకున్న రోజున అన్నదానం జరిగేటట్లు సంవత్సరానికి ఒకసారి వారికి నచ్చిన రోజున అన్నదానానికిగాను రు.10116 రూపాయలు విరాళ దేవస్థానం పాలకమండలి సభ్యులు నూతి ప్రసాదు , దూళిపాళ్ల వెంకటరత్నం , నాగమ్మ ద్వారా దేవస్థానానికి అందజేశారు. అనంతరం స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. వేద పండితులు ద్వారా వీరికి ఆశీర్వాదం అందజేశారు.

## కొబ్బరి సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం



**అద్దంకి నవంబర్ 12, ప్రభతవార్త**
కొబ్బరి సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు మండల ఉద్యాన అధికారిణి ఎస్.దీప్తి తెలిపారు. మైలవరం,ఉప్పలపాడు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా ఆమె మాట్లాడుతూ కొబ్బరి తోటల సాగుకు ఒక హెక్టారుకు ప్రభుత్వం 56వేల రూపాయలు రాయితీ అందిస్తుందని, వెదురు సాగుకు ఒక హెక్టారుకు 60 వేల రూపాయలు రాయితీ అందిస్తుందని తెలిపారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని, ఎక్కువ గా వాడకం వలన ప్రజలు జబ్బుల బారిన పడుతున్నారని తెలిపారు. కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ కాలనీలో సామూహిక గృహ ప్రవేశాలు

**- పెద్ద ఎత్తున గృహ నిర్మాణ పత్రాల పంపిణీ**




**అద్దంకి నవంబర్ 12, ప్రభతవార్త**
కూటమి ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సామూహిక గృహప్రవేశాలు, నూతన గృహాల నిర్మాణానికి మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం అద్దంకి పట్టణంలోని రాజీవ్ కాలనీలో పెద్ద ఎత్తున జరిగింది. ఈ సందర్భంగా గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు.అదేవిధంగా 180మందికి నూతన గృహాల నిర్మాణం కొరకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రవీంద్ర, స్వచ్ఛభారత్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, మున్సిపల్ వైఎస్ చైర్మన్ పద్మేష్, క్లష్టర్ ఇన్‌చార్జి కాకాని అశోక్, గార్లపాటి శ్రీనివాసరావు, పూర్ణ,కౌన్సిలర్‌లు కంపారజిని, మాగులూరి తిరుపతమ్మ గోపి, అత్తులూరి రమేష్‌తో పాటు గోపి, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అధునాతన పద్ధతులతో తక్కువ పెట్టుబడులతో

### అధిక ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు - ఏవో డి.సుబ్బారెడ్డి



**పంగులూరు, నవంబర్ 12, ప్రభతవార్త**
మండలంలోని అలవలపాడు జాగర్లమూడి వారి పాలెం గ్రామాలలో రైతు భరోసా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి డి సుబ్బారెడ్డి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ అధునాతన పద్ధతుల పద్ధతులను ఉపయోగించి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని పొందవచ్చునని, పురుగు మందులు ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతుల ద్వారా పంట సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని ఆయన అన్నారు. మొక్కజొన్న పంటలలో విత్తన శుద్ధి చేయడం వల్ల పంటలపై ఆశించు తెలుపు పురుగులు నివారించవచ్చునని, మొక్క ఎదిగే సమయంలో ఇటువంటి చీడాపీడలు ఆశించకుండా ఉండేందుకు విత్తన శుద్ధి చేయడం కీలకం అన్నారు. రెండు గ్రాముల మాంకోజెబ్, నాలుగు గ్రాముల ఈఇమిడా క్లోరోఫిడ్ ఒక లీటర్ నీటిలో కలిపిన ద్రావణంలో విత్తనాలను ఒక గంట సేపు నానబెట్టి తదుపరి నాటుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు చిన్నబాబు గోపి కిరణ్ మరియు ఆ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## వెన్నంపల్లిలో స్వామిత్వ సర్వేపై గ్రామసభ



**కొమరోలు, నవంబరు 12, ప్రభాతవార్త**
మండలంలోని ముక్తాపురం పంచాయతీ లోని వెన్నంపల్లి గ్రామంలో స్వామిత్వ సర్వే పై గ్రామ సభను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సత్యం పాల్గొని మాట్లాడుతూ స్వామిత్వ సర్వే ద్వారా గుర్తించి ప్రత్యేక నెంబర్ ఇస్తున్నామని తెలిపారు.రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకం గా గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామాల్లో స్థల సమస్యలను పరిష్కరించేందుకు స్వామిత్వ సర్వే ను చేపట్టి అర్హులైన లబ్ధిదారులకు స్వామిత్వ కార్డులను జారీ చేయనున్నారని తెలిపారు. ఈ కార్డుల ద్వారా వారికి ఆ స్థలంపై గాని ఆ భవనం పైన కానీ పూర్తి హక్కు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ చెన్నారావు, సర్పంచ్ రమణారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంగంపల్లిలో పొలం పిలుస్తోంది



**రాచర్ల, నవంబర్ 12, ప్రభాతవార్త**
మండలంలోని గంగంపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ తెల్లబర్లి పొగాకు, సీడ్ మొక్కజొన్న సాగుకు సంబంధించి రైతులు విత్తన కంపెనీ వారి నుండి ఒప్పంద పత్రాలు కచ్చితంగా తీసుకొని పంటల సాగు చేయాలని అన్నారు. రైతులు సాగు విషయంలో జాగ్రత్తలు పాటించాలని విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొగాకు నారు, సీడ్ మొక్కజొన్న విత్తనాలకు సంబంధించి రైతులకు ఇచ్చిన వివరాల జాబితాను కంపెనీల యాజమాన్యం గ్రామంలో అందుబాటులో ఉంచాలని,వారికి ఇచ్చిన ఒప్పందపత్రాల సమాచారాన్ని తమశాఖకు తెలియ జేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ గ్రామ సహాయకులు లలిత, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### రైతులు తప్పనిసరిగా పంటలు నమోదు చేయించుకోవాలి



**కొరిశపాడు, నవంబర్ 12, ప్రభతవార్త**
రైతులు తాము సాగు చేస్తున్న పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు బి ఇ ప్రాయం తెలియజేశారు. మండలంలో ని పి గుడిపాడు, కొరశపాడు గ్రామాలలో ఏవో ఎస్ రామ్మోహన్ రెడ్డితో కలిసి ఆయన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ శనగ పంట సాగు చేసే రైతులు ఎండు తెగులు వేరు కుళ్ళు నివారణకు ట్రైకోడెర్మా ఒక కేజీ శనగ విత్తనా లకు 10 గ్రాముల చొప్పున విత్తన శుద్ధి చేసుకుని విత్తినట్లయితే నివారించవచ్చు అన్నారు ఇలా తెగులు నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో వారితో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు కృష్ణారెడ్డి రవికిరణ్ రైతులు పాల్గొన్నారు.

### గృహ నిర్మాణాలను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్




**సంతనూతలపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామంలో బుధవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా పేద వర్గాలకు సంబంధించి 17 నెలల ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో 3,00,192 గృహాలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా కందుల ఆదిలక్ష్మీ గృహానికి సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ ప్రారంభించారు. మంగమూరు ఎస్సీ కాలనీలో కందుల ఆదిలక్ష్మీ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన -2.0 పథకం కింద ఈ గృహాన్ని నిర్మించారు. అయితే ఆదిలక్ష్మీ నూతన గృహప్రవేశ వేడుకలకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ ముఖ్య అతిధిగా విచ్చేసి గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం పేద వర్గాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగపరుచుకోవాలని ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఈ సందర్భంగా కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పేద వర్గాలకు ఈ గృహాల నిర్మాణానికి స్వచ్ఛందంగా ఒక లక్ష 80 వేల రూపాయలను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిప్యూటీ ఇంజనీర్ పి.చెన్న రాయుడు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎన్.మణి ప్రసాద్, ఎంపీడీవో డి.సురేష్‌బాబు, తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, ఎంపీపీ బుడంగుంట విజయ నాగేశ్వరరావు, మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు నల్లూరి నారాయణరావు, ఒంగోలు ఎన్ఎస్పీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు నల్లరి కృష్ణారావు, ఎన్నెస్పీ నీటి సంఘం అధ్యక్షులు అబ్బురి శ్రీను, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుసూదన్‌రావు, పంచాయతీ రాజ్ ఏఈ వీరాంజనేయులు, వెలుగు ఏపీఎం టి.బాబురావు, మండల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాసంతి, ఏవో పావని, పంచాయతీ ఇన్‌చార్జికార్యదర్శి మౌనిక,వీఆర్వో ఎం.మరియకుమార్,మండలటీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కే.గోపికృష్ణ, హౌసింగ్ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, నాగలక్ష్మీ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రాఘవరెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మండల నాయకులు



**టంగుటూరు, నవంబర్ 12, ప్రభాతవార్త**
ఒంగోలులోని ఎంపీ కార్యాలయం వద్ద ఒంగోలు ఎంపీమాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు,యువ నాయకులు యువ పారిశ్రామిక వేత్త అయిన మాగుంట రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మండలంలోని టంగుటూరు,జయవరం, జమ్మలపాలెం నాయకులు అయిన దాసరిసుబ్బారావు, ఎం.కృష్ణారెడ్డి,బాలు,పద్మతోపాటు జమ్మలపాలెం టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్ధులకు ఆటల పోటీలు

**వెలిగండ్ల, నవంబర్ 12, ప్రభాతవార్త**
బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక గ్రంధాలయం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు విద్యార్ధులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు గ్రంధపాలకుడు భాస్కరరావు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు 20వ తేదీ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

### టీడీపీ కార్యాలయంలో మాగుంట రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు



**దర్శి, నవంబర్ 12, ప్రభాతవార్త**
టీడీపీ నాయకులు మాగుంట రాఘవరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా దర్శిలోని టీడీపీ కార్యాలయంలో దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ కేక్ కట్ చేసి రాఘవరెడ్డికి జన్మధిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోలార్ ప్రాజెక్టు భూములపై ఆర్డీవో సమీక్ష



**బల్లికురవ, నవంబర్ 12, ప్రభాతవార్త**
మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో సోలార్ పవర్ ప్రాజెక్టు భూసేకరణ కార్యక్రమం, రైతులకు చెల్లింపులు చివరి దశకు చేరిన తరుణంలో బుధవారం ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బల్లికురవ తహసీల్దార్ రవి నాయక్ సంతమాగులూరు తహసీల్దార్ రవిబాబులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ప్రభుత్వం నిర్ధేశించిన విధంగా రైతులకు నగదు చెల్లింపులు కూడా పూర్తికానున్న నేపధ్యంలో మరో రెండు రోజుల్లో రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ నేపధ్యంలో బల్లికురవ సంతమాగులూరు మండలాల పరిధిలో 850 ఎకరాల విస్తీర్ణంలో కొనసాగనున్న ఈ ప్రాజెక్టు పనుల చివరి దశకు చేరిన నేపధ్యంలో శాఖాపరమైన అడ్డంకులు లేకుండా అధికారులు పనులలో నిమగ్నమయ్యారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక విద్యుత్ ఒగాన్ని బలోపేతం చేయడానికి 160గిగా వాట్ల లక్ష్యంతో గ్రీన్ ఎనర్జీ పాలసీని అమలు చేస్తుంది. ఏపీసీఎస్డీసీ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు కూడా ప్రభుత్వం చేపట్టనుంది. ప్రారంభ దశలో ఉన్న ప్రాజెక్టున్నీ 2029 నాటికి పూర్తి చేయటం లక్ష్యంగా ముందుకు పోతుందని మంత్రి రవికుమార్ గతంలో వెల్లడించిన విషయం తెలిసిందే.ఈ సమావేశంలో సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్రపోలు రమేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష, ఆర్ఐ పోతురాజులు పాల్గొన్నారు.

CLASSIFIED

**బ్యాంక్ చెక్‌బుక్ పోయినది**

బాపట్ల జిల్లా జె.పంగులూరు మం॥ తూర్పుతక్కెళ్ళపాడు గ్రామం ఇంటినెం.2-18 ఎస్.ఎ.టి. లక్ష్మీనారాయణ, తండ్రి ఎస్.ఎ.టి. ఎస్.ఎన్ తాతాచార్యులు గారికి సంబంధించిన S.B.I కి చెందిన 50 చెక్కులు గల చెక్కుబుక్ బ్యాంకు ఖాతా నెం.20165822504, I.F.S.C కోడ్: S.B.I.N0006979, చెక్‌నెంబర్లు 814996 నుండి 815045 (మొత్తం-50) మరియు ఫోటోస్టాట్ కాపీలు, ఇన్సూరెన్స్ కాపీలు పోయినవి దొరికిన వారు సంప్ర. సెల్: 9989914353

8_8.qxd 11/12/2025 11:37 PM Page 1



## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ భారీ ప్రజా ఉద్యమ ర్యాలీ






**కనిగిరి, నవంబర్ 12, ప్రభాతవార్త**
ప్రభుత్వమెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ కనిగిరి నియోజకవర్గం ఆధ్వర్యంలో బుధవారం భారీ ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహించారు. వైసీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ సమన్వయకర్త దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ కనిగిరి పట్టణంలోని ఎన్జీవో హోమ్ నుంచి ప్రారంభమై పామూరు బస్టాండ్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం ఏఓకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న పాల్గొని పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దద్దాల నారాయణ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ పేదలకు తీని నష్టం అని పేర్కొన్నారు. వైఎస్ జగన్ పేద పిల్లలకు వైద్య విద్య అందుబాటులో ఉండేలా 17 మెడికల్ కాలేజీలను స్థాపించారని తెలిపారు. వాటిని పూర్తి చేయకుండా ప్రస్తుత ప్రభుత్వం పీపీపీ ముసుగులో ప్రైవేటు చేతుల్లోకి అప్పగించేందుకు ప్రయత్నించడం ప్రజా వ్యతిరేక చర్య అని అన్నారు. వైద్య విద్య ధనవంతుల ప్రత్యేక హక్కు కాదని, ఇది ప్రజల ప్రాథమిక హక్కు అని, విద్యా ఆరోగ్య రంగాలు వ్యాపారం కావని స్పష్టం చేశారు. ప్రజల హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, చప్పిడి సుబ్బయ్య, ఓకే రెడ్డి, మూడమంచు వెంకటేశ్వర్లు, పాలగుళ్ళ మల్లిఖార్జునరెడ్డి, మేకల శ్రీనివాస్, వైఎం ప్రసాద్‌రెడ్డి, గాయం బలరామిరెడ్డి, యక్కంటి శ్రీనివాసులురెడ్డి, కనిగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, సిరూప గోవర్ధన్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, వైఎం సరిత, తమ్మనేని సుజాత, చింతగుంట్ల సాల్మన్ రాజు, భువనగిరి వెంకటయ్య, కల్లూరి రామిరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, షేక్ రహీం భాష, మూలే మాలకొండారెడ్డి, గూడూరి అబ్రహం లింకన్, గూడూరి అనిల్‌బాబు, పలుకూరి భాస్కర్, శీలం సుదర్శన్, మండాది కృష్ణారెడ్డి, పులి శ్రీనివాసులరెడ్డి, రామనబోయిన శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన తమ్మినేని వెంకటరెడ్డి



**కనిగిరి, నవంబర్ 12, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గ పెద్దచెర్లోపల్లి మండలం గుంటూరు లింగన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడును తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకులను పలకరిస్తూ ఉత్సాహపరిచారు. తమ్మినేని వెంకటరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పథకాలను సమర్ధవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తోందని తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన కనిగిరి టీడీపీ నేతలు



**కనిగిరి, నవంబర్ 12, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెద్దచెర్లపల్లి మండలం గుంటూరు లింగన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కనిగిరి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు బజాజ్ ఓబుల్‌రెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, మాలకొండా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకులను పలకరిస్తూ ఉత్సాహపరిచారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పథకాలను సమర్ధవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తోందని తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

## అక్రమ ఇసుక వ్యాపారుల దౌర్జన్యం

## పెట్రోలుతో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం



**యర్రగొండపాలెం, నవంబరు 12, ప్రభాతవార్త**
అక్రమ ఇసుక దంపుదారుల దౌర్జన్యానికి ఓ లారీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం జరిగింది. లారీ డ్రైవర్‌కు అండగా ఉండవలసిన పోలీసులు లారీ డ్రైవర్ పై కేసు నమోదు అయినట్లు అతని లారీని స్టేషనుకు తరలించడంతో మనస్తాపానికి గురైన లారీడ్రైవర్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన యర్రగొండపాలెం పట్టణంలో బుధవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మూడురోజుల క్రితం అమరావతినుండి లారీలో ఇసుక లోడు యర్రగొండపాలెం దించేందుకు తీసుకురావడంతో ఇక్కడి ఇసుక దంపుల్లకు చెందిన కొందరు లారీని అడ్డగించి ఇసుకను తమదంపుల్లో దించాలని కనుక్కోవడంతో టన్నుకు రూ.250 తమకు చెల్లించాలని చెప్పడంతో ఆగ్రహించిన లారీ డ్రైవర తన లారీలో తెచ్చుకున్న ఇసుకకు తమకెందుకు డబ్బులు చెల్లించాలంటూ నిలదీయడంతో ఇసుక దంపుకు చెందిన ముఠామనుషులు దౌర్జన్యానికి పాల్పడి పోలీసుల ద్వారా అతని లారీని స్టేషనుకు తరలించారు. మైనింగుకు చెందిన వారు లారీపై కేసునమోదు చేశారని అతని లారీని విడిపించాలంటే రూ.50వేల జరిమానా చెల్లించాలని పోలీసులు తెలపడంతో బయపడి పోయిన లారీడ్రైవరు తాను జరిమానా చెల్లించే స్తోమత లేదని తెలిపారు. అయినా పోలీసులు ససేమిరా అంటు లారీని వదలక పోవడంతో వారం రోజులుగా లారీ బాడుగలు నిలిచి పోయాయి. దీంతో లారీకి సంబంధించిన కంతులు ఆగిపోవడంతో తీవ్ర మన స్తాపానికి గురైందని లారీడ్రైవర్ నిరసిస్తూ పెట్రోల్ పోసుకొని చనిపోయేందుకు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద హల్‌చల్ చేశాడు. విషయం తెలుసుకున్న సిఐ అతన్ని వారించి స్టేషనుకు తరలించారు.

## వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

**- బేస్తవారిపేటలో కోటిసంతకాల కార్యక్రమంలో ఇన్చార్జి కెపి నాగార్జున రెడ్డి**



**బేస్తవారిపేట, నవంబరు 12, ప్రభాతవార్త**
మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేస్తుందని గిద్దలూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి, మార్కాపురం శాసనసభ్యులు కెపి నాగార్జున రెడ్డి అన్నారు. బేస్తవారిపేట పట్టణంలో మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను నిరసిస్తూ వైయస్ జగన్ మోహన్ రెడ్డి నిర్దేశించిన పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైసిపి సెక్రటరీ, నియోజకవర్గ పరిశీలకులు బీసి రమణ రెడ్డి, నాయకులు ఎంపిపి వేగినాటి ఓసూరా రెడ్డి, జెడ్పిటిసి బండ్లమూడి వెంకట రాజయ్య, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యం మేరకే అనుకున్న టైంలో వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తాం

**- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

**- వైసీపీ నాయకులకు పనిపాట లేదు కోటి సంతకాలు అని రోడ్లపై పడ్డారు**

**- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**







**మార్కాపురం, నవంబరు 12, ప్రభాతవార్త**
వెలిగొండ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. బుధవారం పెద్దదోర్నాల మండలంలోని కొత్తూరు గ్రామ సమీపంలో ప్రాజెక్టు పనులను, ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ఫీడర్ కెనాల్ ప్రాంతాలను ఆయనపరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుమల అశోక్ రెడ్డి, ఎర్రగొండపాలెం టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. అనంతరం ప్రాజెక్టు అధికారులతో, కాంట్రాక్టర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. మార్కాపురం జిల్లాను త్వరలోనే ప్రకటిస్తామని, మెడికల్ కాలేజీని పీపీపీ మోడ్‌లో పూర్తి చేస్తామని తెలిపారు. వైసీపీ నాయకులకు పనీపాట లేక కోటి సంతకాల సేకరణ అంటూ రోడ్లపై పడ్డారని అన్నారు. వారం రోజుల వ్యవధిలోనే రెండోసారి వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించిన మా మంత్రి నిమ్మల రామానాయుడు మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న ఫీడర్ కెనాల్ గండ్లు, జంట సొరంగాల్లో డీవాటరింగ్ పనులను ఇరిగేషన్ నిపుణుల బృందంతో పరిశీలించటం జరిగిందని అది మా ప్రభుత్వం చిత్తశుద్ధి అని తెలిపారు. ఫీడర్ కెనాల్ గండి పూడిక పనులు, టన్నెల్ డీవాటరింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారన్నారు. డీవాటరింగ్ పనులు ఆలస్యమవ్వడం పట్ల అధికారులపై, ఏజెన్సీ పై ఆగ్రహం వ్యక్తం చేశారని.ప్రభుత్వానికి మాత్రమే కాదు, ఏజెన్సీలకు, అధికారులకు కూడా ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యం ఉండాలని హెచ్చరించారు. 2026 కల్లా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలనే చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా నిరంతర పర్యవేక్షణ చేస్తాను" అని అన్నారు. వెంటనే టన్నెల్స్‌లో లైనింగ్, బెంచింగ్ పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రూ.456 కోట్ల వ్యయంతో చేపట్టే ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను ఈనెలలోనే ప్రారంభించి, వచ్చే సీజన్‌కు పూర్తి చేయాలని సూచించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రకాశం జిల్లా రైతుల సాగు, తాగు నీటి సమస్యలను పరిష్కరిస్తాం" అని మంత్రి నిమ్మలస్పష్టం చేశారు.

## పేదల సొంత ఇంటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి**



**గిద్దలూరు, నవంబరు 12 ,ప్రభాతవార్త**
పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు.గిద్దలూరు నగర పంచాయితీ పరిధిలోని రాజానగర్, ఎన్టీఆర్ కాలనీలో కాకర్ల లక్ష్మిదేవి నూతనంగా నిర్మించుకున్న ఎన్టీఆర్ గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణ మంజూరు పత్రాలు అందజేయడం సంతోషకరమన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో 7190 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ గృహాలు మంజూరు అయ్యాయని, గిద్దలూరు పట్టణంలో 114 మందికి మంజూరు అయ్యాయన్నారు. గృహాలు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందచేశారు. ప్రతీ ఒక్కరూ ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. రానున్న మూడున్నర ఏళ్లలో రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి కూటమి ప్రభుత్వం ఇల్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్తున్నారని తెలిపారు. వైసిపి పాలనలో పేదల ఇంటి కలను నిర్వీర్యం చేశారని, 4.73 లక్షల ఇల్లు రద్దుచేసి పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. 2.73 లక్షల మంది పేద లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకుంటే నాటి వైసిపి ప్రభుత్వం బిల్లులు చెల్లించక ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీల నోట్లో మట్టి కొట్టారని దుయ్యబట్టారు. పేదలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ మరోవైపు అభివృద్ధిలో ముందుకు వెళ్తుందని, నివేశిత స్థలం లేని లబ్ధిదారులకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ప్రభుత్వం ఇస్తుందని అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, హోసింగ్ డీఈ ఖధీర్ బాషా, పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశా వలి, టీడీపీ నాయకులు దప్పిలి కాశిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్ మరియు పట్టణ కౌన్సిలర్లు లోక్కు రమేష్, బిల్లా రమేష్, పట్టణ నాయకులు, అధికార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దర్శిలో భారీ ర్యాలీ

**- పాల్గొన్న దర్శి ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ**



**దర్శి, నవంబర్ 12, ప్రభతవార్త**
మెడికల్ కాలేజీలా ప్రైవేటీకరణకు వ్యతిఏకంగా బుధవారంబూచేపల్లి ఆధ్వర్యంలో దర్శిలోని పొదిలి రోడ్డులో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి సెంటర్లో ఎమ్మార్వో కార్యాలయం వరకు వైసీపీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రానికి ముఖ్య అతిధిగా దర్శి ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు పాల్గొని మాట్లాడుతూ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో విద్యార్థులు, యువకులు మహిళలు ప్రజలు రాజకీయ పార్టీలతో కలిసి ఈ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం దర్శి గడియారస్తంభం సెంటర్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దర్శి ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ ప్రధానంగా గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్‌కాలేజీలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించి పేద విద్యార్థులకు మెడికల్ విద్యను అందించాలని దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ఒదలు పెట్టారని ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం కక్షపూరితంగా జగన్ ప్రారంభించిన మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు దోచిపెట్టడానికి పూనుకొని మధ్య తరగతి ప్రజలకు విద్యను వైద్యాన్ని దూరం చేయాలని కుట్ర చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వెన్నపూస వెంకటరెడనఇడ, తూము వెంకట సుబ్బారెడ్డి, చింత శ్రీనివాసరెడ్డి, సుంకర బ్రాహ్మనందరెడ్డి, బొరిగల ఉషారాణి, ఎన్నాబత్తుల సుబ్బయ్య, నుసుం నాగిరెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డి, పోశం మధుసూదన్‌రెడ్డి, గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, షేక్ సైదా, జి.దేవ ప్రసాద్, కొల్లా భాస్కర్, సోము దుర్గాఎడ్డి, బంక నాగిరెడ్డి, సూదిదేవర అంజయ్య, కేవీ రెడ్డి, కేసరి రాంబూపాల్ మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరు బాబురావు, వేమిరెడ్డి చెన్నారెడ్డి, నల్లదిమ్ము రమణారెడ్డి, గోను వెంగల్ రెడ్డి, కసుకుర్తి వెంకటరావు, కొడవటి జాన్, మేడగం రమణారెడ్డి, పనేం మజ్నువలి, కుంట అచ్చారావు, పాలెపోగు డగ్లస్, దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పక్కా గృహాల మంజూరు ఉత్తర్వుల భూమి పూజ

**- కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ**



**దర్శి, నవంబర్ 12, ప్రభాతవార్త**
దర్శి మండలం, కొత్తపల్లి గ్రామంలో బుధవారం 54 మంది ఇంటి యజామానులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రధానమంత్రి ఆవాస్ యోజన-2.0 పథకం క్రింద పక్కా గృహాలు మంజూరు ఉత్తర్వుల పత్రముల పంపిణీ, భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, స్థానిక నాయకులు అధికారులు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించే లక్ష్యంగా ప్రతి ఒక్కరికి ఇంటి కల నెరవేర్చాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమానికి మన ప్రభుత్వంశ్రీకారం చుట్టిందన్నారు. ప్రజల కోసం పని చేసే ప్రజల అవసరాలు తీర్చే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరంతరం ఆంధ్ర రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే లక్ష్యంగా పడుతున్న కష్టం చూస్తున్నాం, అదే స్ఫూర్తితో దర్శి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా మార్చుకుందాం అభివృద్ధి ఎజెండగా ముందుకు వెళ్దాం ,ప్రజలందరూ కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలి, అభిమానించాలని వైసీపీ కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, హౌసింగ్ ఏఈ షాకీర్ భాషా, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టరన తాండవ కొండలు, పంచాయతీ సెక్రటరీ ఝాన్సీ రాణి, వీఆర్వో దుర్గా ప్రసాద్, దర్శి మండల పార్టీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు తిండి నారాయణరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు రాచపూడి పేతురు, నీటి సంఘం అధ్యక్షులు వెంకట రామిరెడ్డి, గొర్రె సుబ్బారెడ్డి, గోవిందరెడ్డి, దర్శి టీడీపీ అధ్యక్షులు చిన్న, కొత్తపల్లి గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అద్దంకిలో వైసిపి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

**- పాల్గొన్న శ్యామల, ఎంఎల్‌సి మాధవరావు**

**- వైఎస్ఆర్, అంబేద్కర్ విగ్రహాలకు నివాళి**

**- ర్యాలీకి తరలివచ్చిన వైసిపి క్యాడర్**








**అద్దంకి నవంబర్ 12, ప్రభతవార్త**
రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ పిలుపు మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రవేటికరణను వ్యతిరేకిస్తూ బుధవారం చేపట్టిన నిరసన ర్యాలీ అద్దంకిలో పెద్ద ఎత్తున జరిగింది. ఈ ర్యాలీలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల, బాపట్ల జిల్లా పార్లమెంటు పార్టీ పరిశీలకులు ఎంఎల్‌సి తుమాటి మాధవరావులు పాల్గొన్నారు. అద్దంకి పట్టణంతోపాటు రూరల్, సంతమాగులూరు, బల్లికురవ, జె.పంగులూరు, కొరిశపాడు మండలాలనుండి పార్టీ క్యాడర్ పెద్ద ఎత్తున ఈ ర్యాలీకి తరలివచ్చింది. ర్యాలీ అగ్రభాగంలో శ్యామల, మాధవరావుతోపాటు పార్టీలోని నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, మండల, గ్రామ స్థాయి నేతలు కదంతొక్కారు. భవానీ సెంటర్‌నుండి ప్రారంభమైన ర్యాలీ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌లకు పూలమాలవేసి నివాళులర్పించారు. భవానీ సెంటర్‌నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో పెద్దఎత్తున మహిళా నేతలు, మహిళా కార్యకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## జాతీయ భావాన్ని రేకెత్తించిన 'మేరీ మిట్టి మేరీ దేశ్'



**వేటపాలెం, నవంబర్ 12, ప్రభాతవార్త**
23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ(చీరాల) వారి ఆధ్వర్యంలో 'మేరీ మిట్టి మేరా దేశ్' కార్యక్రమాన్ని స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజీ నందు బుధవారం నాడు నిర్వహించారు. కాలేజీ నుండి వేటపాలెం సెంటర్ ప్రధాన కూడిలి వరకు ర్యాలీ నిర్వహించిన కేడెట్స్ మానవహారంగా ఏర్పడి దేశభక్తిని ప్రబోధిస్తూ భరత మాతకు జేజేలు పలుకుతూ ప్రజలలో జాతీయతా భావాన్ని, సమైక్యతను, దేశభక్తిని రేకెత్తించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ గంగాధర్ మాట్లాడుతూ సమకాలీన సమాజంలో ప్రజలందరూ ఒక్కటే అనే భావన పెంపొందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 150 సంవత్సరాల వందేమాతర గీత వసంతోత్సవాలలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ(చీరాల) సుబేదార్ భళ్బీర్ సింగ్, హవల్దార్ నారాయణ,జన,హవల్దారు టిల్ కుమార్, కళాశాల, హైస్కూల్ ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

## చీరాల ఏపీ మోడల్ కళాశాల విద్యార్థినుల రోడ్డుపై నిరసన

**- అధిక ఫీజులు వసూళ్లు - అధ్వాన్న హాస్టల్ నిర్వహణపై విద్యార్థినుల ఆగ్రహం**

**- వంట మాస్టర్లు లేని హాస్టల్‌లో విద్యార్థినులే వంట చేసుకుంటున్న దుస్థితి**

**- రెండు గంటల నిరసన తర్వాత అధికారుల బుజ్జగింపుతో శాంతించిన విద్యార్థినులు**

**- సెలవుపై వెళ్లిన ప్రిన్సిపాల్‌న గైర్హాజరుతో విద్యార్థినుల సమస్యలు మరింత పెరిగిన పరిస్థితి**




**చీరాల టౌన్, నవంబర్ 12, ప్రభాతవార్త**
చీరాల పట్టణంలోని ఏపీ మోడల్ కళాశాలలో విద్యార్థినులు బుధవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల ముందు రోడ్డుపై బైటాయిస్తూ రెండు గంటల పాటు నిరసన చేపట్టారు. విద్యార్థినులు మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ అధిక ఫీజులు వసూళ్లు చేస్తుండడంతో పాటు హాస్టల్ నిర్వహణ అత్యంత అధ్వాన్నంగా మారిందని ఆరోపించారు. హాస్టల్‌లో వంట మాస్టర్లు లేక విద్యార్థినులే స్వయంగా వంట చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు సరైన భోజనం అందక, ప్రాథమిక సౌకర్యాలు కూడా లేక విద్యార్థినుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులు రోడ్డుపైకి వచ్చి నినాదాలు చేస్తూ కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు గంటల పాటు సాగిన ఈ నిరసనను అధికారులు, పోలీసులు బుజ్జగించే ప్రయత్నం చేశారు. కాగా, ప్రిన్సిపాల్ సెలవుపై వెళ్ళడం వల్ల సమస్య పరిష్కారం ఆలస్యమై విద్యార్థినులు ఆగ్రహం మరింత పెరిగింది. చివరికి అధికారుల హామీతో విద్యార్థినులు నిరసనను విరమించారు. విద్యార్థినీల సమస్యపై జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి అవినీతి అధికారులపై చర్య తీసుకుని విద్యార్థులకు మంచి భవిష్యత్తుని అందించాలని వారు కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ దగ్గుబాటి రాంబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ టీడీపీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**వేటపాలెం, నవంబర్ 12, ప్రభాతవార్త**
మండల పరిధిలో గల టీడీపీ క్యాంపు కార్యాలయం నందు నూతన కార్యవర్గాన్ని చీరాలఎమ్మెల్యే మాలకొండయ్య నియమించారు. పట్టణ,మండల క్లస్టర్ యూనిట్, గ్రామ బూత్ కమిటీ సభ్యులతో సహా 1400 మందితో ప్రమాణ స్వీకారం చేయించిన మద్దులూరి నూతన టీడీపీ అధ్యక్షుడిగా దోగిపర్తి వెంకట సురేష్, వేపాలెం మండల అధ్యక్షులుగా గుత్తి సీతారామాంజనేయులు, చీరాల మండల అధ్యక్షులుగా గంజి పురుషోత్తం, నియోజకవర్గ అనుబంధ కమిటీలు, క్లస్టర్ ఇన్‌చార్జెస్, బూత్ ఇంచార్జెస్, యూనిట్ ఇంచార్జెస్, వేటపాలెం చీరాల పట్టణ/ గ్రామ వార్డు పార్టీ అధ్యక్షులును నియామకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ఆశయాలకు పవిత్ర లక్ష్యాలకు కట్టుబడి ఉంటూ పార్టీ సభ్యునిగా క్రమశిక్షణతో ప్రజా సేవ భావంతో మనసా వాచా కర్మణా నిరంతరం పాటుపడుతూ పార్టీకి ఉజ్వల భవిష్యత్తు కల్పించేందుకై తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యే కార్యవర్గాన్ని కోరారు.

## జగన్‌తో రాజీవ్



**నాగులుప్పలపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చుండు రవిబాబు రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్ ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కార్యక్రమాల్లో యువత ఆకర్షితులు అవుతున్నట్లు ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రైతులతో భారీ వర్షాలతో పడుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించినట్లు రాజీవ్ ఎలిపారు.

## ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**- కళాజాత ప్రదర్శన**



**నాగులుప్పలపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**
ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం ద్వారా మేలు జరుగుతుందని ఉప్పుగుంటూరు పీడీసీసీ బ్యాంకు సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఉప్పుగుండూరు పీడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలుపై నా బార్డు వారి సౌజన్యంతో ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా కళాజాత.వీధి నాటిక కార్యక్రమం వి.సత్యకృష్ణ కళాజాత,తాడేపల్లిగూడెం బృందం,వారిచే ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రధాన కూడలి అయిన బస్టాండ్ సెంటర్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ ఎస్.శ్రీకాంత్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. నగదు రహిత లావాదేవీలు, వ్యవసాయ రుణాలు బంగారు ఆభరణాలపై రుణాలు గృహ రుణాలు, వ్యాపార రుణాల డ్వాక్రా రుణాలు, సహకార సమైక్య, లాకర్ సదుపాయం ఫిక్స్ డిపాజిట్లు, ధన వృద్ధి డిపాజిట్ స్కీమ్ సహకార బ్యాంకు అకౌంట్స్, సైబర్ క్రైమ్, భీమా పథకాలు, బ్యాంకు వారు అందించే అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదే విధంగా రైతులకు, మహిళలకు ప్రజలకు అర్థమయ్యే రీతిలో వీధి నాటిక కళాజాత ప్రదర్శన కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, రైతులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

13-11Pg5 9_13-11Pg5.qxd 12/Nov/25 10:11 PM Page 1



# ఢిల్లీలో తీవ్రస్థాయికి వాయుకాలుష్యం



**న్యూఢిల్లీ, నవంబరు 12:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయిలోనే కొనసాగుతోంది. వరుసగా మూడో రోజు బుధవారం కూడా గాలి నాణ్యత సూచీ (ఎక్యూఐ) 400 పైన తీవ్ర కేటగిరీలోనే నమోదైంది. నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో చాలా ప్రాంతాల్లో దృశ్యవీక్షణం గణనీయంగా పడిపోయింది. దీంతో ప్రజలు స్వచ్ఛమైన గాలి కోసం అల్లాడిపోతున్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి విడుదల చేసిన డేటా ప్రకారం బుధవారం ఉదయం గీతా కాలనీలక్ష్మీ నగర్ రోడ్ ప్రాంతంలో గాలి నాణ్యత సూచీ 413గా నమోదైంది. ఇండియా గేట్, కర్తవ్య పథ్ పరిసరాలను సైతం విషపూరిత పొగమంచు కప్పేయగా, అక్కడ ఎక్యూఐ 408గా ఉంది. నగరంలోని ఇతర ప్రాంతాలైన ఆనంద్‌విహార్‌లో 438, అశోక్‌విహార్‌లో 439, చాందినీ చౌక్‌లో 449, ద్వారకా సెక్టార్8లో 422, ఐటీఓలో 433, జహంగీర్‌పురిలో 446, ఆర్‌కే పురంలో 432, రోహిణిలో 442గా గాలి నాణ్యత నమోదైంది. ఇంతటి కాలుష్యానికి ఎక్కువసేపు గురైతే తీవ్రమైన శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గాలి నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 3 చర్యలను అమలు చేయడంలో భాగంగా 5వ తరగతి వరకు విద్యార్థులకు బుధవారం నుంచి హైబ్రిడ్ విధానంలో తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది. జీఆర్‌ఏపీ ఫేజ్3 కింద భద్రతా చర్యలు వేగంగా అమలు చేస్తున్నాం. బుధవారం నుంచి 5వ తరగతి వరకు క్లాసులు ఆన్‌లైన్‌లో జరుగుతాయి. పాఠశాలల్లో హైబ్రిడ్ విధానం అమల్లో ఉంటుందని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా తెలిపారు. ఈ మేరకు ఢిల్లీ విద్యాశాఖ ఒక సర్క్యులర్ జారీ చేసింది. విద్యాశాఖ, ఎన్‌డీఎంసీ, ఎంసీడీ, ఢిల్లీ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు తక్షణమే 5వ తరగతి వరకు విద్యార్థులకు హైబ్రిడ్ (ఫిజికల్, ఆన్‌లైన్) విధానంలో తరగతులు నిర్వహించాలి. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఈ విధానం కొనసాగుతుంది" అని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఈ కొత్త ఏర్పాట్ల గురించి తల్లిదండ్రులకు వెంటనే తెలియజేయాలని పాఠశాలల యాజమాన్యాలను విద్యాశాఖ డైరెక్టర్ వేదితా రెడ్డి ఆదేశించారు. కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ మంగళవారం ఢిల్లీఎన్‌సీఆర్‌లోని పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలుష్య నియంత్రణకు తీసుకున్న చర్యలపై వివరణాత్మక నివేదికలు సమర్పించాలని ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులనుఆదేశించారు.

# ఎన్నికల్లో అన్ని పార్టీలను ప్రభావితంచేసిన 'జన్‌సురాజ్'



**పాట్నా, నవంబరు 12:** ఎన్నికల వ్యూహకర్తగా దేశవ్యాప్తంగా పేరొందిన ప్రశాంత్ కిశోర్ రాజకీయ పార్టీ పెట్టి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి రాజకీయ పార్టీలనుప్రభావితంచేసారు. సీట్లు రాకపోవచ్చన ఎగ్జిట్‌పోల్ అంచనాల్లో వెల్లడి అయితే గణనీయంగా ఓట్లను మాత్రం చీల్చిందని తేలింది. ఇది మహాఘట్‌బంధన్‌కే నష్టం కలిగించినట్లు నిపుణల అంచనా. జన్ సురాజ్ తరఫున పలువురు అభ్యర్థులను బరిలోకి దించారు. ఎగ్జిట్ పోల్స్ లో జన్ సురాజ్ పార్టీ గరిష్ఠంగా ఐదు సీట్లు గెల్చుకోవచ్చని అంచనా వేశాయి. అయితే, సీట్ల విషయం పక్కన పెడితే ఈ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ భారీగా ప్రభావం చూపిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సింగిల్ సీటు గెల్చుకోకున్నా సరే జన్ సురాజ్ పార్టీ పలు సీట్లలో అభ్యర్థుల తలరాతను మార్చేసిందని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ ఖాతా తెరిచే పరిస్థితే లేదు కానీ ఓట్ షేర్ లో మాత్రం ఆ పార్టీ ప్రభావం భారీగా పడిందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను, ఎన్డీయే కూటమి వ్యతిరేక ఓట్లను జన్ సురాజ్ పార్టీ చీల్చిందని రాజకీయ విశ్లేషకులు తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడం వల్ల ప్రతిపక్ష మహాగఠ్ బంధన్ కూటమి తీవ్రంగా నష్టపోయిందని పేర్కొన్నారు. దీనివల్ల అంతిమంగా అధికార ఎన్డీయే కూటమికే ప్రయోజనం కలిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీ ప్రభావం ఎలా ఉండబోతోందనే దానిపై ప్రశాంత్ కిశోర్ కూడా పలు సందర్భాల్లో వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు మీడియా సంస్థలతో మాట్లాడుతూ 'అయితే ఆకాశాన్ని అందుకుంటాం, లేదంటే పాతాళానికి పడిపోతాం' అని పేర్కొన్నారు. ఏదేమైనా సరే తమ పార్టీ పొత్తులకు వ్యతిరేకమని, ఫలితాల్లో కింగ్ మేకర్ గా అవతరించినా సరే తాము ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ప్రశాంత్ కిశోర్ స్పష్టం చేశారు.



# పేలుడుకు పదిరోజుల ముందే ఐ20 కారు కొనుగోలు

**న్యూఢిల్లీ, నవంబరు 12:** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలిన ఐ20 కారును డాక్టర్ ఉమర్ నబీ పేలుడుకు పది రోజుల ముందు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. అక్టోబర్ 29న కారును కొనుగోలు చేసిన వెంటనే కాలుష్య నియంత్రణ ధృవపత్రాన్ని తీసుకున్నాడు. ఆ తర్వాత ఉమర్ నబీ అండర్ గ్రౌండ్‌కు వెళ్లిపోగా, కారు ఎక్కడ ఉందో కచ్చితంగా తెలియడం లేదు. ఈ కారు పేలుడుకు ముందు పది రోజులుగా అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయం వద్ద ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్నప్పటికీ, పోలీసులు మాత్రం అక్కడ లేదని చెబుతున్నారు. కాలుష్య నియంత్రణ ధృవీకరణ పత్రం తీసుకునే సమయంలో ముగ్గురు వ్యక్తులు కారు నుంచి బయటకు వచ్చారు. వారు ఎవరు అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మరోవైపు, గత కొన్ని రోజులుగా పోలీసులు తన సహచరులను వరుసగా అదుపులోకి తీసుకుంటుండటంతో ఆందోళనకు గురైన ఉమర్ నబీ నవంబర్ 10న కారును తీసుకుని ఢిల్లీ వైపు వెళ్లినట్లు దర్యాప్తుతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. ఉమర్ నబీ కారును కొనుగోలు చేసినప్పటికీ యజమానిగా సల్మాన్ పేరు ఉంది. దీంతో పోలీసులు గురుగ్రామ్‌లో అతనిని అదుపులోకి తీసుకున్నారు.

2014 మార్చి 18న సల్మాన్ పేరిట ఈ కారును కొనుగోలు చేశారు. ఆ తర్వాత కారును దేవేంద్ర అనే వ్యక్తికి అమ్మేశాడు. ఆ తర్వాత సోనూ అనే వ్యక్తి చేతికి చేరిన కారు, అనంతరం పుల్వామాకు చెందిన తారిఖ్ వద్దకు చేరింది. ఈ వాహనం పలు మార్లు చేతులు మారినప్పటికీ యాజమాన్య బదిలీకి సంబంధించి ప్రభుత్వం వద్ద ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేవు.



# దేశంలో ఉగ్ర కుట్రలకు రెండేళ్లు కష్టపడ్డాం

**న్యూఢిల్లీ, నవంబరు 12:** దేశంలో ఉగ్రవాద కుట్రలకు పాల్పడేందుకు డాక్టర్లు, నిపుణులతో ఏర్పడిన వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ వెనుక ఉన్న లోతైన కుట్రలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌లో భాగస్వామి అయిన డాక్టర్ షహీన్‌ను అధికారులు విచారించగా ఆమె విస్తుపోయే విషయాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా కుట్రల కోసం తాము రెండేళ్లుగా కష్టపడుతున్నట్లు వివరించింది. డాక్టర్ షహీన్ విచారణలో వెల్లడించిన ప్రకారం పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ జైషే మహమ్మద్ కోసం దాదాపు రెండేళ్ల నుంచి దేశవ్యాప్తంగా పలుచోట్ల ఉగ్రదాడులు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మాడ్యూల్‌లో కీలక వ్యక్తి అయిన ఉమర్ ప్రతిసారీ బహుళ ఉగ్ర దాడులు చేయడం గురించి ఉద్రేకంగా మాట్లాడేవాడని షాహీన్ తెలిపినట్లు సమాచారం. డాక్టర్ షహీన్ డాక్టర్ ముజమ్మిల్, ఆదిల్‌తో కలిసి రెండేళ్లుగా అమ్మోనియం నైట్రేట్ వంటి ప్రమాదకరమైన పేలుడు పదార్థాలను సేకరిస్తున్నట్లు అంగీక

## ఇంటరాగేషన్‌లో డాక్టర్ షాహీన్

రించింది. ఈ సేకరించిన పేలుడు పదార్థాలను ఉపయోగించేందుకు జైషే సంస్థ కోసం దేశ వ్యాప్తంగా దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆమె బయటపెట్టింది. ఈ మాడ్యూల్‌తో తన సోదరుడు పర్వేజ్ సయీద్‌కు కూడా భాగస్వామ్యం ఉందని షహీన్ పేర్కొనడంతో జమ్మూ కాశ్మీర్ పోలీసులు వెంటనే అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అయినప్పటికీ పర్వేజ్ వద్ద ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో అరెస్ట్ అవుతాననే భయంతో వాటిని దాచి ఉంచొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే దర్యాప్తు అధికారులు గురుగ్రామ్‌కు చెందిన అమ్మోనియం నైట్రేట్ సరఫరాదారుడిని గుర్తించినట్లు సమాచారం. త్వరలోనే అతడిని కూడా అరెస్టు చేస్తామని అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు డాక్టర్ షహీన్‌ను అధికారులు తదుపరి విచారణ కోసం శ్రీనగర్‌కు తరలించారు. ఈ అరెస్ట్ వెనుక జైషే మహమ్మద్ విస్తృత నెట్‌వర్క్ ఉన్నట్లు అధికారులు బలమైన అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వం వహిస్తున్న జమాత్ ఉల్ మొమినాత్ అనే విభాగంలో షహీన్ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో మహిళా విభాగాలు స్థాపించి వారిని ఉగ్ర కార్యకలాపాలకు నియామకాలు చేపట్టడం వంటి పనులను షాహీన్ నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడి అయింది. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు తీవ్రతను, దాని ప్రభావాన్ని పరిశీలిస్తే అందులో మిలిటరీ గ్రేడ్ పేలుడు పదార్థాలు ఉపయోగించినట్లు దర్యాప్తు వర్గాలు బలంగా అనుమానిస్తున్నాయి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తదుపరి విచారణలో తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

# ప్రజాస్వామ్యపునరుద్ధరణ జరిగితేనే తిరిగి వస్తా!

## బంగ్లాదేశ్‌కు షేక్ హసీనా అల్టిమేటమ్



**న్యూఢిల్లీ, నవంబరు 12:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా స్వదేశానికి రావాలంటే ఒక షరతును విధించారు భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా. అది బంగ్లాదేశ్ భాగస్వామ్య ప్రజాస్వామ్యం పునరుద్ధరణ జరిగితేనే తిరిగి వస్తానని తేల్చి చెప్పారు. బంగ్లాలో అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఎత్తివేత, స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికల నిర్వహణపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. మీడియా సంస్థకు ఇచ్చిన ఈ మెయిల్ ఇంటర్వ్యూలో షేక్ హసీనా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న తాత్కాలిక ప్రభుత్వం, బంగ్లాదేశ్‌కు భారత్‌తో ఉన్న సంబంధాలను ప్రమాదంలో పడేస్తోందని అన్నారు. మా ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో బలమైన సంబంధాలు కొనసాగించాం. యూనస్ తన మూర్ఖత్వంతో వాటిని బలహీనపరుస్తున్నారు. కష్ట సమయంలో నాకు ఆశ్రయం కల్పించినందుకు మోడీ ప్రభుత్వానికి, భారత ప్రజలకు కృతజ్ఞతలు. నేను అధికారంలో ఉన్న సమయంలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనలను పరిష్కరించడంలో మా ప్రభుత్వం విఫలమయ్యింది. అటువంటి భయంకరమైన ఘటనల నుంచి పాఠాలు నేర్చుకున్నా. కానీ ఆ సమయంలో విద్యార్థి నాయకులు కూడా బాధ్యత తీసుకొని ఉండాల్సిందని షేక్ హసీనా తెలిపారు. ఇక యూనస్ తాత్కాలిక ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను హసీనా ఖండించారు. అవన్నీ రాజకీయంగా నన్ను బలహీనపరచడానికే చేసిన కుట్రలు. వచ్చే ఫిబ్రవరిలో జరగబోయే ఎన్నికలను బహిష్కరించమని నేను పిలుపు ఇవ్వలేదు. అవామీ లీగ్‌ను మినహాయించి ఏ ఎన్నిక జరిగినా దానికి చట్టబద్ధత ఉండదు. కోట్లాది మంది మాకు మద్దతు ఇస్తున్నారు. దేశానికి ప్రజల అనుమతి ఆధారంగా నడిచే ప్రభుత్వం అవసరం. ఈ నిషేధాన్ని తొలగిస్తారని నేను ఆశిస్తున్నా. నాకు, అవామీ లీగ్‌కు వ్యతిరేకంగా యూనస్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. ప్రజాస్వామ్యానికి గౌరవం లేకుండా, మరణదండన బెదిరింపులతో ప్రతిపక్షాన్ని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారు. నేను అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు పర్యవేక్షణలో విచారణకు సిద్ధంగా ఉన్నా. యూనస్ నిజంగా నా మీద ఆధారాలు ఉన్నాయని భావిస్తే, ఐసీసీలో కేసు వేయాలి. కానీ ఐసీసీ నన్ను నిర్దోషిగా విడుదల చేస్తుందని యూనస్‌కు తెలుసు. అందుకే ఆయన ఈ సవాలును స్వీకరించడంలేదు అని షేక్ హసీనా ఆరోపించారు. భారత్ ఎల్లప్పుడూ బంగ్లాదేశ్‌కు అత్యంత ముఖ్యమైన అంతర్జాతీయ మిత్రదేశమని షేక్ హసీనా తెలిపారు. కానీ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం భారత్‌తో ఉన్న సంబంధాలను ప్రమాదంలోకి పడేస్తోందని అన్నారు.

# ఉల్లి కిలో రూ.1

## కన్నీరు తెప్పిస్తున్న ధర

## పొలంలోనే పంట ధ్వంసం

## మధ్యప్రదేశ్‌లో రైతుల ఆందోళన



**భోపాల్, నవంబరు 12:** దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు పతనమయ్యాయి. మధ్యప్రదేశ్‌లో అయితే ఉల్లి ధరలు అకస్మాత్తుగా భారీగా పడిపోయాయి. మధ్యప్రదేశ్‌లోని ప్రధాన వ్యవసాయ మార్కెట్లలో ఉల్లి ధరలు అనూహ్యంగా పడిపోయాయి. దీంతో పంట సాగు, కోత, రవాణా ఖర్చులను కూడా రైతులు సంపాదించలేక తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. గత కొన్నిరోజులుగా ఉల్లిధర బాగా పడిపోతుండగా.. తాజాగా మాండ్‌సార్‌లో కిలో ఉల్లి కేవలం ఒకే ఒక్క రూపాయి పలకడం గమనార్హం. కొన్ని మార్కెట్లలో ఉల్లి ధర కిలోకు రూ.2, రూ.3 వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కేవలం రూపాయి, రెండు రూపాయలకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఉల్లి పంట పండించిన రైతులు లబోదిబోమంటున్నారు. పంట పెట్టుబడి ఖర్చులు కాదు కదా రవాణా ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు. దీంతో కొందరు రైతులు ఉల్లిని పొలాల్లోనే ధ్వంసం చేస్తున్నారు. రత్లాం వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ కమిటీలో కనీస ధర క్వింటాల్‌కు రూ.200 వద్ద రికార్డయింది. అంటే కిలో రూ.2 మాత్రమే పలికింది. ఇక సగటు ధర క్వింటాల్‌కు రూ.600గా పలుకుతోంది. ఇక ఉల్లి పంటను పండించేందుకు.. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు రైతులు పెట్టుబడి పెడుతున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరలకు తాము పెట్టిన కనీస ఖర్చులను కూడా రాబట్టలేకపోతున్నామని రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. దీంతో మధ్యప్రదేశ్‌లో అధికంగా ఉల్లి పంట పండించే మాల్వా ప్రాంతంలోని రైతులు..


తమ జీవనోపాధిని కాపాడుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. తమకు ఉల్లి, వెల్లుల్లి పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ని అమలు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్థికమంత్రి సంతకం ఫోర్జరీతో అరెస్టు వారంట్!

## డిజిటల్ అరెస్టు పేరుతో ఎల్ఐసి మాజీ అధికారికి రూ.99 లక్షలు టోకరా

**న్యూఢిల్లీ, నవంబరు 12:** సైబర్ నేరస్థులు రోజురోజుకూ తెలివిమీరిపోతున్నారు. సరికొత్త ఎత్తులతో ఉన్నత విద్యావంతులనూ మోసం చేస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో మరో కొత్త వ్యూహంతో మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా పుణేకు చెందిన ఓ వృద్ధురాలిని డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి రూ.99 లక్షలు కాజేశారు. ఇందుకోసం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఓ అరెస్ట్ వారెంట్ ను సృష్టించారు. దీంతో ఉన్నతవిద్యావంతురాలు, ఎల్ఐసీ మాజీ ఉన్నతాధికారి అయిన ఆ వృద్ధురాలు నమ్మి మోసపోయారు. పుణే పోలీసులు వివరాల ప్రకారం పుణేకు చెందిన 62 ఏళ్ల మహిళ ఎల్ఐసీలో ఉన్నతోద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. ఇటీవల ఆమెకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఆమె ఆధార్ కార్డ్ తో లింక్ అయిన ఓ ఫోన్ నెంబర్ తో దుండగులు ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని అవతలి వ్యక్తి బెదిరింపులకు గురిచేశాడు. ఈ విషయంపై సీనియర్ ఆఫీసర్ వీడియో కాల్ లో మాట్లాడతారంటూ ఫోన్ పెట్టేశాడు. కాసేపటి తర్వాత సీనియర్ పోలీస్ ఆఫీసర్ జార్జ్ మాథ్యూ పేరుతో మరో దుండగుడు వాట్సాప్ వీడియో కాల్ చేశాడు. ఆమె ఆధార్ కార్డ్ తో లింక్ అయిన ఫోన్ నెంబర్ తో ఆర్థిక మోసాలు జరిగాయని, ఈ కారణంగా మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేశామని చెప్పాడు. ఇందుకు సంబంధించి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సంతకంతో జారీ అయిన ఓ నకిలీ అరెస్ట్ వారెంట్ ను వాట్సాప్ చేశాడు. మనీలాండరింగ్ కేసు కావడంతో దర్యాప్తు కోసం బ్యాంకులో ఉన్న నగదు మొత్తం తాము సూచించిన ఖాతాకు బదిలీ చేయాలని, ఆర్బీఐ తనిఖీ తర్వాత ఆ మొత్తం తిరిగి ఆమె ఖాతాలో జమ అవుతుందని నమ్మబలికాడు. నిధులు బదిలీ చేయకుంటే జైలుకు వెళ్లాల్సి వస్తుందని బెదిరించడంతో భయాందోళనకు గురైన బాధితురాలు దుండగుడు చెప్పిన బ్యాంకు ఖాతాలకు రూ.99 లక్షలు బదిలీ చేసింది. ఆ తర్వాత దుండగుడికి ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించింది. పుణే సైబర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# రూ.58 కోట్ల డిజిటల్ అరెస్టు స్కామ్‌లో విదేశీ నెట్‌వర్క్!



**ముంబయి, నవంబరు 12:** ముంబయిలో సంచలనం రేపిన రూ.58 కోట్ల డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లో అంతర్జాతీయ సంబంధాలున్నట్టు మహారాష్ట్ర సైబర్ పోలీసులు గుర్తించారు. హాంకాంగ్, చైనా, ఇండోనేషియాలో లావాదేవీలు జరిగినట్టు కనుగొన్నారు. ముంబయికి చెందిన 72 ఏళ్ల వ్యాపారవేత్తను సైబర్ కేటుగాళ్లు ఈడీ, సీబీఐ అధికారులమని డిజిటల్ అరెస్ట్ పేరుతో బోల్తా కొట్టించి కోట్లు కాజేశారు. ఓ నేరంలో నిందితుడిగా ఉన్నారని, విచారణకు సహకరించాలని డిమాండ్ చేస్తూ ఆయన బ్యాంకు ఖాతాలో నగదును ఊడ్చేశారు. ఆయనను గంటలకొద్దీ వీడియో కాల్‌లో ఉంచి, బెదిరించి, మానసికంగా ప్రభావితం చేస్తూ డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి తీసుకొచ్చారు. కాల్ ముగిసే సరికి, అతడి ఖాతా నుంచి రూ.58 కోట్లు బదిలీ చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన మహారాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు... ఆయన వద్ద కాజేసిన మొత్తాన్ని క్రిప్టోకరెన్సీ లావాదేవీలతో దేశం వెలుపలి ఖాతాలకు బదిలీ చేశారని దర్యాప్తులో గుర్తించారు. దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం ఈ వ్యవహారంలో ఒక్కరు కాదు గత ఏడాది నుంచీ దేశవ్యాప్తంగా ప్రజలను మోసం చేస్తున్న ఒక అంతర్జాతీయ సైబర్ మోసగాళ్ల సిండికేట్‌లో భాగం. ఈ కేసు దాదాపు రూ.2,000 కోట్లు విలువైన భారీ ఆన్‌లైన్ మోసాలతో ముడిపడి ఉన్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు.

ఈ మొత్తం వ్యవహారాన్ని కమిషన్ కోసం బ్యాంకు ఖాతాలు నడిపిన ఒక గ్యాంగ్ నిర్వహించింది. సాధారణంగా తమ సహచరుల నియంత్రణలో ఉండే అకౌంట్‌లను నగదు సేకరణ కేంద్రాలుగా ఉపయోగించినట్టు పేర్కొన్నారు. ప్రతి డిజిటల్ అరెస్ట్ కేసులో బాధితుడ్ని ఆన్‌లైన్‌లో చెల్లించాలని కోరేవారు. తొలుత అది భారతీయ బ్యాంకు ఖాతాలకు చేరి, వెంటనే క్రిప్టోకరెన్సీగా మార్చి విదేశీ వాలెట్లకు తరలించేవారు. దీంతో మోసగాళ్ల డబ్బును దేశం బయటకు తక్షణమే తరలించే అవకాశం కలిగింది.

ఈ నెట్‌వర్క్ దాదాపు ఏడాది నుంచి చురుకుగా పనిచేస్తోంది. ప్రతి లావాదేవీ అనంతరం క్రిప్టోను అనేక వాలెట్లకు తరలించడం వల్ల డబ్బు జాడను తెలుసుకోవడం చాలా కష్టంగా మారుతున్నదని అధికారులు తెలిపారు. దర్యాప్తులో ఇప్పటివరకు బయటపడిన ఐపి అడ్రస్‌లు, ఎక్స్ఛేంజ్ వివరాలలో చాలా వరకు చైనా, హాంకాంగ్, ఇండోనేషియాతో సంబంధమున్నట్లు తేలింది. ఈ కేసులో పలు బ్యాంకు ఖాతాలు, డిజిటల్ వాలెట్లను సైబర్ పోలీసులు గుర్తించారు.

# సంక్షిప్తంగా..

## కుప్పకూలిన టర్కీ విమానం - 20 మంది దుర్మరణం



**అంకారా, నవంబరు 12:** అజర్‌బైజాన్ నుంచి స్వదేశానికి తిరిగి వస్తున్న టర్కీకు చెందిన సైనిక కార్గో విమానం మంగళవారం అర్ధ రాత్రి తూర్పు జార్జియాలో కుప్పకూలంది. ఈ ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న సిబ్బంది సహా 20 మంది మరణించినట్లు టర్కీ రక్షణ మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. టర్కీ రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, "అజర్‌బైజాన్ నుంచి బయలుదేరిన సీ130 సైనిక కార్గో విమానం జార్జియా- అజర్‌బైజాన్ సరిహద్దు సమీపంలో కూలిపోయింది. విమాన సిబ్బందితో కలిపి మొత్తం 20 మంది ఈ విమానంలో ఉన్నారు" అని తెలిపింది. ప్రమాదానికి ముందు విమానం గాల్లోనే గింగిరాలు కొడుతూ వేగంగా నేల వైపు దూసుకొచ్చి, భూమిని ఢీకొట్టగానే మంటల్లో చిక్కుకున్న దృశ్యాలు అజర్‌బైజాన్ మీడియాలో ప్రసారమయ్యాయి.

## సరిహద్దులకు 10 కి.మీ.పరిధిలో ఉండొద్దు:యుకె ట్రావెల్ అడ్వైజరీ



**న్యూఢిల్లీ, నవంబర్ 12:** ఢిల్లీలో పేలుడుతో దేశ ప్రజలు ఉలిక్కి పడ్డారు. ఈ నేపథ్యంలో పలు దేశాలు ట్రావెల్ అడ్వైజరీలు జారీ చేస్తున్నాయి. భారత్, పాకిస్థాన్ సరిహద్దుకు 10 కిలోమీటర్ల పరిధిలో ఉండవద్దని యుకె తన పౌరులను హెచ్చరించింది. అలాగే జమ్ముకశ్మీర్‌లో కొన్ని ప్రాంతాల్లో పర్యటించవద్దని సూచించింది. అక్కడ ప్రముఖ ప్రాంతాలైన శ్రీనగర్, పహల్గామ్, గుల్‌మార్గ్, సోన్‌మార్గ్‌లో పర్యటించేటప్పుడు స్థానిక అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని అప్రమత్తం చేసింది. జమ్మూ నుంచి మాత్రం విమానంలో రాకపోకలు చేయొచ్చని పేర్కొంది. అటారీ - వాఘా సరిహద్దు మూసివేసి ఉందని, అక్కడికి వెళ్లవద్దని సూచించింది. ఈ అడ్వైజరీకి విరుద్ధంగా వ్యవహరిస్తే ట్రావెల్ ఇన్సూరెన్స్ కూడా పనిచేయకపోవచ్చని హెచ్చరించింది.

## ఆసుపత్రి నుంచి ధర్మేంద్ర డిశ్చార్జి.. ఇంటివద్దనే చికిత్స



**ముంబయి, నవంబరు 12:** బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర (89) ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కారణంగా గత నెల 31న ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆయన, బుధవారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ఆయనకు ఇంట్లోనే చికిత్స కొనసాగుతుందని వైద్యులు తెలిపారు. బుధవారం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో ధర్మేంద్రను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు ఆయనకు చికిత్స అందించిన డాక్టర్ ప్రతిత్ సందానీ వెల్లడించారు. కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు ఆయనకు ఇంట్లోనే వైద్య సేవలు కొనసాగిస్తామని వివరించారు. ఇదిలా ఉండగా, నిన్న ధర్మేంద్ర మరణించారంటూ పలు వెబ్ సైట్లలో తప్పుడు వార్తలు ప్రచారమయ్యాయి. ఈ వదంతులపై ఆయన కుటుంబ సభ్యులు తీవ్రంగా స్పందించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, కోలుకుంటున్నారని స్పష్టం చేశారు.

## జిపిఎస్ స్పూఫింగ్‌పై డిజిసిఎ తక్షణ ఆదేశాలు

**న్యూఢిల్లీ,నవంబరు 12:** విమానయాన రంగంలో జీపీఎస్ స్పూఫింగ్ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అప్రమత్తమైంది. జీపీఎస్‌కు సంబంధించి ఏదైనా అసాధారణ సమస్య తలెత్తితే, సంబంధిత విభాగానికి కేవలం 10 నిమిషాల్లోగా తెలియజేయాలని విమానయాన సంస్థలు, పైలట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు (ఏటీసీ) కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో (ఐజీఐఏ) ఇటీవల జీపీఎస్ స్పూఫింగ్ కారణంగా రెండు రోజుల పాటు వందలాది విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీజీసీఏ ఈ కఠిన చర్యలకు ఉపక్రమించింది.

## ప్రధాని మోడీ డిగ్రీ వివాదం - ఢిల్లీ వర్సిటీకి 3 వారాలు గడువిచ్చిన హైకోర్టు

**న్యూఢిల్లీ, నవంబరు 12:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ డిగ్రీ వివాదానికి సంబంధించి వివరాలు అందజేయడానికి ఇంకెంత కాలం కావాలంటూ ఢిల్లీ యూనివర్సిటీ తీరుపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. తక్షణమే ప్రధాని మోడీ డిగ్రీ వివరాలను వెల్లడించే అంశంలో ఫైలింగ్ అయిన అభ్యర్థనలకు స్పందించాలని హైకోర్టు పేర్కొన్నది. అయితే ఈ కేసులో తన అభ్యంతరాలను దాఖలు చేసేందుకు ఢిల్లీ యూనివర్సిటీకి మూడు వారాల సమయాన్ని ఇచ్చింది. ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ దేవేందర్ కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావులతో కూడిన ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది.

## బుల్లెట్‌పై కలెక్టర్, ఎస్పీ తిరుగుతూ

### సత్యసాయి ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన



శ్రీ సత్యసాయి జిల్లా, నవంబరు 12, ప్రభాతవార్త ప్రతినిధి: ఒకరేమో జిల్లా పరిపాలన యంత్రాంగానికి రథసారథి, మరొకరు శాంతి భద్రతలను పరిరక్షించే రథసారథి.. ఈ ఇరువురు భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవ ఏర్పాట్లలో "బుల్లెట్ స్పీడ్" పెంచారు. రాష్ట్ర మంత్రుల కమిటీ పర్యవేక్షించిన నేపథ్యంలో అధికార యంత్రాంగానికి కొత్త జోష్ నింపాలన్న సంకల్పంతో బుల్లెట్ బండి ఎక్కి వినూత్న పర్యటనతో ఆకట్టుకున్నారు. జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్‌లు బుధవారం భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడమే లక్ష్యంగా, తమ హోదాలను ప్రక్కన పెట్టి ఒకే బుల్లెట్ ద్విచక్ర వాహనంపై ఇరువురు పుట్టపర్తిలో గల్లీ గల్లీ తిరుగుతూ విస్తృతంగా పర్యటించి ఏర్పాట్లపై జరుగుతున్న అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా రాష్ట్రపతి ప్రధానమంత్రి ముఖ్యమంత్రి లతోపాటు ఎంతోమంది దేశ విదేశాల నుండి ప్రముఖులు విచ్చేస్తుండడం, లక్షలాదిమంది భక్తులు రానున్న దృష్ట్యా పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేపట్టారు. రెండు రోజుల క్రితం దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బాంబ్ బ్లాస్ట్ దృష్ట్యా భద్రత ఏర్పాట్లపై ప్రత్యేక నిఘాను ఉంచారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా గట్టి భద్రత చర్యలు తీసుకుంటున్నారు. పుట్టపర్తిలోని పెట్రోల్ బంక్ వద్ద నుండి మొదలుపెట్టి, పరేడ్ గ్రౌండ్ దారిలో ఎడమవైపు పార్కింగ్ ఏరియా, పోలీస్ పరేడ్ గ్రౌండ్, సౌత్ గేట్ వద్ద చింత తోపు, చిన్నపల్లి స్కూల్ వద్ద పార్కింగ్ ఏరియాలలో చేస్తున్న ఏర్పాట్లను, భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియంలో జరుగుతున్న పనులను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించి వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, మహేష్, ఆర్టీఓ కరుణసాగర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ క్రాంతి, పబ్లిక్ హెల్త్ డిఈ నరసింహ, డిపిఒ సమత, తహసీల్దార్ కళ్యాణ్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ పటేల్ మహోన్నతుడు

విజయవాడ, నవంబరు 12, ప్రభాతవార్త ప్రతినిధి: సర్దార్ వల్లభాయ్ పటేల్ మహోన్నతుడని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం "సర్దార్ 150 యూనిటీ మార్చ్" ర్యాలీలో మైలవరం శాసనసభ్యులు పాల్గొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ సమైక్య దినోత్సవం)లో భాగంగా ర్యాలిని లక్కిరెడ్డి బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్ నుండి వైయల్ రావు విగ్రహం మైలవరం వరకు పెద్ద ఎత్తున సాగింది. శాసన సభ్యులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు స్వర్ణాక్షరాలతో లిఖించవలసిన అన్నారు. వల్లభాయ్ పటేల్‌ను ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా కీర్తించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎ.రాజేంద్రప్రసాద్, మై భారత జిల్లా యువ అధికారి సుంకర రాము, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, డా. లక్కిరెడ్డి హనిమిరెడ్డి, ఎల్బీఆర్‌సి ట్రస్ట్ బోర్డ్ మెంబర్, జిల్లా యువజన సంక్షేమ శాఖ మేనేజర్ సుబ్బారావు, కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శివకాలిప్రసాద్, బిజెపి నాయకులు కొల్లి రాజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పిఒలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



## స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి సమ్మిళిత, సుస్థిర ఆర్థిక వృద్ధి ముఖ్యం

విజయవాడ, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి సమ్మిళిత, సుస్థిర ఆర్థిక వృద్ధి ముఖ్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఈ ప్రగతికి పర్యాటక రంగ అభివృద్ధి చోదక శక్తి అని.. జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో కృషిచేస్తున్నట్లు వివరించారు. ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పొందుతున్న 20 మంది ట్రెయినీ ఐఏఎస్ అధికారులు ఫీల్డ్ స్టడీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రామ్ కింద జిల్లాలో పర్యటిస్తున్నారు. కలెక్టర్ లక్ష్మీశ బుధవారం ట్రెయినీ ఐఏఎస్ అధికారులతో కలిసి కొండపల్లి ఖిల్లాను ట్రెక్కింగ్ చేశారు. ఖిల్లా చారిత్రక వైభవాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్ (ఏపీఏఏ) ప్రెసిడెంట్ డా. తరుణ్ కాకాని, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఏబీ వెంకటేశ్వరరావు, కృష్ణకిషోర్‌లకు

## సారీ చెప్పిన ప్రవీణ్ ప్రకాష్

విజయవాడ, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ విధి నిర్వహణలో ఉన్నప్పుడు చేసిన కొన్ని పొరపాట్లు పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తాను చేసిన తప్పులకు సారీ చెబుతూ సోషల్ మీడియాలో ప్రవీణ్ ప్రకాష్ ఓ వీడియో విడుదల చేశారు. ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణకిషోర్, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావుకు బహిరంగ క్షమాపణలు చెప్పారు. సర్వీసులో ఉండగా వారివల్ల తాను అనుచితంగా ప్రవర్తించానని, అందుకు చింతిస్తున్నానని వీడియోలో పేర్కొన్నారు. "ఏబీ వెంకటేశ్వరరావు, కృష్ణకిషోర్‌లకు ఫోన్ చేసి సారీ చెప్పాను. కానీ మనిషి సామాజిక జీవి కాబట్టి, పబ్లిక్‌గా కూడా క్షమాపణలు చెబుతున్నాను. మీరు మీ మనసులో నన్ను క్షమించండి" అని భావోద్వేగంగా అన్నారు. ఢిల్లీలోని స్నేహితులు ఈ అపాలజీపై ప్రశ్నించగా, "ఇది నా స్వార్థపరత్వని చర్య కాదు. వారి బాధలను తిరిగి తీసుకురాలేను, కానీ నా మనసు శుభ్రం చేసుకోవాలి. భవిష్యత్తులో 'నా కెరీర్ 2.0'లో ఎథిక్స్, మోరాలిటీ లెన్స్‌తోనే నిర్ణయాలు తీసుకుంటాను" అని సమాధానమిచ్చారు.

# ఈఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భేష్!

### ఆంధ్రా కో ఈఈటీ ఏర్పాటును ప్రశంసించిన బీఈఈ



విజయవాడ, నవంబర్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: విశాఖపట్నంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (కో ఈఈటీ)ను ఏర్పాటు చేసినందుకు రాష్ట్రాన్ని బ్యూరో ఎనర్జీ ఆఫ్ ఎఫిషియన్సీ (బీఈఈ) ప్రశంసించింది. ఇది ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ఒక మైలురాయిగా నిలిచింది. దేశంలో 2070 నాటికి నికర జీరో కార్బన్ ఉద్గారాల తగ్గింపు లక్ష్యంలో ఒక ప్రధాన ప్రోత్సాహకంగా బీఈఈ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎనర్జీ ఎఫిషియెన్సీ (ఈఈ) టెక్నాలజీల అమలును వేగవంతం చేయాలని కోరింది. ఇది దేశ వాతావరణ మరియు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కీలకంగా మారనుంది. అదే సమయంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. ఈ కార్యక్రమాలను అమలు చేయడంలో మిషన్‌మోడ్ విధానాన్ని అవలంబించాలని బీఈఈ అన్ని రాష్ట్రాల ఎస్‌డీఏలను కోరింది. ఈక్రమంలోనే అనేక రాష్ట్రాల చురుకైన విధానాలను బీఈఈ అభినందిస్తూ, విశాఖపట్నంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (కో ఈఈటీ) గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది. పునరుత్పాదక ఇంధన స్వీకరణ, క్లీన్ టెక్నాలజీ ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నాలలో ఒక ముఖ్యమైన మైలురాయిగా బీఈఈ అభివర్ణించింది.

**పెద్ద ఎత్తున పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం**

రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించడమే ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. బీఈఈ, ఈఈఎస్ఎల్, విద్యుత్ మంత్రిత్వ శాఖ సాంకేతిక మరియు ఆర్థిక సహాయానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ ప్రమాణాలతో కూడిన 24/7 విద్యుత్ సరఫరాను అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. తద్వారా రాష్ట్రంలో గణనీయమైన పెట్టుబడులను ఆకర్షించాలని నిశ్చయించుకుందని స్పష్టంచేశారు.

**గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటుకు ఒప్పందం**

సుస్థిర, కాలుష్య రహిత భవిష్యత్తుకు రాష్ట్రం అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అందులో భాగంగా న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (నెడ్‌కాప్) ద్వారా విశాఖపట్నం సమీపంలో అత్యాధునిక గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను ఏర్పాటు చేయడానికి ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్‌జీఈఎల్)తో ఒప్పందం కుదుర్చుకుందని విజయానంద్ వెల్లడించారు. సుమారు రూ.1.85 లక్షల కోట్ల ప్రతిపాదిత పెట్టుబడితో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (కో ఈఈటీ) ఏర్పాటు అనేది దేశ జాతీయ ఇంధన సామర్థ్యం మరియు స్వచ్ఛ ఇంధన పరివర్తన లక్ష్యాలకు సంపూర్ణంగా అనుగుణంగా ఉండే ప్రశంసనీయమైన చొరవ అని బీఈఈ కార్యదర్శి మిలింద్ డియోర్ ప్రశంసించారు. అన్ని రాష్ట్రాల ఎస్‌డీఏలతో సమన్వయంతో ఇంధన సామర్థ్య లక్ష్యాలను సాధించడానికి బీఈఈ సమగ్ర రోడ్‌మ్యాప్‌ను అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఇది వాతావరణ మార్పులను పరిష్కరించడంలో కీలకమైన అంశమని పేర్కొన్నారు. ఇంధన సామర్థ్య పద్ధతులలో వెయ్యి మందికి పైగా నిపుణులు మరియు యుటిలిటీ ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చినందుకు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.




## జిఓ 590 రద్దు చేయాల్సిందే

### మాజీ మంత్రి ఆర్.కె.రోజా డిమాండ్

పుత్తూరు, నవంబరు 12 ప్రభాతవార్త: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైసిపికి చెందిన మాజీ మంత్రి ఆర్.కె.రోజా నేతృత్వంలో బుధవారం పట్టణంలో విష్ణుమహల్ నుంచి వందలాది మంది పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు ధారాధత్తం చేసే జిఓ 590 రద్దు చేసే వరకూ తమ పోరాటం సాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయం వల్ల భవిష్యత్‌లో పేద విద్యార్థులు కోట్లాది రూపాయలు పెట్టి మెడికల్ సీట్లు కొనలేని దుస్థితి ఏర్పడుతుందన్నారు. జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే పేద విద్యార్థుల కోసం 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని తెలిపారు. నాలుగు సార్లు సిఎంగా వున్న చంద్రబాబునాయుడు ఒక్క మెడికల్ కాలేజీ కూడా మంజూరు చేయలేదన్నారు. జగనన్న మంజూరు చేసిన కాలేజీల భవనాల నిర్మాణానికి నిధులు లేవని చెబుతున్నారని అయితే చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ ప్రజల సొమ్ముతో ప్రైవేటు విమానాల్లో తిరగడానికి నిధులు ఎక్కడ నుంచి వచ్చాయని ప్రశ్నించారు. వైద్య విద్యను తన బినామీలకు కట్టబెట్టాలనే దురాలోచనతోనే మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహశీల్దారు వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ర్యాలీలో వైసిపి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్లు డి.జయప్రకాశ్ (చిట్టి), డి.శంకర్, పలువురు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## 14న మీ డబ్బు మీ హక్కు ప్రత్యేక శిబిరం

విజయవాడ, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: "మీ డబ్బుమీ హక్కు నినాదం"తో భారత ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఈ ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోందని జిల్లా ఎల్‌డీఎం కె.ప్రియాంక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మీ డబ్బు మీ హక్కు కార్యక్రమం ద్వారా పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును బ్యాంకులు అర్హులకు తిరిగి ఇచ్చేయడం జరుగుతుందన్నారు. ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు లేదా నామిని వివరాల్లో లోపాలు, మరచిపోవడం వంటి కారణాలతో కొన్ని ఖాతాల్లోని డబ్బు లబ్ధిదారులకు చేరడం లేదన్నారు. ఇలా ఎన్‌టీఆర్ జిల్లాలో మొత్తం 5,50,778 బ్యాంకు ఖాతాల్లో రూ.145.47 కోట్లు ఉన్నట్లు వివరించారు. వీటికి సంబంధించిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు సరైన ధ్రువపత్రాలతో ఈకేవైసీ పూర్తిచేసి తమ సొమ్మును తిరిగి పొందవచ్చన్నారు.

## మస్కట్‌లో ఆముదాలవలస వాసి మృతి



ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా), నవంబరు 12 ప్రభాతవార్త: ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం వెదుళ్లవలస గ్రామానికి చెందిన సవలాపురపు నాగమణి(28) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. తమ కుమార్తె నాగమణి గతంలో నాలుగేళ్లు అక్కడ పనిచేసి డబ్బులు పంపించేదని ఇటీవల ఇంటికి వచ్చి కొంతకాలం ఉండి మళ్లీ పని కోసం వెళ్లి నాలుగు నెలలు అయిందని మృతురాలు తల్లి సరోజిని బుధవారం తెలిపారు. ఒక ఏజెంట్ ద్వారా అక్కడికి పనికి వెళ్లారని చెప్పారు. నాగమణి మూడు రోజుల క్రితం ఫోన్ చేసి తనకు ఇక్కడ చాలా తీవ్ర ఇబ్బంది పెడుతూ, వేధిస్తున్నారు... స్వగ్రామం వచ్చేస్తానని చెప్పిందని, ఇబ్బందిగా ఉంటే వచ్చేమని తాము చెప్పామని వివరించారు. కానీ ఏం జరిగిందో తెలియదు అక్కడ ఏజెంట్ ఫోన్ చేసి మీ అమ్మాయి ఇక్కడ మస్కట్లో ఆత్మహత్య చేసుకుందని చెప్పారని కన్నీరు మున్నీరయ్యారు. ఆత్మహత్య చేసుకున్న ఫోటోలు పెట్టమని అడిగితే వాళ్ళు పెట్టట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుమార్తె నాగమణి మృతి చెందిన విషయాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకువెళ్లి అక్కడ నుంచి తమ కుమార్తె మృతదేహం వచ్చే విధంగా చర్యలు చేపడుతున్నారని తెలిపారని పేర్కొన్నారు. ఈ విషయంలో మాకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుచున్నారు.

### కల్తీ నెయ్యితో వెంకన్న భక్తుల మనోభావాలను

## మంటగలిపిన వైసీపీ ముఠా

### మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



గుంటూరు, నవంబరు 12 ప్రభాత వార్త ప్రతినిధి: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా ప్రసాదంలో కల్తీ జరిగిందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరుగుతున్న సిట్ దర్యాప్తులో కీలక విషయాలు బయట పడ్డాయని ఐదేళ్లలో దాదాపు 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యిని బోలేబాబా ఒర్గానిక్స్, ఏఆర్ శ్రీ వైష్ణవి, మాల్ గంగా డెయిరీల ద్వారా సరఫరా చేసినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. మాజీ ఈవో ధర్మారెడ్డిని సుమారు 10 గంటల పాటు విచారించగా, హైకమాండ్ ఒత్తిడి మేరకే కల్తీ నెయ్యి కొనుగోలు చేశానని అంగీకరించినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయని, అయితే ఆ హైకమాండ్ ఎవరనేది మాత్రం వెల్లడి కాలేదని తెలిపారు. ఈ విషయంలో నాటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, తాడేపల్లి ప్యాలెస్ (జగన్మోహన్ రెడ్డి) అందరూ సిట్ ముందు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. అన్నదానం కార్యక్రమంలో కూడా దుర్మార్గులు రేషన్ బియ్యం, నాణ్యత లేని కూరగాయలు ఉపయోగించి పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. గత ఐదేళ్లలో లడ్డూలు త్వరగా వాసన రావడం, పాడైపోవడం జరిగిందని, భయం భక్తి లేనివారు ఇలా చేశారని విమర్శించారు. దోపిడీ చేసిన వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి సహా అందరిని శిక్షించాలని, వారి ఆస్తులను రికవరీ ఆఫ్ రెవెన్యూ యాక్ట్ కింద స్వాధీనం చేసుకుని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



కోవూరు (నెల్లూరు), నవంబర్ 12, ప్రభాతవార్త: పేదల సొంతి కల నెరవేరడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ రైల్వే ట్రాక్ వద్ద నున్న ఎన్టీఆర్ గృహ నిర్మాణాల లేఅవుట్‌లో నూతనంగా పూర్తి చేసిన పేదల ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ఒక పండుగ వాతావరణంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తో పాటు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 19678 ఇళ్లను బుధవారం ప్రారంభించడం జరిగిందని, ఇందులో భాగంగా ఈ లేఅవుట్‌లో 38 గృహాలు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అదేవిధంగా పీఎంఏవై 2.0 ద్వారా అర్హులైన పేదలందరికీ నూతనంగా ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్, నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష, గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ వెంకటేశ్వర్లు రెడ్డి, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, పెన్నా డెల్టా ఆయకట్టు ఛైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, జెట్టి మదన్‌రెడ్డి, సీహెచ్ పెంచలయ్య, రమేష్ యాదవ్, ఆవుల వాసు, గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి ఏఈ దిలీప్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## పేదలకు సెంటు స్థలమే ఇచ్చి..

## జగన్ మాత్రం ప్యాలెస్‌లో



విజయవాడ, నవంబరు 12 పభాతవార్త ప్రతినిధి: పేదల సొంతింటి కల సాకారమ వుతున్న చారిత్రాత్మక రోజు నేడు అని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. అందరికీ సొంతిల్లు ఉండాలన్న ఎన్టీఆర్ ఆశయాన్ని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని చెప్పారు. సిఎం చంద్రబాబు దూరదృష్టి వల్ల 16 నెలల్లోనే 3 లక్షల ఇళ్ళు పూర్తి చేసి అందిస్తున్నట్లు వివరించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా నిర్మాణంలో జాప్యం లేకుండా పూర్తి చేసినట్లు చెప్పారు. సొంత స్థలం ఉండి ఇళ్ళు నిర్మించుకోలేని వారికి కూడా ఏపీ ప్రభుత్వం సాయం అందచేస్తుందని పేర్కొన్నారు. 2029 నాటికి ప్రతి అర్హుడికి పక్కా ఇల్లు ఇవ్వడం తమ లక్ష్యమని చెప్పారు. పేదలందరికీ ఇళ్ళని చెప్పి సెంటు పట్టా పేరుతో జగన్ భారీ దోపిడీకి తెరలేపారని విమర్శించారు. పేదవాడి ఇంటికి సెంటు స్థలమే ఇచ్చి ఆయన మాత్రం విలాసవంతమైన ప్యాలెస్‌లో సేదతీరారని దుయ్యబట్టారు.

## అసత్యాలతో మాజీ సీఎం రాజకీయం



సచివాలయం, నవంబరు 12 ప్రభాత వార్త: కనీవినీ ఎరుగని రీతిలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వార్షిక ఫీజు సగం సీట్లకు రూ.12లక్షలు, రూ.20 లక్షలుగా నిర్ణయించిన మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి విద్యార్థుల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ కార్యకర్తల్ని రోడ్లపైకి ఉసిగొలు ్పతున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకమార్ యాదవ్ ధ్వజమెత్తారు. కల్తీ మద్యం, కల్తీ నెయ్యి, భారీ అవినీతి ఆరోపణలతో నిండా మునిగిన జగన్‌రెడ్డి తన రాజకీయ ఉనికి కోసం పిపిపి వైద్య కళాశాలలపై దిగజారుడు రాజకీయాలకు పాల ్పడు తున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. సిఎంగా ఉన ్న కాలంలో ఐదేళ్ళూ అసత్య ప్రచారాలతో పబ్బం గడుపుకోవాలని సర్వశక్తులూ ఒడ్డినా... 2024ఎన్నికల్లో ప్రజలు జగన్‌రెడ్డి మాడు పగిలేలా తీర్పిచ్చినా మాజీ సీఎంకు జ్ఞానోదయం కలగలేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. పిపిపి విధానాన్ని ప్రైవేటీకరణగా చిత్రీకరిస్తూ కోటి సంతకాలంటూ నానా యాగీ చేస్తున్నారని ధ్వజమెత్తారు.



## ప్రైవేటీకరణ చేతగానితనానికి నిదర్శనం

పుంగనూరు, నవంబర్ 12 ప్రభాతవార్త: రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం పాలకుల చేతకానితనానికి నిదర్శనమని, చంద్రబాబుకు చేతకాకపోతే తామే మెడికల్ కాలేజీలు నిర్మిస్తామని మాజీ మంత్రి పెద్దిరెడ్డి సవాల్ చేశారు. పుంగనూరులో బుధవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలపై మండిపడ్డారు. మెడికల్ కాలేజీల భూములను వంద రూపాయలకు విక్రయించడం రాష్ట్ర ప్రజలపై చేసిన పెద్ద ద్రోహమని అన్నారు. విలువైన భూముల ద్వారా రాష్ట్రానికి లక్షల కోట్ల ఆదాయం వస్తుందని, పేద విద్యార్థులు డాక్టర్లు అవ్వడానికి అవకాశం ఉంటుందని, దీనిని చంద్రబాబు అడ్డుకొని ప్రైవేటీకరణ చేస్తున్నాడని ఆరోపించారు. ప్రైవేటీకరణ వల్ల పేదలకు లభించాల్సిన 2150 సీట్లు కోల్పోతున్నామని వివరించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నాడు నేడు కార్యక్రమాల కింద వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆసుపత్రులు, పాఠశాలలు అభివృద్ధి చేసిందని గుర్తు చేశారు. 17 మెడికల్ కాలేజీలు వస్తే ప్రతి సంవత్సరం 4500 అదనపు సీట్లు లభిస్తాయని తెలిపారు. పేదలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో జగన్ పని చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలి

విజయవాడ, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: మొంథా తుపానులో నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలని వైసిపి ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్ నాగిరెడ్డి కోరారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ తప్పిదంతోనే రైతులకు పంటల బీమా పరిహారం రాలేదని అన్నారు. ఇన్సూరెన్స్ చేసుంటే ఎంతో కొంత పరిహారం వచ్చేదని తెలిపారు. వైసిపి హయాంలో ఇన్సూరెన్స్ చేయడం వల్ల రూ.99,734 కోట్ల లబ్ధి కలిగిందని పేర్కొన్నారు. ఈక్రాప్ నమోదు చేసుకున్న వారికే తుఫాన్ సహాయం అందించాలనే ప్రభుత్వ నిర్ణయం వల్ల అత్యధిక మంది కౌలుదారులు నష్టపోతున్నారని పేర్కొన్నారు.

## విశాఖ సమ్మిట్‌లో కార్మిక సంక్షేమంపైనా చర్చించాలి

విజయవాడ, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: విశాఖ సిఐఐ సమ్మిట్‌లో ఉపాధి, ఉద్యోగాల కల్పన, కార్మిక సంక్షేమంపైనా ప్రత్యేకంగా చర్చ జరగాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. పెట్టుబడులు సదస్సులో పేరుతో జరిగేవన్నీ ప్రభుత్వం, కార్పొరేట్ల భాగస్వామ్యంగా ఉంటున్నాయి తప్ప ప్రజల భాగస్వామ్యానికి చోటు ఉండటం లేదని అన్నారు. గతంలోనూ అనేక సదస్సులు జరిగాయని, వాటిద్వారా ఉపాధి ఎంత వచ్చిందో బయటపెట్టాలని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం వచ్చే పెట్టుబడులను సిపిఎం ఆహ్వానిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ అమలును నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 16న విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలో కలిసొచ్చే పార్టీలతో పాటు మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, ఈ సమావేశంలో భాగస్వాములవుతారని తెలిపారు.



## పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలి

గుంతకల్లు రైల్వే, నవంబరు 12 ప్రభాతవార్త: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాడుతునే ఉంటామని అఖిల భారత గార్డ్స్ కౌన్సిల్ దక్షి ణ మధ్య రైల్వే జోనల్ కార్యదర్శి రాతేష్ కుమార్ అన్నారు. అఖిల భారత గార్డ్స్ కౌన్సిల్ (ఏఐజీసి) కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం స్థానిక డిఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ట్రైన్ మేనేజర్‌లకు పే లెవెల్‌లలో న్యాయం చేయాలని, 2024 జనవరి నుంచి రన్నింగ్ అలవెన్సు 25 శాతానికి పెంచాలని, ఎంఏసిపిలో న్యాయం చేయాలని, ఖాళీలను భర్తీ చేయాలని, ఎన్‌పిఎస్, యూపిఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు మెమోరాండం పంపారు. కార్యక్రమంలో కౌన్సిల్ డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.థామస్, కెఆర్ బాబు, సలహాదారు ఎన్ఎం బాషా, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యం.ధన్‌రాజ్‌తో పాటు అధికసంఖ్యలో ట్రైన్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

### ప్రత్యేక రైళ్లు జనవరి వరకు పొడిగింపు

తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ ప్రాంతాల మధ్య తిరిగే పలు ప్రత్యేక రైళ్లను ప్రయాణీకుల సౌకర్యార్థం జనవరి వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. కాచిగూడ- మదురై- కాచిగూడ మధ్య తిరిగే నంబర్ 07191/92 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను జనవరి 21 వరకు పొడిగించారు. అలాగే హైదరాబాద్ - కొల్లాం- హైదరాబాద్ మధ్య తిరిగే నంబర్ 07193/94 ఎక్స్‌ప్రెస్‌ను జనవరి 19 వరకు, హైదరాబాద్- కన్యాకుమారి- హైదరాబాద్ మధ్య తిరిగే నంబర్ 07230/29 ఎక్స్‌ప్రెస్‌ను జనవరి 23 వరకు, నర్సాపూర్ - తిరువణ్ణామలై- నర్సాపూర్ మధ్య తిరిగే నంబర్ 07219/20 రైళ్లను జనవరి 22 వరకు పొడిగించామన్నారు.



## కొత్త వాహనాలను కొనుగోలు చేసే వారికి
# శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరు

విజయవాడ, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: కొత్త వాహనాలను కొనుగోలు చేసే వారికి శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరు వెంటనే కేటాయించకుండా రవాణాశాఖ అధికారులు చేస్తున్న జాప్యానికి చెక్ పెట్టేలా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. వారంలో అధికారి శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరు కేటాయించకపోతే, ఆటోమెటిక్‌గా ఆ నంబరు కేటాయింపు జరిగిపోయేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేయనున్నారు. నిబంధనల ప్రకారం కొత్త వాహనం కొనుగోలు చేస్తే వాహన డీలరు షోరూమ్‌లోనే తొలుత తాత్కాలిక రిజిస్ట్రేషన్ నంబరు కేటాయిస్తారు. ఆ తర్వాత వాహన్ పోర్టల్‌కు ఈ వివరాలు వెళ్లగానే రెండు, మూడు రోజుల్లో సంబంధిత రవాణా శాఖ అధికారి ఆ వాహనానికి శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరు కేటాయించాలి. ఒకవేళ వాహనదారు ఫ్యాన్సీ నంబరు పొందాలనుకుంటే మాత్రం నెల రోజుల వరకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ నంబరుతో వాహనం నడపవచ్చు. ఫ్యాన్సీ నంబర్లు అవసరం లేని వాహనాలకు వెంటనే శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరును కేటాయించాలి. కానీ అనేక చోట్ల రవాణాశాఖ అధికారులు నెల నుంచి రెండు నెలల పాటు నంబరు కేటాయించకుండా అక్కడి జాప్యం చేస్తున్నారు. సంబంధిత వాహన డీలర్ తమను కలిసి, వాహనానికి రూ.5001,000 చొప్పున ఇస్తేనే నంబరు కేటాయిస్తామంటూ బేరాలు పెడుతున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నాయి. జీఎస్టీ తగ్గింపు తర్వాత రాష్ట్రంలో వాహనాల అమ్మకాలు పెరగగా, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో పెద్ద ఎత్తున వాహనాల విక్రయాలు జరిగాయి. అయితే అనేక చోట్ల ఇప్పటికీ వాటికి శాశ్వత రిజిస్ట్రేషన్ నంబర్లు కేటాయించకుండా రవాణా అధికారులు సతాయిస్తున్నారు. దీంతో వీరికి చెక్ పెట్టేలా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా తాజాగా లేఖ రాశారు. సంబంధిత అధికారి వారంలోగా నంబరు కేటాయించకపోతే, ఆటోమేటిక్‌గా శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరు వచ్చేలా వాహన్ సాఫ్ట్‌వేర్‌లో వెంటనే మార్పులు చేయాలంటూ సాఫ్ట్‌వేర్ నిర్వాహకులైన నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఎన్ఐసీ) ఉన్నత అధికారులకు లేఖ పంపారు.

# పారదర్శకంగా రెవెన్యూ సేవలు



విజయవాడ, నవంబరు 12 ప్రభాత వార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తోందని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ స్పష్టం చేశారు. అత్యంత పారదర్శకంగా, నిర్దేశ గడువులోగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని, విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. బుధవారం ఆర్డీవోలు, తహసీల్దార్లకు మార్గదర్శకాలు జారీచేశారు. పట్టాదారు పాస్ పుస్తకం, మ్యుటేషన్ సేవలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంలో వివిధ దశలను క్షుణ్ణంగా వివరిస్తూ లిఖిత పూర్వక ఆదేశాలిచ్చారు. గ్రామ సచివాలయం స్థాయిలో డిజిటల్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తుదారుని ఓటీపీ/ బయోమెట్రిక్ ప్రామాణీకరణ ప్రక్రియ దగ్గరి నుంచి తహసీల్దార్ కార్యాలయంలో బయోమెట్రిక్, డిజిటల్ సిగ్నేచర్‌తో తుది ఆమోదం వరకు మొత్తం 30 రోజుల్లో ఏ దశకు ఎన్ని రోజులు కేటాయించడం జరిగిందనే దాన్ని వివరించే ఫ్లో చార్టులను సైతం ఈ ఆదేశాలకు జతచేశారు. దరఖాస్తుదారులకు సరైన సమాచారాన్ని ఇవ్వడంతో పాటు సమస్య పరిష్కారమయ్యే వరకు నిబద్ధతతో సేవలందించాలన్నారు. దరఖాస్తు ప్రక్రియతో పాటు మొత్తం ప్రక్రియపైనా అవగాహన కల్పించాలని, గ్రామ, మండల స్థాయిలో కీలక ప్రదేశాల్లో పట్టాదారు పాస్ పుస్తకం, మ్యుటేషన్ ప్రక్రియ సమాచారాన్ని ప్రదర్శించాలన్నారు. అందుబాటులో ఉన్న ఆన్లైన్ సేవలపైనా అవగాహన పెంపొందించాలన్నారు. క్షతస్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడం జరుగుతుందని, రికార్డులను పరిశీలించనున్నట్లు తెలిపారు. నిర్దిష్ట గడువు (ఎస్ఎల్ఏ)లోగా పారదర్శకంగా, జవాబుదారీతనంతో సమస్యను పరిష్కరించడంలో ఎక్కడైనా అలసత్వం కనిపిస్తే చర్యలు తప్పవని జేసీ ఇలక్కియ స్పష్టం చేశారు. ఎవరైనా ఫిర్యాదు చేయాలనుకుంటే 91549 70454/ 08662 953344 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.




# క్షమించాలని అడిగా
## బెట్టింగ్ యాప్‌ల కేసు విచారణలో నటుడు ప్రకాష్ రాజ్

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: బెట్టింగ్ యాప్‌ల అక్రమాలపై విచారణ చేస్తున్న సిఐడి సిట్ అధికారుల ఎదుట సినీ నటుడు ప్రకాష్ రాజ్ బుధవారం హాజరయ్యారు. సిట్ విచారణకు మంగళవారం మరో నటుడు విజయ్ దేవరకొండ హాజరవడం తెలిసిందే. బుధవారం బహుభాష నటుడు ప్రకాష్ రాజ్‌ను భిన్నకోణాల్లో సిట్ అధికారులు విచారించారు. అయితే విచారణ సందర్భంగా ప్రకాష్ రాజ్ బెట్టింగ్ యాప్‌లకు తాను ప్రమోట్ చేసి పెద్ద తప్పుచేసినట్లు అంగీకరించినట్లు తెలిసింది. 2016లో ఓ బెట్టింగ్ యాప్‌కు ప్రమోషన్ చేశానని, అయితే ఈ యాప్ 2017లో గేమింగ్ యాప్‌గా మారిందని, దీంతో తాను చేసిన ఒప్పందాన్ని రద్దు చేసుకున్నానని ఆయన వెల్లడించినట్లు తెలిసింది. బెట్టింగ్ యాప్‌లను మీలాంటి సెలబ్రిటీలు ప్రమోట్ చేయడంవల్ల అనేక మంది అమాయకులు ఇందులో భారీగా డబ్బులు పెడుతూ నష్టపోతూ చివరకు ఆత్మహత్యలకు పాల్పడిన ఉదంతాలను సిట్ అధికారులు ప్రకాష్ రాజ్‌కు ఉదాహరణలతో సహా వివరించినట్లు తెలిసింది. సమాజంలో ఒక హోదాలో వున్న మీరు ఇలా చేయడం ఎంతవరకు సరైందని సిట్ అధికా రులు ప్రశ్నించినట్లు తెలిసింది. దీనిపై ప్రకాష్‌రాజ్ తాను తప్పు చేసినట్లు అం గీకరించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటివి పునరావృత్తం కాకుండా జాగ్రత్త పడతానని చెప్పినట్లు తెలిసింది. కాగా బెట్టింగ్ యాప్‌లకు ప్రమోట్ చేసిన స మయం నుంచి ఆ తరువాత వరకు తన బ్యాంక్ స్టేట్‌మెంట్లతో పాటు ఇతరత్రా డాక్యుమెంట్లను ఆయన అందజేసినట్లు సమాచారం. కాగా సిట్ వి చారణ తరువాత బయటకు వచ్చిన ప్రకాష్ రాజ్ మీడియాతో మాట్లాడుతూ బెట్టింగ్ యాప్‌లకు తాను ప్రమోట్ చేసి పెద్ద తప్పు చేసినట్లు తెలిపారు. ఇందుకుగానూ అందరిని క్షమాపణ కోరుతున్నానని ఆయన వెల్లడించారు. కాగా సిట్ విచారణ గురువారం కూడా కొనసాగే వీలుందని తెలిసింది. ఈ విచారణకు మరికొందరు సినీ తారలు హాజరయ్యే వీలుంది.

# వేగవంతంగా రూఫ్‌టాప్ సోలార్ అమలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్
- పాఠశాలలు, ప్రభుత్వ రంగ భవనాలపై దృష్టి
- పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనలో కీలకం
- డిస్కమ్‌లు, ఎడిబి అధికారులతో సిఎస్ సమీక్ష



విజయవాడ, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ విద్యుత్ పంపిణి సంస్థలతో పాటు నాబార్డ్-ఏడీబీ (ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్) సహకారం తో రాష్ట్రంలో అమలవుతున్న సోలార్ రూఫ్‌టాప్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఆర్ఐపీ)ను నిర్ణీత సమయానికి సమర్థవంతంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ఏపీ సచివాలయం నుండి డిస్కమ్‌ల సిఎండీలు ఎల్. శివశంకర్ (ఏపీఎస్పీడీసిఎల్), ఐ.పృథ్వీతేజ్ (ఏపీ ఈపీడీసిఎల్), పి.పుల్లారెడ్డి (ఏపీసిపీడీసిఎల్)తో పాటు ఏడీబీ, నాబార్డ్ ప్రతినిధులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థిరమైన, హరిత ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించే లక్ష్యంతో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను వేగంగా ఏర్పాటుచేసేందుకు కట్టుబడి ఉందని, దీనికి ఏడీబీ, నాబార్డ్ ఆర్థిక సహ కారం అందిస్తున్నాయని తెలిపారు. సౌర రూఫ్‌టాప్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఆర్ఐపీ) పురోగతిని సిఎస్ సమీక్షించారు. రూఫ్ టాప్ సోలార్ కార్యక్రమం ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన (పీఎంఎస్జీఎంబీవై) కింద యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ (యుఎల్ఏ) మోడల్ ద్వారా అమలవుతోందని , నాబార్డ్ రాష్ట్ర డిస్కమ్‌లకు సబ్సిడీ రుణం అందించడానికి ఫైనాన్షియల్ ఇంటర్మీడియరీగా నియమించబడినట్లు సిఎస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వ మార్గదర్శకత్వంలో ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో గృహ, సంస్థాగత, ప్రభుత్వ రంగాలలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సాహించడం జరుగుతుందని తెలిపారు. రూఫ్‌టాప్ సోలార్ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనలో కీలక భాగమని, సాంప్రదాయ విద్యుత్‌పై ఆధారాన్ని తగ్గించి వినియోగదారులను స్వతంత్రంగా విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా ఇది దోహదపడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిస్కమ్‌లకు అన్ని విధాల సహకారం అందిస్తుందని, ఏడీబీ, నాబార్డ్ వంటి అభివృద్ధి భాగస్వాములతో కలిసి పనిచేసి దేశంలోనే రూఫ్‌టాప్ సోలార్ అమలులో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెడుతుందని సీఎస్ కె.విజయానంద్ పేర్కొన్నారు.

ప్రభుత్వం కుప్పం నియోజకవర్గాన్ని 100 శాతం రూఫ్ టాప్ సోలార్, నెట్ జీరో నియోజకవర్గంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సిఎస్ కె.విజయానంద్ తెలిపారు. ఈ కార్యక్రమం భాగంగా అన్ని పాఠశాలలు, ప్రభుత్వ సంస్థలు, వ్యవసాయ ఫీడర్లు, ప్రభుత్వ భవనాలు సౌర రూఫ్‌టాప్ వ్యవస్థలు ఏర్పాటు చేయటం జరుగుతుందని, 50/100 మెగా వాట్ అవర్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ప్రాజెక్టను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల కోసం సుమారు 4 మెగావాట్ల సౌర సామర్థ్యం కేటాయించబడనుందని సిఎస్ తెలిపారు. ప్రభుత్వం లబ్ధిదారుల నుండి అధిక సౌర విద్యుత్‌ను యూనిట్‌కు రూ.2.09 రేటుకు కొనుగోలు చేస్తుందని, దీనికి తగిన రీపేమెంట్ మెకానిజం రూపొందించేందుకు డిస్కమ్‌లు, ఏడీబీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మోడల్‌గా చేపట్టనున్న కుప్పం నియోజకవర్గ సౌర శక్తీకరణ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి ప్రత్యేక రుణ సౌకర్యం ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా అధికారులను సీఎస్ ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వ పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ) ఇప్పటికే 3.88 లక్షల రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటుకు మొదటి విడతగా ఆమోదం తెలిపిందని, ఈపీసి కాంట్రాక్టర్ల ఎంపికకు టెండర్లు విడుదలైనట్లు సీఎస్ తెలిపారు. 804 మెగావాట్ల సామర్థ్యానికి లెటర్స్ ఆఫ్ అవార్డ్ (లిఓఏ) జారీ అయ్యాయని, మరో 200 మెగావాట్లు తుది దశలో ఉన్నాయని తెలిపారు. యులా(యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్) మోడల్ అమలుకు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రభుత్వ గ్యారంటీని ఆమోదించినట్లు పేర్కొన్నారు. నాబార్డ్-ఏడీబీ అందచేసే రుణాన్ని అంగీకరించి ఎన్ఐడీఏ (నేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ అసిస్టెన్స్) రుణ ధర పునఃసమీక్ష కోరినట్లు ఏపీఈపీడీసిఎల్ అధికారులు తెలిపారు. డిస్కమ్‌లు, నాబార్డ్ మధ్య అన్ని పత్రాలు, రుణ ఒప్పందాలు సమయానుసారంగా పూర్తిచేయాలని, ఏడీబీ నిధుల విడుదలను వేగవంతం చేయాలని సీఎస్ ఆదేశించారు. ఏడీబీ, నాబార్డ్ అందిస్తున్న సహకారాన్ని సిఎస్ అభినందిస్తూ, పునరుత్పాదక ఇంధన కార్యక్రమాల అమలులో రాష్ట్ర డిస్కమ్‌లు వేగం పెంచాలని, ఆంధ్రప్రదేశ్ దేశంలోనే సౌర రూఫ్‌టాప్ రంగంలో అగ్రగామిగా నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏడీబీ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, సౌర రూఫ్‌టాప్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రామ్ కింద స్థిరమైన, పునరుత్పాదక విద్యుత్ ను ప్రోత్సహించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఏడీబీ సౌత్ ఏషియా ఎనర్జీ సెక్టార్ ఆఫీస్ డైరెక్టర్ డా. సుజాతా గుప్తా ఈ సమావేశంలో ప్రెజెంటేషన్ ఇస్తూ రాష్ట్రంలో ఎస్ఆర్ఐపీ ప్రోగ్రామ్ పురోగతి, ఆర్థిక అంశాల పై వివరించారు. వికాస్ మర్మత్, ఐఏఎస్ (ప్రాజెక్ట్ డైరెక్టర్, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ-కెఏడీఏ), డా. సుజాతా గుప్తా (డైరెక్టర్, ఎనర్జీ, ఏడీబీ), జేమ్స్ కోలంతరాజ్ (ప్రిన్సిపల్ ఎనర్జీ స్పెషలిస్ట్, ఏడీబీ), జిగర్ భట్ (సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్, ఎనర్జీ, ఏడీబీ), ఉపేంద్ర భట్, శంకర్ ఎన్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

# వర్సిటీలన్నింటికీ ఒకటే చట్టం

- రాష్ట్ర ప్రభుత్వం యోచన
- ఉన్నత విద్యాశాఖ కసరత్తు




విజయవాడ, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలన్నింటికీ కలిపి ఒకటే చట్టాన్ని ఉన్నత విద్యాశాఖ తీసుకురాబోతోంది. ఏకీకృత చట్టం రూపకల్పనకు ఏర్పాటు చేసిన కమిటీ నూతన మార్పులను కొలిక్కి తీసుకువచ్చింది. త్వరలో మరోసారి సమావేశం నిర్వహించిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఏపీ విశ్వవిద్యాలయాల చట్టానికి భారీగా సవరణలు తీసుకురానున్నారు. ఆర్జీయూకేటీ,పద్మావతి మహిళ, జేఎన్‌టీయూలు, క్లస్టర్, ఉర్దూ విశ్వవిద్యాలయాలకు వేర్వేరు చట్టాలున్నాయి. మిగతా సాధారణ విశ్వవిద్యాలయాలకు ఒక చట్టం అమల్లో ఉంది. వీటన్నింటికీ కలిసి ఏపీ విశ్వవిద్యాలయాల చట్టంగా తీసుకురానున్నారు. ఒకే చట్టంలో ఆయా వర్సిటీల ప్రాధాన్యాన్ని గుర్తించేలా అధికారాలు,పరిపాలన నిబంధనలు ఉంటాయి. రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయానికి ప్రత్యేక చట్టం ఉంది. అన్ని వర్సిటీలకు కులపతిగా గవర్నర్ ఉండగా, దీనికి కులపతిగా సీఎం ఉండేలా వైకాపా ప్రభుత్వంలో చట్టానికి సవరణ చేశారు. ఈ సవరణ చట్టం అమల్లోకి రాకుండానే గత ఎన్నికల్లో వైకాపా ఓడిపోయింది. దీంతో ప్రభుత్వం ఇన్‌ఛార్జి కులపతిగా ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తిని నియమించింది. గత ప్రభుత్వంలో చట్టానికి సవరణ చేసే వరకు కులపతిని ప్రభుత్వమే నియమించేది. ఆర్జీయూ కేటీకి సైతం కులపతిగా గవర్నర్ ఉండేలా చట్టానికి సవరణ తీసుకురానున్నారు. ఈ అంశాన్ని కొత్తగా రూపొందిస్తున్న ఏకీకృత చట్టంలో పెడతారు. ప్రస్తుత ఆర్జీయూకేటీ చట్టం ప్రకారం ఉపకులపతికి ఎక్కువ అధికారాలు లేవు. కులపతికే ఎక్కువ అధికారాలున్నాయి. ఇందులోనూ మార్పు తీసుకువస్తారు.ప్రస్తుతం విశ్వవిద్యాలయాలకు ఉన్న పాలకవర్గాన్ని ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఈసీ)గా పిలుస్తున్నారు. ఈసీ స్థానంలో విదేశాల్లో ఉండే విధానంలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌ను తీసుకువస్తారు. విద్యా సంస్థలను పరిశ్రమలతో అనుసంధానించి,ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు దీన్ని అమలు చేస్తారు. బోర్డు ఆఫ్ గవర్నర్స్‌లో పారిశ్రామికవేత్తలను సైతం నియమించుకునే అవకాశం ఉంటుంది. దీంతో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పు నైపుణ్య శిక్షణ, కొత్త కోర్సులు, ప్రవేశపెట్టేందుకు ఇది ఉపయోగపడుతుందని ఉన్నత విద్యాశాఖ భావిస్తోంది.ప్రస్తుతం ఈసీలో వీసీ, ప్రిన్సిపాల్, ప్రొఫెసర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుడు, వివిధ రంగాలకు చెందిన ప్రభుత్వం నియమించిన వ్యక్తులు సభ్యులుగా ఉంటున్నారు. సిలబస్‌లో మార్పు, విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగుపర్చడం లాంటి వాటిపై వీటిల్లో చర్చిస్తున్న దాఖలాలు లేవు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుతో విశ్వవిద్యాలయాల పరిధులపై కొంత అస్పష్టత నెలకొంది. గత ప్రభుత్వంలో ఒక వర్సిటీ పరిధి లోని కొన్ని డివిజన్లు వేరే జిల్లాలో కలపడం,రెండు జిల్లాల్లోని ప్రాంతాలలో కొత్త జిల్లా ఏర్పాటు చేశారు. ఏ జిల్లాను ఏ వర్సిటీ పరిధి లోకి తీసుకురావాలనే దానిపై అప్పట్లో స్పష్టత ఇవ్వలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిధిలో ఉంది. ఈ జిల్లాలో కలిపిన రంపచోడవం ఆదికవి నన్నయ వర్సిటీలో ఉంది.మన్యం జిల్లాలోని పార్వతీపురం ఆంధ్ర వర్సిటీ పరిధిలో ఉండగా... పాలకొండ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీలో ఉంది. ప్రకాశం జిల్లా లోని చీరాల డివిజన్‌ను బాపట్ల జిల్లాలో కలిపారు.బాపట్ల డివిజన్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఉండగా, చీరాల డివిజన్ లోని మండలాలు ఆంధ్రకేసరి వర్సిటీలో ఉన్నాయి. ప్రకాశం జిల్లా లోని కందుకూరు డివిజన్‌ను నెల్లూరు జిల్లాలో కలిపారు. కందుకూరు డివిజన్ లోని ఐదు మండలాలు ఆంధ్రకేసరిలో ఉన్నాయి. రాయలసీమ జిల్లాలు, నెల్లూరు శ్రీవెంకటేశ్వర రీజియన్ పరిధిలో ఉన్నాయి. ప్రకాశం జిల్లా ఆంధ్ర వర్సిటీ రీజియన్‌లో ఉంది. స్థానిక రిజర్వేషన్‌లోనూ మార్పు ఏర్పడింది. దీనిపైనా ఉన్నత విద్యాశాఖ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## నాగార్జున కుటుంబాన్ని
# బాధ పెట్టాలని కాదు

నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా: మంత్రి సురేఖ





**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబరు 12:** నటుడు నాగార్జున కుటుంబంపై తాను గతంలో చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. తాను చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నానని అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. నాగార్జున, ఆయన కుటుంబాన్ని బాధపెట్టాలనే ఉద్దేశంతో నేను ఆ వ్యాఖ్యలుచేయలేదు.ఆ వ్యాఖ్యల్లో ఏదైనా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా. నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా అని మంత్రి కొండా సురేఖ ఆ పోస్టులో పేర్కొన్నారు. 2024 అక్టోబరు 2 హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్‌లో మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లా డుతూ, బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో అనేక మంది సినిమా హీరోయిన్ల జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. సమంత,నాగ చైతన్య విడిపోవడానికి కారణం కేటీఆర్ అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గతంలో ఫోన్‌ట్యాపింగ్ ద్వారా అందరినీ ఇబ్బందులకు గురి చేశారన్నారు. హీరోయిన్స్ తొందరగా పెళ్లిళ్ల చేసుకుని, సినిమాలు విడిచి వెళ్లిపోవడానికి కెటిఆరే కారణమని ఆరోపణలు చేశారు. ఈ విషయంపై స్పందించిన సినీ నటి సమంత అప్పుడు ఎక్స్ వేదికగా స్పందించి తన విడాకులు వ్యక్తిగత విషయమని చెప్పారు.ఈ మాటలపై నటి సమంతకి మంత్రి కొండా సురేఖ క్షమాణలు చెప్పారు. మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలపై సినీ హీరో నాగార్జున గతంలో నాంపల్లి కోర్టును ఆశ్రయించి మంత్రిపై క్రిమినల్ కేసు, పరువునష్టం దావావేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. తాజాగా నాగార్జున, ఆయన కుటుంబంపై చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ ఉపసంహరించుకుంటున్నానని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

# జల్ జీవన్ మిషన్ పనుల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

- ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ సమస్యల పరిష్కరించాలి
- జల్ జీవన్ లక్ష్యాలు పూర్తి చేయాలి: డి.సిఎం పవన్‌కల్యాణ్



అమరావతి, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: జల్ జీవన్ మిషన్ పనుల పర్యవేక్షణకు ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని, అన్ని శాఖల సమన్వయంతో పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. కలెక్టర్ల నేతృత్వంలో గ్రామీణ నీటి సరఫరా శాఖతో పాటు పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ, అటవీ శాఖలను సమన్వయం చేసుకునే విధంగా ఈ పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేసుకొనే ప్రక్రియను ముందుకు తీసుకు వెళ్ళాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శికి సూచించారు. ప్రతి రోజు పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం, పనులకు ఏమైనా అడ్డంకులు ఉంటే జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకునేలా ఈ పర్యవేక్షణ బృందాలు పని చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగు నీరు అందించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కలల సాకారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అధికారులంతా నిబద్ధతతో పని చేయాలని సూచించారు. నిర్దేశిత గడువు లోపు పనులు పూర్తి చేసి స్వచ్ఛమైన, శుద్ధ జలాలు ప్రజలకు అందించేందుకు కంకణబద్ధులై పని చేయాలన్నారు. అదే సమయంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. జల్ జీవన్ మిషన్ పనుల పురోగతిపై గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఐదు జిల్లాల్లో చేపట్టిన ప్రాజెక్టులకు అవసరం అయిన నిధుల సమీకరణ, పనులు వేగవంతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "పల్లె పల్లెకు శుద్ధ జలాలు అందించాలన్న కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. జల్ జీవన్ మిషన్ పరిధిలో ఇప్పటికే 5 జిల్లాల్లో ఇంటింటికీ తాగునీరు అందించే లక్ష్యంతో మెగా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాం. ప్రకాశం జిల్లా, మార్కాపురంలో ఈ బృహత్తర పథకాన్ని స్వయంగా ప్రారంభించాం. రూ.1,290 కోట్లతో మొదలు పెట్టిన ప్రాజెక్టు పూర్తి అయితే ప్రకాశం పశ్చిమ ప్రాంతంలో 21 లక్షల మందికి పైగా తాగు నీరు అందించవచ్చు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతంగా పేరున్న ప్రకాశం పశ్చిమ భాగానికి ఈ ప్రాజెక్టు సంజీవని వంటిది. ఉభయ గోదావరి జిల్లాల్లో జల్ జీవన్ పనుల పురోగతిజల్ జీవన్ మిషన్ పనుల పురోగతిలో ఉభయ గోదావరి జిల్లాలు ముందంజలో ఉన్నట్టు అధికారులు తెలిపిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 10 నియోజకవర్గాల్లో 15.21 లక్షల మందికి తాగు నీరు అందించాలన్న లక్ష్యంతో పనులు మొదలుపెట్టాం. రూ. 1,650 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనుల్లో భాగంగా ఇప్పటికే రెండు నీటి ట్రీట్మెంట్ ప్లాంటులు, 36 నీటి సంపులు, 24 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణంలో ఉన్నాయి. లక్ష 50 వేలకుపైగా ఇళ్లకు కుళాయిల కనెక్షన్లు ఇస్తాం. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో కూడా పనులు సంతృప్తికరంగానే ముందుకు సాగుతున్నట్టు తెలుస్తోంది. మిగిలిన జిల్లాల్లో కొంత వేగం పుంజుకోవాల్సి ఉంది. పనుల పురోగతికి శాఖల సమన్వయం ముఖ్యం. అయితే ఈ ఐదు జిల్లాల పరిధిలో పలు చోట్ల సర్వీస్ రిజర్వాయర్ల నిర్మాణం కోసం భూములు అప్పగించాల్సి ఉన్న విషయాన్ని అధికారులు మా దృష్టికి తీసుకువచ్చారు. పశ్చిమ గోదావరి, చిత్తూరు జిల్లాల్లో రోడ్ల వెంట పైప్ లైన్లు వేసేందుకు రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. కొన్ని చోట్ల ప్రైయివేటు భూములు సేకరించాల్సి ఉంది. ప్రకాశం జిల్లా పరిధిలో అటవీ శాఖ అనుమతులు కూడా పొందాల్సి ఉందని అధికారులు చెప్పారు.

జల్ జీవన్ మిషన్ పనులకు మన ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుంది. చిన్న చిన్న సమస్యల కారణంగా పనులకు ఆటంకాలు ఉంటే సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ జిల్లా కలెక్టర్లు వాటిని తొలగించే దిశగా ప్రయత్నాలు చేయాలి. జల్ జీవన్ మిషన్ పనుల పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసుకోవాలి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, రోడ్లు భవనాల శాఖ, అటవీశాఖ, రెవెన్యూ తదితర శాఖలకు నుంచి అధికారులు ఇందులో సభ్యులుగా ఎంపిక చేసుకోవాలి. జిల్లా కలెక్టర్లు ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్షలు నిర్వహించి పనులు వేగవంతంగా ముందుకు తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకోవాలి. కలెక్టర్ స్థాయిలో పరిష్కారం కాని జటిలమైన సమస్యలు ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి. అదే సమయంలో పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదు. కూటమి ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పనులకు నిధుల కొరత లేకుండా ఏర్పాట్లు చేస్తోంది. ఐదు జిల్లాల పరిధిలో రూ.7,910 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులు 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని పవన్ కల్యాణ్ అన్నారు.



## ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచితంగా యుపిఎస్సి
# సివిల్స్ కోచింగ్

అమరావతి, నవంబర్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు యూపీఎస్సీ సివిల్స్ ఉచిత శిక్షణ ఇస్తున్నామని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం నాడు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 340 మంది నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు యూపీఎస్సి సివిల్స్ ప్రిలిమినరీ ఎగ్జామ్ కి ఉచిత శిక్షణ ఇవ్వనున్నాం. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి డా.బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. 4 నెలల శిక్షణా కాలంలో (10.12.2024 నుంచి 10.04.2026 వరకు) అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తాం. ఈ నెల 13 నుంచి 16 వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించబడతాయి. అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తాం, మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తాం. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి, మరిన్ని వివరాలకు హెచ్‌టిటిపిఎస్:// ఎపిస్టడీసర్కిల్. ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్ సైట్‌ని సంప్రదించాలని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి తెలిపారు.

13-11pg10 12 ONG_13-11pg10.qxd 12/Nov/25 10:09 PM Page 1



## వరల్డ్ టెస్టు ఛాంపియన్:

# భారత్‌కు అగ్ని పరీక్ష

### ఫైనల్స్‌కు కీలకం.. పాయింట్ల పట్టికలో బిగ్ ఛేంజింగ్

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా, టీమిండియా మధ్య జరిగే సిరీస్ తర్వాత డబ్ల్యూటిసి పాయింట్ల పట్టికలో పెద్ద మార్పు ఉంటుంది. ఈ రెండు టెస్ట్‌ల సిరీస్ 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో ఒక మలుపు కానుంది. డబ్ల్యూటిసి పాయింట్ల పట్టికలో రెండు జట్ల స్థానాలను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. దీంతో ఈ సిరీస్‌ను కైవసం చేసుకుని ఫైనల్స్‌కు చేరే విషయమై రెండు జట్లుకూ అగ్ని పరీక్ష లాంటిదే. ఈనెల 14న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ప్రారంభమయ్యే భారత్, దక్షిణాఫ్రికా మధ్య టెస్ట్ సిరీస్ రెండు జట్లకు కీలకం. గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుకోవడం సులభం అవుతుంది. ప్రస్తుతం భారత్ 61.90 పాయింట్లతో డబ్ల్యూటిసి స్టాండింగ్స్‌లో మూడవ స్థానంలో ఉంది. ఇంగ్లాండ్‌తో సిరీస్‌ను డ్రా చేసుకుని వెస్టిండీస్‌ను ఓడించిన తర్వాత,



దక్షిణాఫ్రికాతో జరిగే ఈ సిరీస్ భారత్‌కు నిజమైన పరీక్ష అవుతుంది. బ్యాటింగ్‌లో శుభ్‌మాన్ గిల్ (946), బౌలింగ్‌లో మహమ్మద్ సిరాజ్ (33 వికెట్లు) భారత జట్టు కీలక ఆటగాళ్లలో ఉన్నారు. వచ్చే ఏడాది ఆస్ట్రేలియాతో జరిగే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ముందు స్పిన్ స్నేహపూర్వక పిచ్‌లపై స్వదేశంలో ఆధిపత్యం చెలాయించడం ద్వారా భారత జట్టు తన స్థానాన్ని పదిలం చేసుకోవాలని చూస్తుంది. గతఫైనల్ విజేతలైన దక్షిణాఫ్రికా50 పాయింట్లతో నాల్గవస్థానంలో ఉంది. పాకిస్తాన్‌తో జరిగిన సిరీస్‌ను 1-1తో సమంచేసిన తర్వాత, టోనీ డి జోర్జీ (175), సైమన్ హార్మర్ (13 వికెట్లు) నేతృత్వంలోని జట్టు వరుసగా రెండోసారి ఫైనల్‌కు చేరుకోవడానికి ఈ చక్రంలో బలమైన ఆరంభం చేయాలని చూస్తోంది. ముఖ్యంగా, దక్షిణాఫ్రికా 2019 తర్వాత తొలిసారిగా భారతదేశంలో టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. కోల్‌కతా, గౌహతిపిచ్‌లు స్పిన్ బౌలర్లకు అనుకూలమైనప్పటికీ, మహమ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాష్ దీప్ వంటి ఫాస్ట్ బౌలర్లతో కూడిన భారత పేస్ బ్యాటరీ కూడా చాలా ప్రమాదకరమైనది. ఈ మ్యాచ్ స్టాండింగ్స్‌లో మొదటి నాలుగు జట్లలో స్థానం కోసం పోటీని మరింత తీవ్రతరం చేస్తుంది. ఈ సిరీస్‌లో భారత్ రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే, టీమిండియా పాయింట్ల పట్టికలో రెండవ స్థానానికి చేరుకుంటుంది. ఇదేసమయంలో దక్షిణాఫ్రికా గణనీయమైన ఓటమిని చవిచూస్తుంది. వారు నాల్గవ స్థానం నుండి ఆరో స్థానానికి పడిపోతారు. దక్షిణాఫ్రికా రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే, టీమిండియా ఐదవ స్థానానికి చేరుకుంటుంది.



## జాతీయ స్విమ్మింగ్‌లో యు జిది కి కాంస్యం

**న్యూఢిల్లీ:** చైనాకు చెందిన 13 ఏళ్ల యు జిది జాతీయ క్రీడలలో సంచలనం సృష్టించింది. తన 13వ పుట్టినరోజు తర్వాత ఒక నెల లోపే, చైనా సంచలనం యు జిది షెన్‌జెన్‌లో జరిగిన జాతీయ క్రీడల ఈతలో 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీలో విజయం సాధించి తన తొలి ఆసియా రికార్డును సృష్టించింది. యు 2:07.41 సమయంతో 2012 లండన్ క్రీడల్లో 16 సంవత్సరాల వయసులో 2:07.57 సమయంలో ఒలింపిక్ స్వర్ణం గెలుచుకున్న యే షివెన్ ఆసియా రికార్డును అధిగమించింది. గత సంవత్సరం చైనా ఒలింపిక్ ట్రయల్స్‌లో యు చాలా ప్రదర్శన నిరాశాజనకంగా సాగింది. అక్కడ ఆమె 11 సంవత్సరాల వయసులో పారిస్ క్రీడలకు అర్హత సాధించలేకపోయింది. అయితే మే నెలలో, ఆమె 400 ఐఎమ్, 200 బటర్‌ఫ్లైలలో జాతీయ టైటిళ్లను గెలుచుకుంది. అలాగే సింగపూర్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లకు అర్హత సాధించడానికి 200 ఐఎమ్‌లో రన్నరప్‌గా నిలిచింది. అక్కడ ఆమె చైనా 4+200 ఫ్రీస్టైల్ రిలే జట్టులో కాంస్య పతకంతో అతి పిన్న వయస్కురాలిగా నిలిచింది. ఆమె సింగపూర్ మీట్‌లో తన మూడు వ్యక్తిగత ఈవెంట్లు, 200 మరియు 400, 200 బటర్ ఫ్లైలలో నాల్గవ స్థానంలో నిలిచింది. 2022 ఆసియా క్రీడల ఛాంపియన్, 20 ఏళ్ల రన్నరప్ యు యిటింగ్ కంటే యు దాదాపు సెకను వేగంగా పూర్తి చేసింది. ఈ ఈవెంట్‌లో ఇప్పటివరకు ఎనిమిది మంది ఈతగాళ్ళు మాత్రమే వేగంగా దూసుకెళ్లారు.

# వన్డేలో రోహిత్ నం.1

### నాలుగు, ఐదో స్థానాల్లో గిల్, కోహ్లీ



**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ ప్లేయర్ల హవా కొనసాగుతోంది. బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలోను, విరాట్





కోహ్లీ ఐదో స్థానంలో ఉన్నారు. గత ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానంలో ఉండిన విరాట్ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఐదో స్థానానికి ఎగబాకాడు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో ఘోరంగా విఫలమైన బాబర్ రెండు స్థానాలు కోల్పోయి ఏడుకు పడిపోయాడు. టాప్-10లో మరో టీమిండియా స్టార్ ప్లేయర్ శ్రేయస్ అయ్యర్ ఆస్ట్రేలియా సిరీస్‌లో హాఫ్ సెంచరీతో రాణించి తొమ్మిదో స్థానాన్ని కాపాడుకున్నాడు. ఈ ర్యాకింగ్స్‌లో ఇద్దరు పాకిస్తాన్ ఆటగాళ్లు భారీ లబ్ధి పొందారు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో రాణించినందుకు యువ ఆల్‌రౌండర్ సైమ్ అయూబ్ ఏకంగా 18 స్థానాలు మెరుగుపరచుకుని 36కు చేరుకున్నాడు. అదే దక్షిణాఫ్రికా సిరీస్‌లో పర్వాలేనిపించి, ఈ నెల 11న శ్రీలంకతో జరిగిన వన్డేల్లో శతక్కొట్టిన పాక్ టీ20 కెప్టెన్ సల్మాన్ అఘా 14 స్థానాలు మెరుగుపరచుకుని 16కు చేరాడు. ఇక బౌలర్ల విషయానికి వస్తే ఆఫ్ఘనిస్తాన్ స్టార్ రషీద్ ఖాన్ టాప్ ప్లేస్‌లో కొనసాగుతుండగా, ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా అర్చర్ 2 స్థానాలు మెరుగుపర్చుకుని మూడో ప్లేస్‌కు చేరాడు. దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు.






## ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో పతకాల వేటలో అభిషేక్, దీపిక

**న్యూఢిల్లీ:** ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్ 2025లో భారత్ ఆర్చలు పతకాల కోసం పోరు కొనసాగిస్తూ ముందుకు దూసుకు వెళుతున్నారు. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో బుధవారం జరిగిన ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత ఆర్చర్లు ఎలిమినేషన్ రౌండ్ చివరి రోజున తమ ఘన విజయాన్ని కొనసాగించి మరో రెండు పతకాల మ్యాచ్‌లకు చేరుకున్నారు. ఇందులో భాగంగా భారత్ ఆర్చర్లు అభిషేక్ వర్మ, దీపిక కుమారి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌కు చేరుకుంది. మరోపక్క రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ద్వయం అన్షిక కుమారి, యశ్దీప్ భోగే ద్వయం కాంస్య పతకం కోసం పోరాడనుంది. భారత రికర్వ్ మిక్స్‌డ్ జట్టు తమ సెమీఫైనల్ మ్యాచ్‌లో చైనీస్ తైపీ చేతిలో ఓడిపోయినా కానీ ఈ నెల 14న దక్షిణ కొరియాతో జరిగే కాంస్య పతక మ్యాచ్‌లో పోరాడనుంది. అదేవిధంగా భారత కాంపౌండ్ జట్టు ఎలిమినేషన్ రౌండ్ అంతటా ఆధిపత్యం ప్రదర్శించి, ఫైనల్‌కు చేరుకునే మార్గంలో యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్, వియత్నాం, కజకిస్తాన్‌లను ఓడించింది. ఇక ఫైనల్లో, భారత జంట ఇప్పుడు బంగ్లాదేశ్‌తో తలపడనుంది, బంగ్లాదేశ్ కూడా సెమీఫైనల్‌లో టాప్ సీడ్ దక్షిణ కొరియాను ఓడించి భారీ విజయాన్ని సాధించింది. దీనితో, భారత్ ఇప్పుడు మూడు కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌ల ఫైనల్‌లో ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇదే సమయంలో ఈ నెల 13న బంగారు పతకాల కోసం పోరాడుతుంది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో సెమీఫైనల్లో వారికి ఇద్దరు ఆర్చర్లు కూడా ఉన్నారు.

## జపాన్ మాస్టర్స్‌లో రెండో రౌండ్‌కు లక్ష్య



**న్యూఢిల్లీ:** జపాన్ మాస్టర్స్ 2025లో భారత్ షట్లర్ లక్ష్య సేన్ రెండో రౌండ్ కు చేరుకోగా, కిరణ్ జార్జ్, ఆయుష్ శెట్టి ఓటమి పాలయ్యారు. కుమామోటో నగరంలో బుధవారం జరిగిన బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 ఈవెంట్ అయిన జపాన్ మాస్టర్స్‌లో భారత క్రీడాకారుడు లక్ష్య మరో రౌండ్‌కు దూసుకెళ్లాడు. ఏడో సీడ్ లక్ష్య 39 నిమిషాల్లో ప్రపంచ 26వ ర్యాంకర్ కోకి వటనాబేను 21-12, 21-16 తేడాతో ఓడించాడు. క్వార్టర్ ఫైనల్స్‌లో స్థానం కోసం అతడు సింగపూర్‌కు చెందిన జియా హెంగ్ జాసన్ టెహ్‌తో తలపడతాడు. అయితే, కిరణ్, ఆయుష్ ఇద్దరూ వరుస గేమ్‌లలో ఓడిపోయారు. మలేషియాకు చెందిన కోక్ జింగ్ హాంగ్ కిరణ్‌ను 22-20, 21-10 తేడాతో ఓడించగా, నాల్గవ సీడ్ జపనీస్ కోడై నరోకా 21-16, 21-11 తేడాతో శెట్టిని ఓడించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్ మరియు రుత్విక గద్దె నాలుగు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని చివరికి అమెరికన్ల ప్రెస్లీ స్మిత్ మరియు జెన్నీ గై చేతిలో 12-21, 21-19, 20-22 తేడాతో ఓడిపోయారు. ఈ నెల 13న పురుషుల సింగిల్స్ ప్రారంభ రౌండ్‌లో హెచ్ఎస్ ప్రణయ్ మరియు తరుణ్ మన్నెపల్లి కూడా పోటీ పడతారు

## వచ్చే ఐదేళ్లలో రూ. 99 లక్షల కోట్లకు

# 'ప్రైవేటు' సంపద




**ముంబయి, నవంబరు 12:** ఆసియాలోని ప్రైవేటు వ్యక్తులు కుటుంబ బిజినెస్ చూసుకుంటున్న బిలియనీర్లలో వారసులు ముందుకురాకపోవడం, మరికొందరు శ్రద్ధ, ఆసక్తిచూపించకపోవడంవల్ల వారి బిలియన్ ఆస్తుల సామ్రాజ్యాలు వారసులకు ఇవ్వలేకపోతున్నారు. మరికొన్ని కుటుంబాల్లో అయితే వారసులకు సరైన అవగాహన, శ్రద్ధ లేకపోవడం కూడా కారణం అవుతోంది. యుబిఎస్ ప్రైవేట్‌బ్యాంకు, బోస్టన్ కన్సల్టింగ్‌గ్రూప్, నేషనల్‌యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో ఎంతో ఒత్తిడి వస్తే తప్ప ఫ్యామిలీ బిజినెస్‌లు విస్తరణపరంగా లేవని వెల్లడించాయి. కొన్ని కుటుంబాల్లో అయితే న్యాయపరమైన చిక్కుల్లో ఉన్నాయి. ఆస్తులు స్తంభనకు గురవుతున్నాయి.ప్రైవేటు సంపద మొత్తం 2029 నాటికి 99 లక్షలకోట్ల డాలర్లకు చేరుకోగలదని అంచనా. మొత్తం 228 హెచ్ఎన్ఐలను ఏడు ఆసియన్ మార్కెట్లలో సర్వేచేస్తే మొత్తం 46 కుటుంబ బిజినెస్‌లలో 91శాతం మంది తమ కుటుంబంలోనే లీడర్‌షిప్ ఉండాలని కోరుకుంటున్నారు. 28శాతం మంది వారసులకు ఆసక్తిలేదని, 24 శాతం మంది వారసులు బిజినెస్ నిర్వహణకు సిద్ధం కాలేదని తేలింది.

28శాతం మంది బిజినెస్ లీడర్లుమాత్రం తాము ఎవరికి ఇవ్వాలనేది కూడా చెప్పలేదు. బోస్టన్‌గ్రూప్ సర్వేప్రకారం ప్రైవేటు సంపద భారీగానే పెరుగుతూ వస్తోంది. సింగపూర్‌కు 765 బిలియన్ డాలర్లు వస్తే హాంకాంగ్ 975 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఈ మొత్తంలో 80శాతం ఇతర ఆసియా దేశాలనుంచే వస్తోంది. వారసులపై సరైన నిర్ణయాలుతీసుకోక పోవడంవల్ల ఎక్కువ కుటుంబ బిజినెస్‌లు న్యాయవివాదాల్లోను, అతితక్కువ పరివర్తన దశలోను ఉన్నాయి. ఈతరుణంలో ఫ్యామిలీ బిజినెస్ బిలియనీర్లు అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతో ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బిజినెస్ వ్యవహారాలను అప్పగించడంలో కొన్ని ఫ్యామిలీ గ్రూప్‌లు ఆరోగ్యసంక్షోభంకారణంగాను అప్పగించలేదు. 43శాతం మంది మాత్రం పరిస్థితులు డిమాండ్‌చేస్తే బిజినెస్‌బాధ్యతలు తమ వారసులకు అప్పగించాల్సి ఉంటుందని వెల్లడించారు.

# టాటాట్రస్టుల్లో నెవెల్లీటాటా, భాస్కర్‌భట్‌ల నియామకం

### నియామక విధానంపై నిరసన తెలిపిన వేణుశ్రీనివాసన్



**ముంబయి, నవంబరు 12:** టాటాట్రస్టుల్లో బోర్డు సభ్యుల నియామకాల్లో వివాదాలు తారస్థాయికి చేరుతున్నాయి. మెహ్లీమిస్త్రీకి శాశ్వత నియామకం రద్దయిన తర్వాత మళ్లీట్రస్టులో నియామకాలు వివాదం అవుతున్నాయి. ఇపుడు రతన్‌టాటా ట్రస్టులో వేణుశ్రీనివాసన్‌కూడా ట్రస్టుసభ్యులుగా ఉన్నారు. ట్రస్టు వైస్‌ఛైర్మన్‌కూడా అయిన ఆయన నెవెల్లీ టాటా, భాస్కర్‌భట్‌ల నియామకానికి అనుసరించిన విధానాన్ని వ్యతిరేకించారు. అజెండాల్లో ఈ అంశాలు లేవని, నెవెల్లీ, భట్‌లు సర్ దొరాబ్జీ టాటాట్రస్టుల్లో బోర్డు సభ్యుల్లో నియమితులు కావడం నిబంధనలకు విరుద్ధమనిఅన్నారు. సర్‌రతన్‌టాటా ట్రస్టు, సర్ దొరాబ్జీ టాటా ట్రస్టులు టాటాట్రస్టుల్లో రెండు అతిపెద్ద కుటుంబ ట్రస్టులని చెప్పాలి. టాటాసన్స్‌లో ఈ రెండు ట్రస్టులు 51శాతం వాటాలతో ఉన్నాయి. అజెండాలోలేని అంశాన్ని తీర్మానించే సమయంలో సమగ్రచర్చలు జరగాల్సి ఉంటుందని, ఏకపక్షంగా తీర్మానాలు చెల్లుబాటుకావని సమావేశంలో వాదించినట్లు సమాచారం. ముందు ఎస్‌డిటిటి సమావేశంతర్వాత ఎస్ఆర్‌టిటి సమావేశాలు జరిగాయి. మహారాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన సెప్టెంబరు ఒకటవ తేదీ ఆర్డినెన్స్ ప్రకారం ట్రస్టీల కాలపరమితి 3ఏళ్లవరకూ ఉంటుంది. జీవితకాల ట్రస్టీల సంఖ్యమాత్రం పరిమితంగానే ఉంటుంది. ఎస్‌డిటి సమావేశంలో న్యాయవాది ట్రస్టీ డేరియస్ ఖంబాట్టా, ప్రమిత్‌ఝవేరీలు నెవిల్లీ టాటా, భాస్కర్ భట్‌ల నియామకాలను ప్రతిపాదించారు. సభ ట్రస్టు సభ్యుడు విజయ్‌సింగ్ ముందు మౌనంగానే ఉన్నా తర్వాత అంగీకరించారని సమాచారం. ఎగ్జిక్యూటివ్ కమిటీని రద్దుచేసి ఛైర్మన్ నోయిల్‌టాటాకే మొత్తం అధికారాలను కట్టబెడుతూ తీర్మానించారు. ఈ కమిటీలో వేణుశ్రీనివాసన్, విజయ్‌సింగ్, నోయల్ టాటా, మెహ్లిమిస్త్రీలు సభ్యులుగాఉన్నారు. ఇక రతన్‌టాటా ట్రస్టు సమావేశంలో డారియస్ ఖంబాట్టా, జెహంగీర్, వీరిద్దరి నియామకాలు ప్రతిపాదించారు. దీనితో వేణుశ్రీనివాసన్ వ్యతిరేకించినట్లు అజెండాలోలేని అంశమని స్పష్టం చేసినటప్లు సమాచారం. ఈ తీర్మానం 'ఇతరత్రా ఏ అంశం అయినా' అన్న ప్రాతిపదికన ప్రవేశపెట్టారని ఆయన నిరసన తెలిపినట్లు సమాచారం.

## మూడోరోజూ లాభాల్లో స్టాక్ సూచీల ర్యాలీ



### బీహార్ ఎగ్జిట్‌పోల్స్ సెంటిమెంట్ మద్దతు

**ముంబయి, నవంబరు 12:** దేశీయ ఈక్విటీ సూచీలు మూడోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. నిఫ్టీ 25,850 మార్కు ఎగువన స్థిరపడింది. అమెరికా భారత్‌లమధ్య వాణిజ్య డీల్‌పై సానుకూల స్పందనలు రావడంతో ఇన్వెస్టర్ సెంటిమెంట్ బలపడింది. దీనికితోడు బీహార్ ఎగ్జిట్‌పోల్స్‌లో ఎన్డీయే దూకుడు ఉన్నట్లు రావడంతో స్టాక్‌సూచీలు మరింతగాపెరిగాయి. ఎస్‌అండ్‌పి బిఎస్ఇ సెన్సెక్స్ 595.19 పాయింట్లుపెరిగి 84,466.51 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 180.85 పాయింట్లుగెలిచి 25,875.80 పాయింట్లవద్ద స్థిరపడింది సెన్సెక్స నిఫ్టీలు రెండూ కూడా 1.50 శాతంచొప్పున పెరిగాయి. ఇక బిఎస్ఇమిడ్‌క్యాప్‌సూచీ 0.44శాతంపెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.76శాతం పెరిగింది. మార్కెట్ సెంటిమెంట్ బలంగా కనిపించింది. సూచీలపరంగా చూస్తే నిఫ్టీ ఐటి సూచీ 2.04శాతం, ఆటో సూచీ 1.24శాతం, ఫార్మాసూచీ 1శాతంచొప్పున నిఫ్టీలో ర్యాలీతీసాయి. ఇక రియాల్టీ సూచీ 0.49శాతం, మెట్‌సూచీ 0.16శాతం చొప్పున క్షీణించాయి. 10ఏళ్ల యుఎస్ బాండ్ లు 0.32శాతం క్షీణించి 6.478శాతంగామాత్రమే ఉంది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 88.50వద్ద ముగిసాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ డిసెంబరు 5 నాటికి 1,24,307 రూపాయలుగా ఉంది. కమోడిటీ పరంగాచూస్తే బ్రెంట్‌ముడిచమురు 57 సెంట్లు తగ్గి 65.59 డాలర్లుగా నడిచాయి. ఇక గ్లోబల్ మార్కెట్లలోయూరోపియన్ ఎగువన ముగిసాయి. అమెరికా ప్రభుత్వషట్‌డౌన్‌కు తెరపడటంతో యూరో సూచీలన్ని లాభాల్లోనే ముగిసాయి. జర్మనీ ద్రవ్యోల్బణం 2.3శాతంగా అక్టోబరులో ఉంది. వినియోగరంగ ధరలప్రకారంచూస్తే యూరోపియన్ యూనియన్ దేశాల్లో 2.4శాతంగా రిటైల్‌ద్రవ్యోల్బణం నమోదయింది. ఇసిబి వడ్డీరేట్లను స్థిరంగానే కొనసాగించింది. ఆసియా మార్కెట్లు ఎగువన ముగిసాయి. ఆసియా దేశం అమెరికా షట్‌డౌన్‌కు తెరపడుతుండటంతో సూచీలు వడివడిగా కదిలాయి. ఇక అమెరికా డౌజోన్స్ సూచీ ర్యాలీ తీసింది. నాస్‌డాక్ కాంపోజిట్‌లో మాత్రం ఇన్వెస్టర్లు టెక్నాలజీ స్టాక్స్‌నుంచి విత్‌డ్రాచేసారు. 30స్టాక్ డౌజన్స్ 559.33 పాయింట్లుపెరిగింది. ఎస్‌అండ్‌ఫి500 కూడా 0.21శాతంపెరిగింది. టెక్నాలజీ హెవీస్టాక్స్ ఉన్న నాస్‌డాక్ 0.25శాతం నష్టపోయింది.


## దిగివచ్చిన రిటైల్‌ద్రవ్యోల్బణం

### ఆహారద్రవ్యోల్బణం మరింతగా తగ్గుదల

**న్యూఢిల్లీ, నవంబరు 12:** రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబరునెలలో 0.25శాతంగా నమోదయింది. గతనెలలో 1.54శాతం ఉన్న ద్రవ్యోల్బణం సానుకూల గణాంకాలతో దిగివచ్చిందని కేంద్ర అర్థగణాంకశాఖ పథక నిర్వహణశాఖ వెల్లడించింది. ఆహార ధరలు రికార్డుస్థాయిలో తగ్గాయి. ఇటీవలి జిఎస్టీ సేవల తగ్గింపు, హేతుబద్ధీకరణతో విభిన్నరంగాల్లో ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఆహారద్రవ్యోల్బణం అక్టోబరులో మైనస్ 5.02శాతంకు వచ్చింది. గ్రామీణప్రాంతాల్లో మనస్ 4.85శాతం, పట్టణప్రాంతాల్లో మైనస్ 5.18శాతం చొప్పున నమోదయింది. ప్రస్తుత కన్సూమర్ ప్రైస్ ఇండెక్స్ సిరీస్‌లో అక్టోబరులోనే ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గింది. ఇక హౌసింగ్ ద్రవ్యోల్బణం 2.96శాతంగా ఉంది. ఇక విద్యారంగపరంగా గ్రామీణ పట్టణప్రాంతాల్లో స్వల్పంగా తగ్గాయి. 3.49శాతం నమోదయింది. అదే సెప్టెంబరులో 3.44 శాతంగా ఉంది. ఆరోగ్యరంగపరంగా ద్రవ్యోల్బణం 3.86శాతంగా ఉంది.

సెప్టెంబరులో ఉన్న 4.39శాతంనుంచి గణనీయంగా తగ్గింది. రవాణా, కమ్యూనికేషన్ రంగంలో 0.94 శాతంగా ఉంది. ఖర్చులు తగ్గడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఇంధనం, విద్యుత్ పరంగా స్థిరంగా 1.98శాతంవద్దనే ఉంది. ఇక రాష్ట్రాలపరంగాచూస్తే కేరళలో అత్యధికంగా 8.56శాతంగా ఉంది. జమ్ముకాశ్మీర్‌లో 2.95శాతం, కర్ణాటకలో 2.34 శాతంగా ఉంది. ఇక ఢిల్లీ, అస్సాం, జార్ఖండ్, బీహార్‌లలో తక్కువ స్థాయిలోనే రిటైల్‌ద్రవ్యోల్బణం నమోదయింది. మైనస్ 1.97శాతంగా ఉంది. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లో మైనస్ 1.71శాతం, మధ్యప్రదేశ్‌లో మైనస్ 1.62శాతంగా నడిచింది.

## దలాల్‌స్ట్రీట్‌లోకి భారీ డిమాండ్‌తో 'గ్రో' ఎంట్రీ!




**ముంబయి, నవంబరు 12:** 'గ్రో' కంపెనీ ఐపిఒ బుధవారం దలాల్‌స్ట్రీట్‌లోకి వచ్చింది. ఇప్పటికే అంచనాలకు మించి 17.60 రెట్లు అధిక బిడ్లను అందుకున్న కంపెనీ ఇష్యూధరను రూ.100గా నిర్ణయించింది. గ్రో మార్కెట్‌ప్రీమియం ట్రేడింగ్‌లో స్టాకును 4శాతం ప్రీమియంకకు లిస్టింగ్‌చేసింది. ఐపిఒ 6632.30 కోట్లుగా ఉంది. మొత్తంగా 6,41,87,00400 షేర్లకు బిడ్లు వచ్చాయి. అయితే కేవలం 36,47,76,528 షేర్లకు మాత్రమే ఐపిఒ ఉంటుంది. సంస్థాగత ఇన్వెస్టర్లు 22.02 రెట్లు కొనుగోళ్లు జరిపితే ఇతర ఇన్వెస్టర్లు 14.20 రెట్లు ఇన్వెస్ట్‌మెంట్ చేసారు.

రిటైల్ ఇన్వెస్టర్లుకూడా 9.43రెట్లు కొనుగోళ్లు జరిపినట్లు అంచనా. తాజా ఈక్విటీ మొత్తం రూ.1060 కోట్లుగా ఉంది. ఆఫర్‌ఫర్ సేల్‌కింద 5572.30 కోట్లు ఉంటుందని కంపెనీ చెపుతోంది. పీక్ 15 భాగస్వాములు రిబ్బిట్ క్యాపిటల్ ఫైవ్, సీక్వోయా క్యాపిటల్ గ్లోబల్ గ్రోత్‌ఫండ్-3 ఇతర సంస్థలు ఇప్పటికే ఇన్వెస్టర్లుగా ఉన్నాయి. గ్రోబిజినెస్ విస్తరణకు ఈ నిధులు వెచ్చిస్తారు. రూ.225 కోట్లు బ్రాండ్ బిల్డింగ్, మార్కెట్ పనితీరు పెంచుకోడానికి ఖర్చవుతుంది. 205కోట్ల ఎన్‌బిఎఫ్‌సికి కేటాయిస్తారు. గ్రో క్రెడిట్‌సెర్వ్ టెక్నాలజీకి ఈనిధులు వెచ్చిస్తారు. మరో 167.5కోట్లు ఫండ్ మార్జిన్ ట్రేడింగ్ ఆపరేషన్స్‌లో ఉంటాయి. గ్రో ఇన్వెస్ట్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఖర్చవుతాయి. ఇక 152.5 కోట్లు క్లౌడ్, మౌలికవసరుల అప్‌గ్రేడేషన్ కోసం కేటాయించారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps